# అనగనగా ఓ మంచికథ

2014



శ్రీ కౌముది

మీ మనోగతాల్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 102

## కౌముది మాసపత్రికలో 2014 జనవరి నుంచి డిసెంబర్ వరకూ

## ప్రచురించబడిన అలనాటి ఆణిముత్యాలు

# విషయసూచిక


| ఏడాది | నెల | కథ | రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2014 | 01 | ఉరి | విశ్వనాథ సత్యనారాయణ | 2 |
| | 02 | మాయ రోగం | కొడవటిగంటి కుటుంబరావు | 6 |
| | 03 | ఆరోజు రాత్రి | శంకరమంచి పార్థసారథి | 11 |
| | 04 | అవతలి కోణం | శ్రీమతి తురగా జానకీరాణి | 16 |
| | 05 | ఎందుకు పారేస్తాను నాన్నా? | చాసో | 28 |
| | 06 | మా నాన్న నాకేమిచ్చారు? | అవసరాల రామకృష్ణారావు | 35 |
| | 07 | పలితకేశం | తిలక్ | 42 |
| | 08 | తమ్ముడిపెళ్ళికి తర్లీవెళ్ళడం | భమిడిపాటి కామేశ్వరరావుగారు | 47 |
| | 09 | క్షమించాను | కొమ్మూరి వేణుగోపాలరావు | 54 |
| | 10 | తల్లి చాటు పిల్లవాడు | కొడవటిగంటి కుటుంబరావు | 67 |
| | 11 | దృక్పథాలు | క్రొవ్విడి లక్ష్మన్న | 74 |
| | 12 | శుభవార్త | మురళీధర్ | 81 |







( ఆనందవాణి, వారపత్రిక , డిసెంబర్ 17,1950 సంచికనుంచి పునర్ముద్రితం)

నాకు మీరు ఉరిశిక్ష వేశారు. నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయక ముందు చెప్పుకోమంటే అర్థం ఉండేది. ఇప్పుడు చెప్పుకొన్నా ఒకటే చెప్పుకొనకపోయినా ఒకటే. కాని మీరిప్పుడు చెప్పుకోమనడంలో ఒక విశేషం ఉంది. ఎట్లాగూ చస్తున్నాడుకదా చచ్చింతరవాత మాట్లాడేది లేదు పెట్టేది లేదు ఆ మాట్లాడేది కాస్తా యిప్పుడే మాట్లాడమని. మనుష్యుడై జన్మ యెత్తిన తర్వాత మాట్లాడడంలో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది. అది మాయాపిహితులైన మానవులకు సహజలక్షణం. మీకు నా శరీరం మీద ప్రేమ లేదు. నా ఆత్మ మీద ప్రేమ. నా ఆత్మ మీ ఆత్మలు అందరివి ఒకటేగనుక, అయినా కాకపోయినా మీరనుకొంటున్నారు గనుక యిది ఒక మామూలు.

ఇపుడు నేను మాట్లాడకపోతే నష్టం లేదు. మాట్లాడితే వచ్చే లాభం లేదు. కాని నేను మాట్లాడితే లాభం ఉంటుందని కొందరనుకొంటారు. వాళ్ళ ఉద్దేశంలో మాట్లాడవలసిందే. ఏమైనాసరే మాట్లాడవలసిందే. బ్రతికియున్నంతవరకు ప్రయత్నం చేయవలసిందే. వాళ్ళు మీ కన్న మాయాపిహితులు.

నేను మనిషిని చంపానని మీరు నాకు ఉరిశిక్ష వేశారు. ఆ చంపానన్నది నాకు తెలియదు. మీకూ తెలియదు. చంపానని సాక్ష్యం యిచ్చినవాళ్ళకీ తెలియదు. నాకు తల్లీ పెళ్ళాం బిడ్డలు ఉన్నారు. వాళ్ళను పోషించలేక నేను చాలా బాధ పడ్డా. వాళ్ళకు తిండి లేదు. నాకూ తిండి లేదు. మీ దయవల్ల రెండు నెలలనుండి ఖైదులో కూర్చొని అన్నం మాత్రం తిన్నాను. ఈ రెండు

నెలలు వాళ్ళేమైనారో నాకు తెలియదు. ఈ పాటికి వాళ్ళూ చచ్చే ఉంటారు. వాళ్ళకన్న నేనే అదృష్టవంతుణ్ణి. వాళ్ళు చావకముందు మాడిమాడి చచ్చి ఉంటారు. నేను చచ్చే ముందు ఏదో యింత అన్నం తినే చస్తున్నా.

నేను ఉద్యోగం చేయలేదు. కూలీనాలీ కుదురలేదు. మోసం చేయలేను. ఎక్కడో నాల్గురాళ్ళు సంపాదిస్తే దాంతో బియ్యం కొనుక్కుందామంటే బియ్యం దొరకలేదు. అదివరకు నాల్గు రోజులు ఇంటిల్లిపాతికా పస్తున్నాం. నేను నా భార్య ఎల్లాగో అల్లాగా తమాయించుకొన్నాం. పిల్లాలు బక్కనరాలై కూర్చున్న చోటునుంచి లేవలేక యేడ్చే శక్తి కూడా లేక బ్రతికి ఉన్న శవాలల్లే పడి ఉంటే చూడడం యెలాగా?

బియ్యం అమ్మే దుకాణం పెద్దపులల్లే ఇరవై గజాల తోక పెంచుకొని ఆ తోక చివ్వర నేను. నాలుగు రోజులు ఈ తోక చివరితనం పొందలేక పొందలేక విసిగి చివరికి యింటికి వచ్చాను. ఒక ముసిలిది నా మీద దయ పుట్టి తనకు వచ్చిన బియ్యంలో సగం నాకు రెట్టింపుధరకు అమ్మింది. ఆ బియ్యం తీసికొనివచ్చి వండి పిల్లలకు పెడ్దామంటే అవి గొడ్లు తినాలిగాని మనుష్యులు తినరు. నాలుగు పోట్లు వేసి చెరిగితేగాని వండడానికి పనికిరావు. దంచాలి అంటే నాలుగురోజులు తిండిలేని మా యింటిదానికి ఓపికలేదు. నాకూ లేదు. అయినా పిల్లల స్థితి చూడలేక మా యింటిది ఆ బియ్యం చిరిగిన చీరకొంగున కట్టుకొని పది కొంపలు తిరిగింది. ఒకళ్ళు విసిరికొట్టారు. మరి ఒకళ్ళు -- వాళ్ళ యింట్లో నోమట. అట్లకోసం పిండి దంచుకొంటున్నారు. అన్ని యిళ్ళూ ఇట్లాగే అయినవి. చివరకా బియ్యమే ప్రొయ్యిరాళ్ళమీద పెట్టింది మా యింటిది. ప్రొయ్యి క్రింద మంట లేదు. ఒకాయన దొడ్డిచుట్టూ కంచెవేశాడు. ఆ కంచె గాడిదలూ, కుక్కలూ, పందులూ విరగతొక్కినవి. కంచెపుల్లలు ఇటు అటు పడిఉన్నవి. అవి యెవరికీ పనికిరావు. అవి నేను ఏరి తెస్తూంటే ఒకాయన "ఎవడి అమ్మా మొగుడి సొమ్మనుకున్నావు" అని వచ్చి కర్రతో విరగొకొట్టాడు.

ఇంటికి వచ్చాను. ఇల్లంటే నవ్వు వస్తోంది. ఎవరిదో పడిపోయిన గోడ ఉంటే, ఆ స్థలంలో యెవళ్ళూ కాపరానికి లేరు, ఆ గోడక్రింద ఉంటున్నాం, అదే యిల్లు. పైన పుల్లా పుడకా పెట్టి తలలు మాత్రం దాని క్రింద పెట్టి నిద్రపోయేటట్లుగా మా యింటిది ఆధారం చేసింది. నేను వెళ్ళేటప్పటికి ఆ ఆధారం తీసి దానితో మంట వేస్తోంది. ఈ ఆధారం ఎక్కువా? పిల్లల కడుపుమంట యెక్కువా?

మరునాడు మా పిల్లల స్థితి చూడ కడుపులో నొప్పితో మెలితిరిగిపోయినారు. నాలుగు వాము పరకలు తెద్దామంటే చేతిలో ఉన్న నాలుగణాలు నిన్నటి ముసలమ్మే కాజేసింది. మళ్ళీ తర్వాత నాలుగు రోజుల వరకు బియ్యం లేవు. పిల్లల కడుపునొప్పులూ తగ్గలేదు. మా యింటిది లేవనే లేకపోయింది. నేనట్లాగే తిరుగుతున్నాను.

ఆ రోజున మధ్యాహ్నం జనం గుంపులుగా వెళ్ళుతున్నారు. నేను వాళ్ళెక్కడికి వెళ్ళుతున్నారని అడిగాను. అందరికీ బియ్యం ఇస్తారట అని చెప్పారు. నేను వాళ్ళవెంట వెళ్ళాను. వాళ్ళు వందా రెండువందలమంది ఉన్నారు. జనం ఒకచోటికి వెళ్ళారు. జనం కేకలూ బొబ్బలూ నానా హంగామాగా ఉంది. ఒక యింటి దగ్గర ఆగారు. ముందర యేమి జరుగుతోందో నాకు తెలియదు. నేను వెనక ఉన్నాను. బియ్యం కోసం త్రొక్కిళ్ళాడుతున్నారనుకొన్నాను. చుట్టుప్రక్కల యిళ్ళవాళ్ళందరూ కొందరు తలుపులు వేసికొన్న వాళ్ళు, కొందరు తొంగిచూచేవాళ్ళుగా కన్పించారు.

కొంతసేపటికి రక్షకభటులు వచ్చారు. నేననుకున్నాగదా అమ్మయ్యా వీళ్ళా వచ్చారు గదా అందరికీ సరిగ్గా పంచిపెట్టిస్తారు అని.

క్రమక్రమంగా నాకుతెలిసింది. ఈ గుంపుకి ఆ రక్షకభటులకి దెబ్బలాట జరుగుతోందని.

ఇంతలో రక్షకభటులు తుపాకులు కాల్చారు. ఈ గుంపులోంచి రక్షకభటుల మీద రాళ్ళు విసరుతున్నారు.

వ్యవహారం యెప్పుడైతే ముదిరిందో నాకెందుకురా బాబూ యిది పోదామనుకున్నాను. కాని పోవటమెట్లా? అదివరకు నెల్లాళ్ళ మట్టి తిండే లేదు. వారానికొకసారి యేదో తినీతిననట్లు తిన్నా నా వంట్లో ఓపిక లేదు. మనిషిని మరీ అబ్బనాకారిని కాదుకనుక మనుష్యాకృతిలో లోపం లేదు.

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలినవి. ఒకడికి రాయి నెమరకణతను తగిలి చచ్చాడు. ఆ రాయి చుట్టుప్రక్కలవాడెవడు విసిరాడో నాకు తెలియదు.

పైగా చంపడంలో యిన్ని భేదాలేమిటి? రాయి తగిలితే చచ్చి, తుపాకిగుండు తగిలితే బ్రతుకుతాడా? తుపాకిగుండు తగిలి చస్తే శిక్ష లేదూ! రాయి తగిలి చస్తే శిక్షా?

ఆ కళ్ళులేని దేవుడు ఆ రాయి నేనే విసిరానన్నాడు. రాయి విసరడం మాట అట్లా ఉంచండి. నేను చేయి యెత్తగలిగితే చాలు! ఆ స్థితిలో ఉన్నాను. రక్షకభటులు తరిమారు. అందరూ పారిపోతున్నారు. నేనూ పారిపోతున్నాను. పరిగెత్తేందుకు నాకు ఓపికయేది? వెనకనుంచి నా నెత్తిమీద పెద్దదెబ్బపడ్డట్టుగా మాత్రమే నాకు తెలుసు.

ఒక రాత్రివేళ నాకు మెలకువ వచ్చింది. గాఢాంధకారంలో కూర్చొని ఉన్నా. మరునాటి ప్రొద్దుటికి తెలిసింది నాకు అది ఖైదని.

ఒకటిరెండు పూటలైన తర్వాత నాకన్నం పెట్టారు. అన్నం చూస్తే నా ప్రాణాలు లేచి వచ్చినవి. వెంటనే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకు పెడదామని అన్నం అట్టే పెట్టాను.. మరునాటికి తెలిసింది యింక వాళ్ళు నా దగ్గరకు రారని.

వాళ్ళేమైనారో! ఏమైనారో యెవడికి కావాలి?

పూటపూటా అన్నం తినడం నాకూ అలవాటైంది.

నా పని రాజభోగంగా ఉంది. రెండు పూటలా తిండి. ఎక్కడికైనా తీసికొని వెళ్ళితే మోటారు కారులో తీసికొనివెళ్ళారు. పెద్ద కోర్టులో కూడా నా కోసం ఒక ప్రత్యేకస్థానం. చివరి రోజుల్లో నాకు దశయెత్తుకొంది. ఆ పాడుదేవుడు ఈమాత్రంగా ఆ వెనుక కూడా సాగిస్తే యెంత బాగుండేది!

ఇంతకన్న యేమి చెప్పను? నాకు యింత ఉపకారం చేసిన మీరు వెయ్యేళ్ళు బ్రతకండి. బ్రతుకంతా తిండి లేక చచ్చినా నాకు రెండు నెలలు సుఖంగా తిండి పెట్టారు. మీ కడుపులు చల్లగా ఉండాలి.

కాని నా యింటిదీ, పిల్లలు ఏమైనారో తెలియలేదు. నాకు ఒక్కటే చింతగా ఉంది. నా పిల్లలు కొంచెం పెద్దవాళ్ళు అయితే--ఎల్లాగో అల్లాగా పెద్దవాళ్ళు అయితే--చివరి రోజుల్లో వాళ్ళకు కూడా నాకు పట్టిన యోగం పడుతుందా అని.

అదంతా మీ దయ. వాళ్ళని వెదికించి యీ ఉపకారం చేయిస్తే చచ్చి మీ కడుపున పుట్టాను.




# మాయరోగం

## కొడవటిగంటి కుటుంబరావు

( ఆంధ్రభూమి,మాసపత్రిక , 1946 లోని సంచికనుంచి పునర్ముద్రితం)

టి.శ్రీనివాసరావు ఎం.బి.బి.ఎస్ డిగ్రీ సంపాదించి రెండు సంవత్సరాలైనా వెళ్ళక పూర్వమే వైద్యవృత్తిని మనసార నిరసించటం మొదలు పెట్టాడు. మనిషి కీడెంచితే భగవంతుడు మేలెంచటం కొంచెం విరుద్ధంగా తోచిందతనికి. అతనికి సంపాదన తప్పుని సరికాదు. పదిహేను మాసాలు సరదాగా కొన్ని సంవత్సరాలు మెడికల్ విద్యార్థి జీవితం గడపవచ్చును కదా అని డాక్టరు చదువు చదివాడు. కోర్సు ప్రారంభించ గానే తెలిసొచ్చింది యూనివర్సిటీ వాళ్ళు తన చేత వెట్టిచాకిరి చేయించ దలిచారని. శ్రీనివాసరావు మొండెత్తు వేసే ఇంటి దగ్గిర పుస్తకం ముట్టుకున్న పాపాన పోకుండా జరిపాడు. సంవత్సరాంతాన పాసయినాడు. కోర్సంతా అవిధంగానే గడిచింది. తప్పేవాళ్ళేంచేసి తప్పుతారో అతనికి అర్థంకాలేదు.

ప్రాక్టీసు కూడా ఎవరూ తన దగ్గరికి రారుకదా, పది పదిహేనేళ్ళనించీ తన తోడి డాక్టర్లు ప్రాక్టీసు లేకుండా అవస్తపడుతుంటే తనకెక్కణ్ణించి వస్తుంది కనక, అనుకుని చెక్కగొట్టి నాలుగు నెలలు కాలేదు, అప్పుడే అతని క్లయింట్ల లిస్టు నూరు దాటింది, అతని వర్కింగవర్స్ రోజుకు పన్నెండుగంటలైనై, అతని సంపాదన నెలకు నూటయాభైలో పడ్డది! వెధవజీవితమనుకున్నాడు శ్రీనివాసరావు. అతనికి డబ్బును చూస్తే ఇష్టం లేదనీ, పేరుప్రతిష్టలు చేదనీ కాదు, అంత బద్ధకస్తుడు పుట్టబోడు, పెరగబోడు.

శ్రీనివాసరావు నిట్టూర్పువిడిచి లేచాడు. చేతినున్న గడియారం చూశాడు. ఆరూ పది! సినిమాకైనా పోవచ్చు. ఏంబతుకు? లేచింది మొదలు రోగులు, రోగులు,రోగులు! విసుగు విరామం లేకుండా రోగులు! అందరికన్నా క్షమించటానికి వీల్లేందెవర్నంటే రోగుల్ని! ఛత్!

‘‘కాంపౌండర్!’’

‘‘‘చిత్తాం!’’’

‘‘‘నేనలా పార్కువైపు వెడుతున్నానూ! ఏడయేదాకా ఉండి నువ్వు కూడా వెళ్ళిపో!’’’

‘‘మళ్ళీ శర్మగారింజక్షన్ కోసరం వస్తారేమో?’’’

‘‘‘ఆయన విషయం చిత్రంగా ఉందోయ్, మరీనూ! ఇప్పటికే రొండనవసరంగా పుచ్చుకున్నాడు. గట్టిగా చెబితే ఈ డాక్టరుత్తి చవట నాగమ్మ అని ఊరంతా చాటి పారేస్తాడని భయం! ఆ? మరేం మళ్ళీ పాయింట్ త్రీ ఇవ్వు__ మెల్లగా చెప్పిచూసి వినకపోతే!’’’

కాంపౌండరు అట్లాగేనని తల ఊపుతూ నవ్వాడు.

’’’ఆయనకు ఇంజక్షన్లు మంచి గుణమిస్తూన్నాయటండి!’’’ అన్నడతను.

‘‘‘సరే!... నే నలా పోయివస్తాను!’’’

‘‘‘చిత్తం!’’’

డాక్టరు శ్రీనివాసరావు వెళ్ళే ప్రయత్నంలో ఉండగా ఒక కుర్రవాడు అనుమానిస్తూ లోపలికి ప్రవేశించి అతనికి నమస్కారంచేశాడు.

‘‘‘ఎవరికోసరం?’’’

‘‘‘డాక్టరుగారు లేరండి?’’

‘‘నేనే డాక్టర్ని’’’’’ ‘‘’’’ ’’

‘‘‘మీతో ఒకమాటమాట్లాడి పోదామని వచ్చానండి’’’

‘‘‘ఇప్పుడు కాదు. ఇప్పుడు నాకు చాలా జరూరుపని ఉంది. రేప్పొద్దున ఏడు దాటాక రా!’’’ ’’

‘‘‘అప్పుడు నాకు వీలుపడదండి. రేపురమ్మంటే వస్తానుకాని మళ్ళీ ఈ వేళకే వస్తాను’’’ ’’

శ్రీనివాసరావు ఆ కుర్రవాడి అహంకారానికి మండి పడ్డాడు. ’’’’ ’’మరి నాకీ వేళప్పుడెన్నడూ తీరొద్దూ? ’’’ అన్నాడు.

‘‘‘కానివ్వండి. మరో డాక్టరు దగ్గరికి పోతాను.’’’ ’’ ఆ కుర్రవాడు దీనంగా వెనక్కు తిరిగాడు. శ్రీనివాసరావుకు జాలేసింది, ఆ కుర్రవాడి వీపు అతని హృదయాన్ని చిత్రంగా ద్రవించింది. ఇంతసేపున్న వాడింకో అయిదు నిముషాలుంటే ముంచుకుపోయిందేమిటి? గడపదాకా వెళ్ళిన కుర్రవాణ్ణి వెనక్కు పిలిచాడు డాక్టరు.

‘‘‘ఏమిటి నువ్వు చెప్పదలిచింది?’’’ అన్నాడతను కుర్చీలో కూర్చుని.

‘‘‘నేను చెప్పదలిచింది త్వరలో కాదేమోనండీ!’’’ ’’ అన్నాడు కుర్రవాడు అనుమానిస్తూ.

‘‘‘ ఇప్పటికి క్లుప్తంగా ముగించు. తరవాత రేపువింటాను. సరేనా?’’’ ’’

’’’చిత్తం అలాగే కానివ్వండి. ఇంతకూ నాకు కావలిసిందేమంటే__ నేను గతమంతా మరిచిపోయ్యేటట్టు చెయ్యగలరా?’ ’’

ఆ కుర్రావాడు తనలో పరాచికాలాడుతున్నాడని అనుమానం తగిలి డాక్టరు ఊఁకొట్టలేదు.

"'పగలంత ఇబ్బందిలేదండి. రాత్రి నిద్రపట్టదు. గడిచిన విషయాలన్నీ కళ్ళలో మొదులుతూంటై దానికేదైనా మందు____?'"

ఒక ముక్కుముక్కి డాక్టరు కుర్చీలోనించి లేస్తూ "'కాంపౌండర్! ఇతని కొక స్లీపింగ్ మిక్శ్చర్ ఇచ్చి పంపేయ్!'" " అన్నాడు.

"'మీ బ్రొమైడ్స్‌తో పోయ్యేరోగం కాదండి ఇది'" అన్నాడు కుర్రవాడు.

శ్రీనివాసరావు నిర్ఘాంతపోయినాడు. అంత కుర్రాడికి పదేళ్ళయినా ఉంటయ్యో ఉండవో?__ బ్రోమైడ్స్‌ను గురించి తెలుసుననే కాదు అతని ఆశ్చర్యం అంతకన్న అశ్చర్యకరంగా ఉంది ఆకుర్రవాడి గొంతు. ఆ కుర్రవాడి గొంతులోనించి అంత గంభీరమైన నాదం ఎట్లావచ్చింది?

"'క్షమించండి. మీకు నే నార్డర్లివ్వడానికి రాలేదు. కాని నారోగం సరిగా కనుక్కుంటే మీరు మంచి మందివ్వగలుగుతారని నా ఆశ. మీరు డాక్టర్లు. నేను మీకు చెప్పేదేమిటి? సగంచెప్పి సగం చెప్పక పోవటం నాకే హాని. అదీ కాక నేను టూకీగా నా అవస్త చెప్పాలని ప్రయత్నం చేస్తే నా మాటలు నమ్మరు. మాట వరసకు నేను గతం మరిచేటందకు మందిమ్మన్నాననుకోండి. ఇంత చిన్నవాడికి గతమేమిటా అని మీరు నవ్వరా? నేను పుట్టి పెరిగిన ఈ పది సంవత్సరాల్లో మరవదగినది ఏమంతలేదు కానీండి, అంతకు పూర్వం నడిచింది? దాన్ని భరించలేను. అది నన్ను విడవకుండా ఉంది! నా గుండెమీద పెద్దరాయల్లే ఉంది. ఆ రాయి ఎత్తేసిన పుణ్యాత్ముడి కెంతపుణ్యమన్నా ఉందండి!'" "

శ్రీనివాసరావు ఒక్క క్షణం నీళ్ళలో ఊపిరాడక తన్నుకున్న వాడల్లే మధనపడ్డాడు. చివరకతను బిగ్గిరిగా

"'ఆగు! నువ్వు చెప్పేది ఒక్కముక్క నాకర్థం కావటంలేదు. నీ పేరేది?'" అని అరిచాడు కంపౌండరు అదిరిపడేట్టు.

"'నా పేరు సత్యం!'"

"'అలా ఒక్కో ప్రశ్నకే మెల్లిగా సమాధానంచెప్పు! నీ వయస్సెంత?'"

" 'పదేళ్లు'.." "

"'ఊఁ! ఈ మధ్య నీ కేమైనా పెద్దజబ్బు చేసిందా? '"

"'లేదండి.. '"

" మీ వంశంలో ఎవరికైనా కొంచెం మతి చాంచల్యం అలాటిదేమైనా ఉందా?'" "

"" "అబ్బే! లేదండి.' "

"'నీకు తరచు కలలు వస్తూండటం మేలుకునుండే కలలు కంటం కద్దా?' "

"నాకు మతిచెడ్డదనే ఉద్దేశంతో మిరిలా ప్రశ్నిస్తే నే చెప్పదలిచిందెలా చెప్పడం?' "

సర్గా ఈ సమయానికి కాంపౌండరు లైటు తెచ్చి బల్లమీద పెట్టాడు. శ్రీనివాసరావు తనకెదురుగా నిలబడ్డ ఆ కుర్రవాడి

మొహం వంక చూశాడు. అతని దృష్టి సరాసరి సత్యం కళ్ళ మీదికి పోయింది. అతని శరీరం కంపించటం మొదలుపెట్టింది అవేంకళ్ళు? వాటిని చూస్తే తన శరీరం ఎందుకంత కంపిస్తోంది? కుర్రవాణ్ణి చూసి తన కెందుకంత ముచ్చెమటలు పోయటం?

సత్యం కూడా డాక్టరు వంక ఆశ్చర్యపడుతూ చూడటం మొదలుపెట్టాడు.

"'నేను మిమ్మల్ని కిందటిసారి చూసినప్పుడు మీ మొహం ఇంకోతీరుగా ఉంది! మీకు నన్ను వెనకెప్పుడైనా చూచిన జ్ఞాపకం ఉందాండి?'"

"'లేదు! లేదు! నిన్ను నేనెరుగను. నువ్విక్కణ్ణించి వెళ్ళిపో! పో!'" అని అరిచాడు శ్రీనివాసరావు.

కాంపౌండరు అదుర్దాగా ప్రవేశించాడు. కాని ఆ ఇద్దరిలో ఒకరు కూడా అతని వైపు తలతిప్పలేదు అడివిలో అకస్మాత్తుగా ఎదురైన రెండు సమాన బలంగల క్రూరజంతువులల్లె ఒకరిమీదినించి ఒకరు చూపు తప్పించలేకుండా ఉన్నారు. ఇద్దరికీ మతి పోయిందను కున్నాడు కాంపౌండరు.

శ్రీనివాసరావుకూ సత్యానికీ ఒక్క బేధం మాత్రం ఉంది. శ్రీనివాసరావు సహజంగా మాట్లాడే స్థితిలో లేడు. అరిస్తే అరవటం లేకపోతే నోరు తెరవలేకపోవటం. సత్యం మన ప్రపంచకంలో లేకపోయినా మాట్లాడగలిగి ఉన్నాడు. ఆ గొంతుమాత్రం పెద్దగా లేకపోయినా అమానుషంగా ఉంది. కాంపౌండరు చూస్తూండగానే అతను డాక్టరు వైపు వేలు చూపిస్తూ

"'నువ్వారోజున దానికోసం మామూలు ప్రకారం సూర్యాస్తమయమైన పదిగడియలకు ఇల్లు బయలుదేరావు. రాజు గారి ఉప్పు తింటున్న నేను__ దాన్ని చూస్తే నీకన్న లక్ష రెట్లు మోహంగల నేను __నీవెంబడే వచ్చాను. దానింట్లోకి నువ్వు పోతుండగా నేను ఆ అసమర్థుడల్లే ఏమి చేయలేకపోయునాను. నువ్వు లోపలికి పోయి తలుపు వెసుకోగానే నేను కోనేట్లో దిగి మీ కిటికి దగ్గిరికి ఈదుకుంటూవచ్చి అంతాచూశాను. నారక్తం ఉడికిపోయింది. నాకు ఏనుగకున్నంత బలంవచ్చింది. మెట్లెక్కి తిరిగివచ్చి ఒక్కతాపుకు తలుపు పగలతన్ని లోపల ప్రవేశించి దాని చేతుల్లో ఉన్న నిన్ను రాజాజ్ఞ అంటూ బాకుతో పొడిచాను. అది రాజాజ్ఞ కాదు! అబద్ధం ఆడాను___'" "

అకస్మాత్తుగా శ్రీనివాసరావు పెద్ద పెదబొబ్బపెట్టి '

"'దుర్మార్గుడా! పాపఫలం అనుభవించు!'" " అంటూ తన వెనకాల కుర్చీ తీసి గట్టిగా సత్యం నెత్తిన కొట్టాడు ఉత్తరక్షణం అతనికి స్పృహ తప్పిపోయింది.

ఆ దెబ్బకు కూర్చీకోడు విరిగింది. కుర్రవాడు చెక్కు చెదరలేదు కాని అతనిలో మార్పు గమనించానంటాడు కాంపౌండరు. మాట్లాడుతున్నంతసేపూ ముప్పై నలభై ఏళ్ళవాడల్లే కనపడ్డ సత్యం అకస్మాత్తుగా కుర్రవాడయి నట్టయింది. అతను చప్పున చిన్నపిల్లవాడి కీచుగొంతుతో '" "అరెరె! అదేమిటండీ! డాక్టరుగారలా పడిపోయారు '" అని అరిచాడు.

డాక్టరుకు గంటసేపటికి తెలివి వచ్చింది. అతని ధోరణి చూస్తే కుర్రవాడు తనతో ఏమీ చెప్పులేదంటాడు. తనకు పని జాస్తయి ఆరోగ్యం చెడి పైత్యం చేసి మూర్ఛవచ్చిందంటాడు. ఆ కుర్రవాణ్ణి కూడా కదిలించి చూశాను. కాని అతనికి కిందటి జన్మ తాలూకు

సంగతులేవి జ్ఞాపకం ఉన్నట్టు కనిపించదు. ఆ రోజున అక్కడి కెందుకొచ్చావంటే నిద్రపట్టటానికి మందుకోసరం వచ్చానని ఒప్పుకున్నాడు. డాక్టరు కుర్చీ తన మీద వెయ్యలేదంటాడు. డాక్టరు పిచ్చివాడల్లే ప్రవర్తించటం కూడా గమనించానంటాడు. కాని అది పైత్యపు తెర యొక్క ఫలితమని డాక్టరే అంగీకరించాడు. ఆ పిల్లవాడు ఆశ్చర్యపడటంకూడా తనకు జ్ఞాపకం ఉన్నదంటాడు డాక్టరు. కాని తను డాక్టర్ను చూసి ఆశ్చర్య పడ్డట్టు కుర్రవాడే అంగీకరిస్తున్నాడు. కుర్చీకాలి సాక్ష్యంకూడా ఎందుకూ పనికిరాదు, డాక్టరు కుర్చీ ఎత్తి దూరంగా పారేసినమాట డాక్టరు, కుర్రాడు కూడా ఒప్పుకుంటున్నారు కనక ఇద్దరిలో ఒక్కరైనా దాపరికంకోసం ప్రయత్నిస్తున్న వాళ్ళల్లే లేరు.

ఎటోచ్చీ కాంపౌండరు సాక్ష్యం ఒక్కటే ఉంది. అది ఎంతవరకు నమ్మతగ్గదో మీరే నిశ్చయించుకుంటారు గాక!




# ఆరోజు రాత్రి

## శంకరమంచి పార్థసారథి

( జ్యోతి ,మాసపత్రిక , 1980 ల్లోని సంచికనుంచి పునర్ముద్రితం.
ఈ కథని సూచించిన మిత్రులు దర్శకుడు వంశీగారు)

ఆ రోజు రాత్రి... అతడు అసహనంగా వున్నాడు. అసౌకర్యంగా వున్నట్టు ఏం చేయాలో తోచనివాడిలా దిక్కులు చూస్తున్నాడు. వుండి వుండి పచార్లు చేస్తున్నాడు. చటుక్కున సోఫాలో కూర్చోబోతున్నాడు. వెంటనే మళ్ళీ లేచి పచార్లు.....

అతడు సోఫాలో కూర్చుని భార్య రాసిన ఉత్తరాన్ని చేతిలోకి తీసుకొని మరోసారి దీక్షగా చదివాడు.

'మా నాన్నగారి ఆరోగ్యం కుదుటపడకపోవటం వల్ల ఇంకా అస్పత్రిలోనే ఉన్నారు, అమ్మ కూడా దిగులు వల్ల నలతగా ఉంది. అందువల్ల మరోక వారంరోజులు వుండమని బ్రతిమాలారు. కాదనలేకపోయాను. అందువల్ల ముప్పై తారీఖున బయ్యల్దేరి వస్తాను. కొప్పడకండి. బాబిగాడి అల్లరి...'

అతడా ఉత్తరాన్ని పూర్తిగా చదవకుండానే కోపంగా విసురుగా టీపాయి పైకి విసిరాడు. మళ్ళీ లేచి కోపంగా పచార్లు చేయ్యటం మొదలెట్టాడు. ' ఛ! ఛ! ఎప్పుడూ ఇంతే. చెప్పిన సమయానికి వచ్చే అలవాటే లేదు' అని తనలో తాను గోణుక్కుంటున్నాడు.

భార్య పుట్టింటికి వెళ్ళిన గత ఇరవై రోజులుగా ప్రతిరోజు, ప్రతి గంట. నిమిషము ఆమె రాకకోసం ఎదురుచూసి తీరా వస్తానన్న రోజుకి భార్య రాకపోగా, మరో పదిరోజుల వరకు రాదన్న కఠిన సత్యంతో రాజీపడలేక, మధనపడి బాధపడుతున్నాడు. అతడలా బాధపడటానికెన్నో కారణాలున్నా ముఖ్యమైనవి రెండు. ఒకటి- అతడికి భార్యంటే అవ్యాజమైన ప్రేమ. ఆమెకి దూరంగా గడిపే కాలం జన్మజన్మల పాపాన్ని అనుభవిస్తున్నట్టుగా కఠిన శిక్షలా వుంటుంది. ఉదయం తనని నవ్వుతూ సాగనంపి తిరిగి సాయంత్రం తనని అదే చిరునవ్వుతో ఆప్యాయతలతో అహ్వానించే ఆమె, తనకి ఏ సమయానికి ఏం కావాలో అన్నీ అమర్చి సపర్యలు చేసే ఆమె లేకపోవటం పెద్ద లోటుగా, ఆమె లేని ఇల్లు ఇంకా విగ్రహప్రతిష్ఠ జరుగని దేవాలయంలా వెల్తిగా, బోసిగా అన్పిస్తుంది.

ఇక రెండవది- భార్య చెప్పిన సమయానికి రాలేదని, తద్వారా తన మాటకి విలువ నివ్వలేదన్న సహజమైన పురుషాహంకారం. తనెంతో ప్రేమగా, ఆత్రుతగా ఆమెకోసం ఎదురుచూస్తుండగా అమెక్కడ తనకేం పట్టనట్లుగా హాయిగా ఉండిపోయినందుకు దుగ్ధ. ఆమె పట్ల తను ప్రదర్శించిన ప్రేమ, అనుభవించిన విరహం ఆమె గుర్తించనందున వ్యధ. అతడు లేచి కిటికీ వద్ద నిలబడి సిగరెట్టు వెలిగించాడు.

అతడు ఆరడుగుల మనిషి. వేసుకున్న గ్లాస్కో లాల్చిలోంచి బలమైన మెలి దిరిగిన కండలు ఇనుపగుళ్ళలా కన్పిస్తున్నాయ్. చెదిరికొద్దీ జుట్టు మొహం మీద పడి అందంగా కన్పిస్తోంది. పొడవైన, బలమైన చేతులు మాటిమాటికి జుట్టును వెనక్కి తోస్తున్నాయ్. బాదం చెట్టుపై నుండి వస్తున్న గాలి వెచ్చగా అతడి కోపాన్ని రెచ్చగొడుతున్నట్టుగా వుంది.

అతడు బయటకు చూస్తూ సిగరెట్టు పీలుస్తున్నాడు.

ఎదురింటి వాకిట్లో నిల్చున్న బేంక్ ఆఫీసరుగారి పెళ్ళాం. పక్కింటి గుమస్తా పెళ్ళాంతో ఏదో విషయం గూర్చి చాలా దీర్ఘంగా కోపంగా చేతులు తిప్పుతూ చెబుతోంది. ఆ గుమాస్తా భార్య కడు భక్తి ప్రపత్తులతో ఆమె చేతి వంక, వుండి వుండి మెరుస్తున్న రెండు జతలు బంగారు గాజుల వంక భక్తిగా, భయంగా చూస్తోంది. ఆఫీసరు గారి భార్య చేతులు తిప్పుతున్నప్పుడు పైటలోంచి బంగారుపళ్ళెంలా పచ్చటి కడుపు. బలమైన, బిగువైన జాకెట్టు అతడి దృష్టి నాకర్షించాయ్. ఒక్కక్షణం అటువైపు తదేకంగా చూసి, సభ్యత కాదని తలతిప్పుకొని గది మధ్యకొచ్చాడు.

అసలు తనలో పుట్టిన ఈ అశాంతికీ,కోపానికీ కారణం ఏమిటి? కేవలం భార్య రాలేదనేనా? ఆమె పైనిగల తన ప్రేమ గుండెని మండిస్తోందా? తన శరీరానికి సంబంధించిన కారణమా? ఈ ప్రేమకీ శరీరపు వాంఛకీ సంబంధం చుందా? ఈ రెండు పదాలు పరస్పరాశ్రయాలా? ఒకటి పవిత్రమైనది. వేరొకటి తుచ్ఛమైనది గదా- ఈ రెండింటికి ఎలా సంబంధం ఉంటుంది? ఒక వేళ శరీరాన్ని తృప్తిపరిస్తే...

కొద్దిసేపటి క్రితం పుచ్చుకున్న రెండు పెగ్గుల మిలటరీ విస్కి నరాల్లోకెక్కి రక్తాన్ని వెచ్చపెడుతోంది. వళ్ళంతా బరువుగా, భారంగా వుంది. కళ్ళు మంటలుగానూ, తల దిమ్ముగాను అన్పించింది. అతడు మళ్ళీ సోఫాలో కూర్చునాడు. అతడిలో ఏదో సంఘర్షణ. మనస్సుకీ, శరీరానికి మంచికీ చెడుకీ, పాపానికీ పవిత్రతకీ సంఘర్షణ అంతర్గతంగా జరుగుతోంది. అలా కొద్దిక్షణాల మధన తర్వాత అతడికో విషయం విశదమైంది. తనలోని అశాంతికి, కోపానికి, అసహనానికి కారణం, శరీరపరమైంది, తనింతసేపు దానికి ప్రేమనే పేరుపెట్టుకుని ఆత్మవంచన చేసుకో చూసేడు. అంతమాత్రం చేత భార్యంటే ప్రేమ లేదని కాదు. ఇప్పటికిప్పుడు ఈ క్షణాన తనకి కావలసింది ప్రేమ కాదు- అవునాని తనని తానే ప్రశ్నించుకున్నాడు.

అవునన్నది నరాల్లో వున్న మిలటరీ విస్కీ.

అంతే! ఇంకెంత మాత్రం ఆలస్యం చెయ్యటం ఇష్టంలేక, అతడు చటుక్కున లేచి పక్కగదిలోకెళ్ళి చకచకా బట్టలు మార్చుకున్నాడు. కొన్ని క్షణాల క్రితం కన్నా ఇపుడతనికి హాయిగా, అహ్లాదంగా వుంది. సన్నగా ఈల వేసుకుంటూ, బయటికొచ్చి ఇంటికి తాళం వేసి స్కూటర్ని బయటకు నడిపించేడు.

స్కూటరు మొయిన్రోడ్డు మీద మెల్లగా పోతోంది. గాలివెచ్చగా రివ్వున వీస్తోంది. అతడి కళ్ళు ఎవరికోసమో వెదుకుతున్నట్టు

రోడ్లనీ, జనాల్నీ కలియజూస్తున్నాయ్. అలా చూస్తూ వెడుతున్న అతడి శ్రమ దాదాపు ఇరవై నిముషాలకిగాని ఫలించలేదు.

ఆమె సినిమాహాలు కెదురుగా వున్న బస్సుస్టాపులో నిల్చునుంది. ఒకపక్కగా నొదిగి చీకటిలో నిల్చోనుంది. జుట్టుని చుట్టగా చుట్టి పూలని అర్ధచంద్రా ఆకారంలో ఆకర్షణీయంగా అమర్చింది. పచ్చటి చీరపై ఎర్రపూలు, ఎర్రటి బ్లౌజు, రెచ్చగొట్టే అవయవ సౌష్టవం. ఆకర్షణీయంగా ఉన్నయ్. అతడు ఆమెను చూడగానే తన సమస్యకి పరిష్కారం దొరికినందున ఆనందపడి, స్కూటర్ని కాస్త దూరంలో ఆపి, వచ్చి ఆమెకి కాస్త దూరంగా నిల్చున్నాడు.

అతడికిల్లాంటి విషయాల్లో అనుభవం లేకపోయినప్పటికీ, ఆమె మొగవాళ్ళ వంక చూస్తున్న తీరు, నిలబడ్డ వైనం,కట్టూ బొట్టూ ఆమె బ్రతుకురీతిని చాటి చెప్పుతున్నందువల్ల ఇట్టే అర్ధమైంది.

ఆమె ఓరకంట అతను తాకటం, పక్కనే నిలబడి తనవంక కొనుగోలుదారుడిలా చూడటం గమనించి చిన్నగా నవ్వింది.

అతడు మరికొద్ది క్షణాలు పరీక్షగా చూసి సంతృప్తిగా తలాడించి కాస్త దగ్గిరగా వచ్చి ఆమెని పలకరించాడు, ఆమె పలికింది

***

ఆమె ఆ ఇంట్లోకి అతడితోపాటు అడుగుపెట్టి, పరీక్షగా చూస్తోంది, అది మూడు గదుల ఇల్లు ముందు గదిలో గంధం రంగు సోఫాలు, వాటి ముందు నల్లచెక్కతో చెయ్యబడ్డ టీపాయ్, దానిపైన అందంగా అమర్చిన ఫ్లవర్‌వేజ్ గోడలకి అందమైన ఆయిల్ పెయింట్స్, ఆకర్షణీయంగాను, కళాత్మకంగాను ఉన్నయ్, దుమ్ము దూళి లేని మొజాయిక్ నేల అద్దంలా తళతళలాడుతోంది, సోఫాలకి పక్కగా బుక్‌షెల్ఫ్ రకరకాల పుస్తకాలతో నిండు కుటుంబంలా కన్నులపండువులా వుంది.

ఆమె అలాగే నిలబడి రెప్పవాల్చకుండా అలంకరణ గమనిస్తోంది. అతడు సిగరెట్టు ముట్టించుకొని గట్టిగా దమ్ముపట్టి, ఆమె వంక పరీక్షగా చూసేడు, చిన్న నోరు, కొనదేరిన ముక్కు, బలమైన చేతులు, నునువైన భుజాలు, రెచ్చగొట్టే సొగసులు, అందాలు అతడి అవసరపు కళ్ళ కి అద్భుతంగా కన్పించాయ్.

కాని గదిలోనికి ఎలా ప్రవేశించిందో అక్కడే నిలబడుండటం, ఆమె వదనంలోని ఆశ్చర్యాన్ని గమనించి, "ఏమిటి అంత ఆశ్చర్యంగా చూస్తున్నావ్?" అన్నాడతను, ఆమె చలించక కిటికీ పక్క నించి వెడుతున్న మనీప్లాంటును గమనించసాగింది.

ఆమెలోని ఆశ్చర్యాన్ని అర్థం చేసుకున్నవాడిలా అతడే అన్నాడు "మా రమకి అంటే నా భార్యకి శుభ్రత ఎక్కువ. ఏం పని చేసినా పద్ధతి ప్రకారం చేస్తుంది. ఇల్లు, వొళ్ళూ మల్లెపువ్వులాగానూ మంచి గంధంలాగాను ఉంచాలనుకుంటుంది. అఫ్‌కోర్స్- ఉంచుతుంది కూడాను, ఉదాహరణకి ఈ పుస్తకం ఇక్కడి నుంచి తీసేననుకో పని పూర్తయ్యాక మళ్లీ అక్కడే ఉంచాలని శాసిస్తుంది, అలా చెయ్యకపోతే నన్నయిన సరే వాయించేస్తుంది". ఆమె శ్రద్ధగా వినటం గమనించి అతడు మళ్ళీ సిగరెట్టు దమ్ము లాగి, "నేలపైనగాని, వస్తువులపైనగాని దుమ్ము ధూళి ఉండటానికి వీల్లేదు. ప్రతిరోజు నీట్‌గా తుడుస్తుంది. ఈ సోఫాలు కొని అయిదేళ్ళయినా కొత్తవిగా లేవూ" అనడిగాడు.

అతడి మాటల్లో భార్యపట్ల అతడి ప్రేమ, ఏదో గర్వం ధ్వనించేయ్.

ఆమె అతని మాటలు విని, అవునన్నట్టు తలాడించి, కదిలి పుస్తకాల షెల్ఫ్ వైపుగా వచ్చింది. దానిపై నున్న రాధాకృష్ణుల విగ్రహం ఆమె దృష్టి నాకర్షించింది. అది లోహంతో చెయబడి వెండిపూత పూయటం చేత ధగధగ మెరుస్తోంది. ఆమె ఆ విగ్రహాన్ని

చేతుల్లోకి తీసుకొని పరీక్షగా చూడసాగింది.

వెనక నుంచి అతడు, "దాని మా పెళ్ళి రోజు నాకు కొనిపించింది మా రమ. ఎలా వుంది?" అనడగాడు.

ఆమె ఏం మాట్లాడక ఆ విగ్రహం వంక తదేకంగా చూసి, తిరిగి యధాస్థానంలో వుంచి, కదిలి మరో గదిలో కెళ్ళింది.

అతడూ ఆమెతోపాటుగా ఆ గదిలోనికి ప్రవేశించి ప్యాంటు, షర్టు విడిచి లుంగీ ధరించేడు. అటుపైన వంటిపైనున్న బనీను తీసి, టవలు భుజాన వేసుకున్నాడు.

ఆమె ఇవ్వేమి గుర్తించనట్టుగా గది మధ్యగా నిల్చుని చుట్టూ చూస్తోంది. డబుల్ కాట్స్. వాటిపైన రబ్బరు పరుపులు ఆకర్షణీయమైన దుప్పట్లు కప్పబడి వున్నయ్. తెల్లని తలగడ గలీబుల పైన చిలుక, గోరింకల బొమ్మలు. 'గుడ్‌నైట్' లాంటి పదాలు రంగురంగుల దారాలతో పతిభావంతంగా అల్లబడి వున్నయ్. వాటిక్కాస్త దూరంగా డ్రెస్సింగ్ టేబిలు, దానికి నిలువుటేత్తు అద్దం- దానిలో మంచంపైని మనుష్యులు స్పష్టంగా కన్పించేలా అమర్చబడి వుంది.

ఆమె డ్రెస్సింగ్ టేబల్‌పై నున్న ఫోటోఫ్రేముని చేతుల్లోకి తీసుకొని పరీక్షగా చూడసాగింది.

"నేనూ మా రమా కలిసి ఈ మధ్యనే తీయించుకున్నాం" అన్నాడతను.

ఆమె ఆ స్త్రీమూర్తి వంక పరీక్షగా చూసింది. పెద్ద అందగత్తె కాకపోయినా మొగుడి ప్రక్కనుండటం వల్ల కాబోలు నిండుగా, హుందగా వుంది. ఇంటిని గురించి, భర్త గురించి తీసుకున్నంత శ్రద్ధ తనపైన చూపించుకోకపోవటం వల్ల నిరాడంబరంగాను, సింపుల్‌గాను ఉంది. కాని ఆమె కళ్ళలో ఏదో కాంతి, గర్వం కన్పిస్తున్నాయ్.

అతడు కదిలి లోనికెళ్ళబోతూ, "కాఫీ టీ లాంటివి తాగాలనుకుంటే అన్నీ అక్కుడున్నాయ్. కలుపుకొని తాగొచ్చు. అయిదు నిముషాల్లో స్నానం చేసొస్తాను" అంటూ దొడ్లోకి నడిచేడు. ఆమె మధ్యగదిలోంచి, వంటగదిలోకి తొంగి చూసింది. అతడు చెపుతున్నట్టుగా అన్నీ ఒక పద్ధతి ప్రకారం అమర్చబడి వున్నయ్.

అమె తృప్తిగా తలాడించి గది మధ్యకొచ్చి నిల్చుంది. ఆ ఇంటి అలంకరణని చూస్తున్నకొద్దీ అమెలో ఏదో పోగొట్టుకున్నట్టు లోటు, తన ఊహల్లో తనాశించి, బ్రతకలేకపోతున్న జీవితాన్ని అద్దంలో దర్శించుకున్నట్టు ఎదుటతని ఆ ఇల్లాలు నిర్మించుకున్న ఆ మమతల సామ్రాజ్యంలో ప్రవేశించిన మరమనిషినన్న భావన, పవిత్రమైన దేవాలయంలో ప్రదేశించిన పాపిలాగా!!.

***

పది నిమిషాల తర్వాత అతను స్నానం పూర్తిచేసి లోనికొచ్చాడు. తలని శుభ్రంగా తుడుచుకుని నీటుగా దువ్వుకొచ్చాడు.

ఏమైంది, ఎక్కడికెళ్ళిదని అనుకుంటూ తలుపు తీసి వాకిట్లోకి చూసేడు. కానీ అక్కడా లేదు. అతడికేమీ అర్థంకాక మళ్ళీ మధ్యగదిలో కెళ్ళాడు. ఏమైంది- చెప్పకుండా అంత అకస్మాత్తుగా ఎందుకలా వెళ్ళిపోయింది?

అలా అలోచిస్తున్న అతడి బుర్రలోకి ఏదో అనుమానం ప్రవేశించడంతో, అతడి మొహంలో భయం తాలూకు ఛాయలు గోచరించాయ్. వెంటనే తను విడిచిన ప్యాంటులోంచి మనీపర్సు తీసి చూసుకున్నాడు. దానిలో ఉంచిన డబ్బు యధావిధిగా వుంది.

స్నానానికెడుతూ డ్రెస్సింగ్ టేబులుపైన ఉంచిన ఖరీదయిన తన రిస్టువాచీ కోసం చూసేడు. అది తానెక్కడ ఉంచాడో అక్కడే ఉంది. వెంటనే బీరువా తీసి భార్య తాలూకు పట్టు చీరెలు లెక్క చూసేడు. అవీ సరిగానే ఉన్నాయ్.

మరెందుకలా చెప్పకుండా మయామైనట్లు?

ఆమె అడిగినంత ఇస్తానన్నాడు అయినా ఎందుకెళ్ళిపోయింది? అతడికేం అర్థంకాక ముందుగదిలో కొచ్చి సోఫోలో కూర్చున్నాడు.

అపుడు చూసేడు.

తనూ, తన భార్య కలిసి తీయించుకున్న ఫోటోఫ్రేమ్ అక్కడ టీపాయ్ పై వుంది.

అది చూసేక అతడికాశ్చర్యం వేసింది. అక్కడి డ్రెస్సింగ్ టేబుల్‌పై ఉండవలసినది, ఇక్కడెందుకుందను కుంటూ దాన్ని చేతిలోకి తీసుకు చూసేడు.

అతడికి దానిపై రెండు కన్నీటి చుక్కలు కన్పించినాయ్.

అతడా సంగతే గమనించనట్లు తన లుంగీతో ఆ ఫ్రేముని శుభ్రంగా తుడిచి మళ్ళీ టీపాయిపై వుంచి అక్కడున్న భార్య వ్రాసిన ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని తిరిగి చదవటం మొదలుపెట్టాడు.

●●●

''ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచనమే కథానిక'' అనే నిర్వచనానికి చక్కని ఉదాహరణం ఈ కథ. ప్రారంభించిన అంశంతోనే ముగిసే ఈ కథలో అద్యంతాల మధ్య ఈ ఆదర్శవంతమైన సమన్వయం ఉంది. కథనంలో చదివించే శిల్పం ఉంది. చివరలో ఓ హెన్రీ మార్కు కొసమెరుపుంది. మనిషిని బట్టి వృత్తిని బట్టి గుణాన్ని అంచనా వెయ్యడం సరికాదని, మనసున్న మనిషికి జాతితోను వృత్తితోను సంబంధం లేదని, శంకరమంచి పార్థసారథి చేసిన రచన అంటే హాస్యమే కానక్కరలేదని నిరూపిస్తూ , పాఠకుల అంచనాలకు ఆలోచనలకూ భిన్నంగా నడిచే మానవతా స్పర్శ గల కథ ఈ 'ఆరోజు రాత్రి '

– వంశీ




# అవతలి కోణం

## శ్రీమతి తురగా జానకీరాణి

( ఆంధ్రసచిత్ర వారపత్రిక , జనవరి 1960 సంచికనుంచి పునర్ముద్రితం)

సికిందరాబాదు స్టేషనులో రైలు ఆగి పది నిముషాలైంది.

తలుపు దగ్గర నిలబడి ప్లాట్ ఫారం అంతా కలయ చూసి చూసి సీత లోపలి తిరిగి వచ్చింది. సుందర్రావు బద్ధకంగా ఆవులించి లేచి కూర్చున్నాడు.

"ఏం? రాలేదా మీ వేలు విడిచిన చెల్లాయి?" అన్నాడు.

"ఇక్కడికి రాదు."

"హైదరాబాదు స్టేషనుకి వస్తాను. ఇక్కడ దిగొద్దు. అని రాసింది __ లేవండీ. యింకా ఏం బద్ధకం చెప్పండి. నానీకి ఏమైనా కొనిపెడుదురుగాని అలా వెళ్లి."

సుందర్రావు లేచి వళ్లు విరుచుకుని, పేపరు మడతపెట్టి, "ఏం కావాలిరా నానీ బాబూ?" అని కొడుకుని పలకరించాడు. వాణ్ణి ఎత్తుకుని రైలు దిగి క్రిందికి వెళ్ళాడు.

స్టేషనులో కోలాహలం చూస్తోంటే సీతకి తన చిన్నతనంలో బెజవాడ ప్రయాణం జ్ఞాపకం వచ్చింది __ అప్పట్లో సుమిత్ర కూడా వుంది. ఎవరిదో పెళ్ళయితే వెళ్ళారు. బెజవాడ స్టేషను చూస్తే తనకు మహా ఆశ్చర్యమనిపించింది. అది లోకంలో ఒక భాగంగా కాక, ఒక ప్రత్యేక ప్రపంచంలో కనుపించింది. తను, సుమిత్ర ఒకళ్ల చేతులు ఒకళ్లు గట్టిగా పట్టుకుని, ఎక్కడ తప్పిపోతామా అన్నట్లుగా నడిచారు. ఆ తర్వాత నాలుగేళ్లు కూడా కలిసిలేరు యిద్దరూ.

సుమిత్ర స్కూల్ ఫైనల్ వరకు ఆ వూళ్ళో చదివింది. అవడానికి అప్పాచెల్లెళ్ల పిల్లలే ఐనా సుమిత్ర, తను చిన్నతనం నుంచీ ఒకేచోట అరమరికలు లేకుండా పెరిగారు. ఆ తర్వాత కాలేజీ చదువుకి వేరే వూరు వెళ్ళిపోయింది సుమిత్ర. తన పెళ్లికి కూడా వచ్చింది కాదు. ఎమ్.ఏ ప్యాస్ అయిందనీ, హైదరాబాదులో పెద్ద ఆఫీసరుగా వున్నదనీ తెలిసింది.

చిట్టి ఏడుపుతో ఆలోచనలు చెదిరిపొయ్యాయి సీతకి. దాన్ని ఎత్తుకుని సముదాయించి మళ్ళీ పడుకోబెట్టింది. ఫ్లాస్కులో వేడినీళ్ళలో తువ్వాలు ముంచి, చిట్టి వళ్ళంతా తుడిచింది.

రైలుకి గంట కొట్టారు. సుందర్రావు వచ్చి రైలెక్కాడు. నానీ చేతుల్లో బిస్కట్లు, చాక్లెట్లు వున్నాయి.

"ఇంక యిరవై నిముషాలు పడుతుంది అక్కడికి చేరడానికి." అన్నాడు సుందర్రావు వాచీ చూసుకుని.

పొదరు వేస్తుంటే చక్కిలిగింతలు పెట్టినట్టుంది కాబోలు చిట్టి పకపకలాడుతోంది. 'వూ' కబుర్లు చెబుతోంది.

"నువ్వు దిగడం సంగతి సరే గానీ, నేను కూడా వస్తే ఏం బాగుంటుంది చెప్పు - ఆవిడ ఒక్కత్తే వుంటున్న చోటుకి" అన్నాడు సుందర్రావు.

"ఏమీ ఫరవాలేదు. పైగా అది అంతగా రాసినప్పుడు వెళ్లకపోతే బాగుండదు. మీకెందుకు నాకు లేని యిది?" చిట్టిని ఎత్తుకుని ఎదుటి బెర్తు మీద పడుకోబెట్టి, చిన్న చిన్న వస్తువులన్నీ పేము బుట్టలో పడేసింది సీత.

"నువ్వు ఆవిణ్ణి చూసి ఎన్నేళ్లయింది? గుర్తుపడతావా?" అన్నాడతను మళ్ళీ.

సీత నవ్వింది. "మంచివారండి! మర్చిపోతానేమిటి? __ ఎంత యిదిగా వుండేవాళ్ళమనుకున్నారు? స్కూల్ ఫైనల్ వరకు ఒక్కచోట పెరిగాము. అస్తమానం ఇద్దరం కలిసే వుండేవాళ్ళం. మా అమ్మ నవ్వుతూ వుండేది __ వీళ్లకి పెళ్ళిళ్ళైతే కాపురాలకి వెళ్లమని పేచీ పెడతారేమోనని. అది డాన్సు నేర్చుకుంది. మా నాన్న నాకు నేర్పించలేదు. మళ్ళీ ఏడాదికే నా పెళ్ళి ఐపోయింది." రైల్లోంచి తొంగిచూసింది సీత. దూరంగా మేడలు, పొగగొట్టాలు కనుపిస్తున్నాయి. ప్రక్కనున్న హుస్సేన్ సాగర్ మీదనుంచి చల్లగాలి వీస్తోంది.

"అది బాగా చదువుకుని పైకి వెళ్ళింది __ ఉద్యోగస్తురాలైంది. నేనిలా సంసారంలో పడ్డాను." వెనక్కి తిరిగి సుందర్రావు వంక చూసి నవ్వింది సీత.

"ఆ హోల్డాలు కట్టేయండి. నేను కుస్తీ పట్టలేను దాంతో." అన్నది. సుందర్రావు లేచాడు.

సామానంతా సర్దుకుని, చిట్టిని ఎత్తుకుని నానీని సవరించి కూర్చోబెట్టేసరికి, పబ్లికు గార్డెన్సు మధ్యలోంచి పోతోంది రైలు.

"పూలు, పూలు" అంటూ ఎగిరాడు నానీ. "అవి పేపర్ ఫ్లవర్సా నాన్నా?" అంటున్నాడు వాడు.

రైలు ఆగకుండానే కంపార్టుమెంటులోకి ఇద్దరు కూలీలు ఎక్కారు. కిటికీలోంచి తల బైటికి పెట్టి చూసింది సీత. రైలు ఆగింది. సుమిత్ర ఎక్కడా కనబడలేదు. సామాను అంతా దింపేస్తున్నారు కూలీలు.

సుందర్రావు కోటు తీసి భుజాన తగిలించుకుని "కనుపించిందా?" అన్నాడు. సీత లేదన్నట్టు తలూపింది.

"దిగండి చూద్దాం." అన్నది. అతను క్రిందకి దిగి సామాను లెక్క చూస్తున్నాడు. అతనికి చిట్టిని అందించి తనూ దిగింది సీత.

"సీతా!" ప్రక్కనుంచి తెల్లనిచేయి పడింది సీత భుజాన.

సుమిత్ర! సుమిత్రే?ఎంత మారిపోయింది?

"మీ రైలు పదకొండున్నర వరకు రాదని ఎంక్వైరీ వాడు చెప్పాడు. ఆఫీసుకి వెళ్లి, కొంత పని చూసుకుని ఇల్లా వచ్చాను. ఎన్నాళ్ళకి చూశాను నిన్ను! పదేళ్ళయిందేమో కదూ!" అన్నది సుమిత్ర. ఆమె నవ్వితే బుగ్గలు చక్కని సొట్టలు పడుతున్నాయి.

"చాలా మారావు సుమిత్రా నువ్వు _ ఇరుగో. ఈయన్ని చూడలేదుగా నువ్వు? వీళ్ళిద్దరినీ_"

సుమిత్ర సుందర్రావు వేపు తిరిగి "నమస్కారమండి" అన్నది.

సుందర్రావు ఒక చేతిలో సిగరెట్టు, భుజాన కోటు, రెండో చేతిలో చిట్టి వుండగా, ఏం చేయాలో తోచక, కంగారుగా నవ్వి, "నమస్కారం" అన్నాడు.

సీత కిలకిల నవ్వింది. "బావుందండీ! బావామరదళ్ళు నమస్కారాలెట్టుకోవడం! దాన్నిల్లా ఇవ్వండి. " అని చిట్టిని తీసుకుంది. నాని సుమిత్ర వంక బెరుగ్గా కొత్తగా చూస్తూ, వాళ్ళ నాన్న చేయి పట్టుకున్నాడు.

బయటకు వచ్చి టాక్సీ ఎక్కేసరికి పదకొండున్నర ఔతోంది. "మీరు ఆఫీసుకి వెళ్ళాలేమో!?" అన్నాడు సుందర్రావు.

"అక్కర్లేదండీ. రెండు గంటలకి వెడతాను." అన్నది సుమిత్ర.

"ఏం సీతా ఏమీ మాట్లాడకుండా యిలాగైపోయావేమిటీ?" ఏమండీ, మా సీత యింత నిశ్శబ్దంగా ఉంటుందా ఎప్పుడూ మీరు ఎప్పుడూ దాని వాగ్ధోరణిలో మునిగిపోతుండాలేమోనని నేను భయపడుతుండేదాన్ని."

సుందర్రావు నవ్వాడు. "లేదండీ. నాక్కూడా సరదాయేనండీ సీత మాటలంటేను.. మీ దగ్గర క్రొత్తలాగుంది." అన్నాడు.

సీత మళ్ళీ కిలకిల నవ్వింది. "మరే! ఐనా రైలు దిగుతూనే మొదలెట్టాలా కబుర్లు? మా సుమిత్రతో చెప్పుకోవలసినవి లక్ష ఉంటాయి.. అవన్నీ మీరుండగా ఎల్లా?" అని సుమిత్ర వంక చూసింది.

సుమిత్ర చాలా అందంగా ఉంది. చిన్నప్పుడే అంతా అనుకునేవారు. అప్పుడు బాగా సన్నగా వుండేది, అతి నాజూకు అనిపించేలా. ఇప్పుడు కొంచెం లావు కావడం వలన, చక్కదనం వచ్చింది. చేతులు మొగలిరేకుల్లా ఉన్నాయి, మెడ, చెవులు, నుదురు, వింతగా శోభతో నిండి ఉన్నాయి. కాటుకకి ప్రతిగా కళ్ళు అతి స్నిగ్ధంగా తెల్లగా వున్నాయి, టాక్సీ యింటికి చేరేలోగా సీత గమనిస్తోంది సుమిత్రని.

"అంతగా మారిపోయానా సీతా? అంతిదిగా చూస్తున్నావు. నువ్వు మాత్రం మారలేదేమిటి. పూర్తిగా గృహిణివైపోయావు?" అన్నది ఆమె "ఇంతకీ వీళ్ళ పేర్లేమిటి?" అన్నది.

"వీడు నానీ, అది చిట్టి. అసలు పేర్లు చెప్పము మేము. నవ్వుతారు మీరు." అన్నాడు సుందర్రావు.

చిన్న యింటి ముందు ఆగింది టాక్సీ. గేటు దగ్గర ఒక పనిమనిషి కూర్చుని వుంది. సుమిత్ర దానికి ఇంటి తాళంచెవి ఇచ్చి, ముందుకి వెళ్లి టాక్సీ వాడికి డబ్బిచ్చేసింది "అదేమిటండీ" అని సుందర్రావు అంటున్నా వినిపించుకోకుండా.

పనిమనిషి తాళం తీసి వచ్చి, సీత చేతుల్లోంచి చిట్టిని తీసుకుంది. ముందుగదిలో బుల్లి సోఫా సెట్టు, రేడియో, ఒక మూల బల్ల మీద పత్రికలు. అద్దాల బీరవాలో పుస్తకాలు, గదినిండా అక్కడక్కడ పెయింటింగ్సు, పనితనం చూపించే అందమైన చిన్న చిన్న వస్తువులున్నాయి. సీత యివన్నీ ఒకసారి కలయచూసి, రెండో గదిలోకి వెళ్ళింది. అక్కడ ఒక మంచం, డ్రెస్సింగు టేబిలు, అద్దం బీరువా వున్నాయి. ఆ తర్వాత రెండు గదులు. ఒక గది చాలావరకు ఖాళీగానే ఉంది. ఒక అలమారలో కంచం, చెంచాలు, టీ సెట్టు మాత్రం ఉన్నాయి. చివర గది వంటిల్లు.

సామాను లోపల పెట్టించి, సుందర్రావుని కూర్చోమని చెప్పి, సుమిత్ర లోపలికి వెళ్ళింది.

"ఏం? నచ్చిందా నా సంసారం?" అన్నది.

సీత అంతా కలయచూసి "చాలా చేర్చావే, సామాను, ఒక్కర్తెకీను?" అన్నది.

"ఒక్కళ్లయినా, నలుగురైనా అవసరాలు ఒకటేగా. ఏది లేకుండా నడుస్తుంది. కాఫీ త్రాగుతారా? బ్రెడ్ వుంది. అది తినలేమంటే యిడ్లీలు తెప్పిస్తాను." అంది సుమిత్ర.

"ఇప్పుడేమీ వద్దు. స్నానం చేసి భోజనం చేస్తాము. నాకు అక్కడ యిదే వేళకి భోజనం అలవాటు. ఆయన పదింటికి టిఫిను తిని వెళ్లి, ఒంటిగంటన్నరకి భోజనానికి వస్తారు. అందాకా వంట మనిషి అలా అన్నీ వేడిగా వుంచాల్సిందే. పిల్లలకేమో వేరే వంట తొమ్మిదిన్నరకల్లా ఐపోతుంది. అదేలే పిల్లలేమిటిలే. నానీకి ఒక్కడికే ఖారం తినడుగా వాడు! ఉప్పేసి కూరలు వుడికించి, కొంచెం వెజిటబిల్ సూప్ చేసి పెట్టేస్తాను వాడికి. వాడి వంట మాత్రం నేనే చేస్తాను." చెప్పుకుంటూ సీత ఇవతలికి వచ్చింది.

డ్రాయింగురూముని ఆనుకుని వున్న ఒక గదిలో పెట్టించింది వాళ్ల సామానుని సుమిత్ర.

"ఇక్కడ ఇంకో గది ఉన్నదేమిటి? ఖాళీగా ఉందేం యీ గది?" అన్నది సీత.

"నేను చదువుకోవడం, వ్రాసుకోవడం యీ గదిలో _ బైటికి తలుపుంది కదూ? మా ఆఫీసు వాళ్లెవరైనా వస్తే మాట్లాడ్డానికి వుంటుంది. దీన్లోని కుర్చీలు బైట వరండాలో వేయించాను."

అందరి స్నానాలు అయ్యేసరికి 12-30 అయింది. సుమిత్ర వడ్డించింది.

"మీరు వంట చేసుకుంటారా?" అన్నాడు సుందర్రావు భోజనానికి కూర్చుంటూ.

"సాధారణంగా చేసుకుంటాను. బద్ధకమనిపిస్తే హోటలు నుంచి తెప్పిస్తాను. నా నమ్మినబంటుని చూశారుగా. ఇక్కడే దానిల్లు. ఎప్పుడు కేకేసినా పలుకుతుంది. ఇవ్వాళ్లనుంచి రోజల్లా యిక్కడే ఉండమని చెప్పాను _చాలా మంచిది."

నానీ అన్నం తినడానికి పేచీ పెడుతున్నాడు. అది కాదు యిదని, యిది కాదు అదని వాళ్లమ్మని వేధిస్తున్నాడు.

"ఏం? మీ వాడికి సరిపడదా నా వంట!" అన్నది సుమిత్ర.

సీత వాడితో విసిగిపోయింది. "ఆ! వాడి చిత్తమైతే తింటాడు అన్నీ . ఆ పెరుగు యిల్లా పెట్టు." అన్నది. చివరికి పెరుగు అన్నం మాత్రమే తిన్నాడు వాడు.

"సాయంత్రం నేను వండేస్తాను వీడికి" అన్నది సీత.

సుందర్రావు వంట బాగుందన్నాడు. "హోస్టల్లో వుండరాదండీ. వంటరిగా ఏం వుంటారు యిల్లా?" అన్నాడతను.

"చీకు, చింతా లేకుండా హాయిగా వుంది యిక్కడ. ఇక్కడుండే స్వతంత్రం అక్కడుంటుందా ఏమిటి?" అన్నది సీత.

భోజనాల తర్వాత సుందర్రావు పడుకున్నాడు. నానీ కూడా పడుకున్నాడు.

సీతకి నిద్ర రాలేదు. హోల్డాలు, పరుపులు అవీ పైన డాబా మీద ఎండేసి రమ్మని పంపించింది పనిమనిషిని సుమిత్ర.

"నువ్వు ఆఫీసుకి వెడతానన్నావుగా! తర్వాత పడుకుంటానులే, చెప్పు కబుర్లేమిటి?" అంది సీత రేడియో త్రిప్పుతూ.

"ఏమున్నాయి? యీ మధ్య మన వూరు వెళ్లి వచ్చాను. పిన్నీ వాళ్లని చూసి వచ్చాను. నువ్వు సంక్రాంతికి రాలేదని చాలా యిదౌతున్నారు. ఐనా అక్కడి ఖబుర్లు నేను చెప్పేదేమిటి? ఉత్తరాలు వ్రాసుకుంటున్నారు కదా మీరు? నాతోనే బొత్తిగా ఉత్తరాలు లేవు నీకు _"

సీత నిట్టూర్చింది. "ఏమిటి, ఉత్తరాలు వ్రాసుకునే తీరిక ఎక్కడ? ఈ పిల్లలతోనే సరిపోతుంది. పెళ్లి ఐనాక, యింక ఆ మొగుడు, పిల్లలే అనుకో. పెళ్లయేదాకనే ఏమైనా. నువ్వు యిల్లా వున్నావూ స్వతంత్రంగా నీ యిష్టమైన పని చేసుకుంటావు, కావలసినవి తెచ్చుకుంటావు .ఒకరి నిబంధన ఏమిటీ నీకు? మా తరహా వేరు."

సుమిత్ర మాట్లాడలేదు. చిన్నగా నవ్వింది.

"అల్లాగని నేను మహా కష్టపడిపోతున్నాననుకునేవు. మీ బావ చాలా మంచివారనుకో. కానీ ఆ భేదం భేదమే." అన్నది సీత వెంటనే సర్దుకుంటున్నట్లుగా.

"నువ్వు పాసైనదేమిటి. యమ్.ఏ నా?" అనడిగింది కొంచెం ఆగి.

"అవును. పైన యింకో డిప్లొమా కోర్సు చదివాను ఒక ఏడాది పాటు. అది మాకు పనికి వచ్చేది. అందుకే తొందరగా ప్రమోషన్లు వచ్చాయి."

"నీకెంతిస్తారు యిప్పుడు?" చటుక్కున అడిగింది సీత.

"నాలుగొందల యాభై వరకూ వస్తుంది."

సీత రేడియో ఆపేసింది. "ఆయనకి ఎనిమిది వందల పాతిక వస్తుంది. ఏం లాభం?" అంతా ఆ స్టయిలుగా బతకడానికే సరిపోతుంది. పరిచయస్తులంతా ఆఫీసర్లే. వాళ్ళతో సరిసమానంగా వుండాలి. కంపెనీ వాళ్ళు కారు యిస్తారనుకో. బంగళా యిస్తారు. బొచ్చుకుక్క తిండికే ఔతుంది నెలకు ముప్పై నలభై వరకు. నానిగాడికి మటుకు బళ్లో నెలకి పది రూపాయలు. మన కారులో దింపుకుంటాము కాబట్టి గానీ, లేకపోతే పైన యింకో పాతిక ఔతుంది. వంటమనిషి, తోటమాలి, డ్రైవరు వీళ్ళతో సతమతమవడంతో సరిపోతుంది టైము. అంటే దాన్లో సుఖాలు లేవని కాదుగాని, సంగతికి చెబుతున్నాను." అన్నది సీత.

సుమిత్ర లేచి టైము చూసుకుంది. "ఔను మరి. ఎవరికి తగ్గ ఖర్చులు వాళ్లకి ఔతూనే ఉంటాయి. టైమయింది, ముఖం కడుక్కుని వస్తాను. ఆఫీసు కారు వస్తుంది." అన్నది. ముఖం కడుక్కుని వచ్చి, బొట్టు పెట్టుకునేసరికి బైట హారను మోగింది. కొద్ది క్షణాల్లో డ్రైవరు వచ్చి నమస్కారం పెట్టి తలుపు దగ్గర నిలబెట్టాడు.

"ఇది పట్టుకెళ్ళు." అని ఒక చిన్న ఫైలు డ్రైవరుకందించి "ఐదుంబావుకల్లా వచ్చేస్తాను. ఏం కావాలన్నా పనిమనిషి వుంటుంది. కార్డులూ అవీ కావాలంటే డ్రాయర్లో వున్నాయి. సాయంత్రం కాఫీ, టిఫిను బైటికి వెళ్లి తీసుకుందాం. ఇక్కడేమీ ప్రయత్నం చేయకు." అని సుమిత్ర వెళ్ళిపోయింది.

సీత సోఫాలో వాలింది. తనకి సుమిత్ర చేసే ఉద్యోగమేమిటో కూడా చెప్పినా అర్థం కాదు. తన చదువు అల్లా ఐపోయింది. తనిష్టంతోనే చేశారు పెళ్లి. కానీ ఆయనకి చదువు తక్కువని తను మొదట్లో యిష్టపడలేదు. తన తర్వాత వున్న నలుగురు చెల్లెళ్ళనీ చూసి, తండ్రి స్థితి చూసి వప్పుకుంది. అదృష్టం వుండి, కంపెనీ వాళ్ళ చలవ వుండి ఇంటర్మీడియేటు ఫెయిలయిన సుందర్రావు ఎనిమిది వందల రూపాయల జీతగాడయ్యాడు. కంపెనీ వాళ్లకి అతను అభిమానపాత్రుడైనాడు. కానీ తనకీ, ఆయనకీ అర్థం కాని విషయాలెన్నో తెలుసు సుమిత్రకి.

కళ్ళు మూసుకుంది సీత. ఎందుకో బాధగా వుంది. కళ్ళ ముందు ఒక చిన్నారి పిట్ట తన యిష్టం వచ్చినంత ఎత్తులో, యిష్టం వచ్చినట్టు గిరికీలు కొట్టే చిన్నారి పిట్ట కనుపిస్తోంది. విశాలమైన ఆకాశం వుంది దానికి, తన రెక్కలు విదిలిస్తూ ఎగరడానికి. సుమిత్ర అల్లాగే కనిపిస్తోంది. ఆకాశం నుంచి క్రిందకి లాగేసే త్రాళ్ళు లేవు. తను? గాలి పటం లాంటిది తన జీవితం. క్రిందనుంచి విడిచే దారం పరిమితం అంతవరకే తన పయనం.

చిట్టి కేరుమన్నది మంచం మీద. దోమ తెర వత్తిగించి దాన్ని ఎత్తుకుని బైటికి వచ్చింది సీత.

సుందర్రావు పిలిచాడు "కొంచెం మంచినీళ్లివ్వు సీతా!" అని. ఒక చేత్తో మంచినీళ్ళ గ్లాసు పుచ్చుకుని, అతనికిచ్చింది సీత.

"మీ చెల్లెలు ఆఫీసుకి వెళ్ళిందా?" అన్నాడు తను మంచినీళ్ళు త్రాగి.

"ఆ" అని గ్లాసు తీసుకుని లోపలికి వెళ్ళింది ఆమె. అతను హాల్లోకి వచ్చి కూర్చున్నాడు.

"ఈ పూట అంతా రెస్టు అన్నమాట. రేపు నేను వచ్చిన పని చూసుకోవడం ప్రారంభిస్తాను. ఇదివరకెప్పుడూ యిల్లా లేదు నా పని. రాగానే టంచన్ గా పని చూసేసుకోవడమే. ఇదుగో యీ సంసారంతోనే యిల్లాంటి బద్ధకం ఎక్కువైపోయేది." అన్నాడతను తనలో తను అనుకుంటున్నట్లుగా.

"నేను, పిల్లలు కట్టేశామా మిమ్మల్ని పని చూసుకోవద్దని? వెళ్ళండి మహారాజులా." చిట్టికి పాలు పడుతూ కూర్చునున్నది సీత.

సుందర్రావు తలెత్తి ఆశ్చర్యపోయినట్లు చూశాడు. పుస్తకాల బీరువా తీసి, పుస్తకం ఒకటి తిరగవేయటం మొదలుపెట్టాడు.

ఐదున్నర కల్లా హోటలు చేరారు. టిఫిను, ఫ్రూట్ సాలెడ్ తెప్పించింది సుమిత్ర. నానీ హుషారుగా తిన్నాడు. బిల్లు సుమిత్రే ఇచ్చింది సుందర్రావు అభ్యంతరం పెడుతున్నా వినిపించుకోకుండా. "ఇక్కడున్నన్నాళ్ళు నా అతిథులు మీరు" అన్నది.

వాళ్ళు మెట్లు దిగుతోంటే ఒకతను వెనకనుంచి గబగబా వచ్చాడు. సుమిత్రకి నమస్కారం చేసి "నేను జ్ఞాపకమున్నానాండీ?" అన్నాడు.

సుమిత్ర ప్రతి నమస్కారం చేసి "మీరు ఆ కళాసంఘం కార్యదర్శి కదూ?" అన్నది. "ఔనండీ" అన్నాడతను.

"మీ సంఘం కార్యక్రమాలు బాగా సాగుతున్నాయా?" అన్నది సుమిత్ర. అతను ఏదో చెప్పాడు.

"వస్తానండీ." అని నమస్కారం పెట్టి వెళ్ళి పోయాడు.

కారులో ఎక్కారు ముగ్గురూ. కారు స్టార్టు అయ్యేలోగా అతనే మళ్ళీ గబగబ వచ్చాడు. అతని ప్రక్కన మరో ఇద్దరు యువకులున్నారు.

"క్షమించాలండీ క్షమించాలి. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు.. వీరు కూడా మా సంస్థ కార్యనిర్వాహక సభ్యులండీ. మీ పరిచయం కోసమని " అన్నాడతను.

వాళ్ళిద్దరూ నమస్కారాలు చేశారు.

"బంగారానికి తావి అబ్బినట్టు, మీ చదువుకు తోడు మీ నాట్యకళా కౌశలం ఉన్నదండీ." అన్నాడు ఒకతను.

సుమిత్ర నవ్వింది. "ఎంత మాట! అంత పెద్ద పొగడ్తలు భరించలేను నేను ఏదో నా శక్తికి తగిన కృషి. అంతే." అన్నది ఆమె.

ఆమె నోటివెంబడి వచ్చిన మాటలు వాళ్ళు ముగ్గురూ అతి శ్రద్ధగా విన్నారు. "వస్తామండీ మీ పరిచయభాగ్యం కలిగినందుకు చాల సంతోషం." అన్నారు. వెళ్ళి పోయారు.

సుమిత్ర చిరునవ్వుతో సీత వంక చూచి అడిగింది. "నేను డాన్సు చేస్తాను తెలుసా?" అని.

"తెలియకేం? పేపరులో చూస్తూనే ఉన్నాం కదా! నేను నేర్చుకుంటానంటే నాన్న వప్పుకున్నారు కాదు, అన్నిటితో పాటే అదీ అల్లాగే అయిపోయింది."

సుమిత్ర ముఖాన నవ్వు పోయింది. చటుక్కున సుందర్రావు వంక చూసింది. అతను సీత వంక ఒకసారి చూసి తల తిప్పేసుకున్నాడు సుమిత్ర చూపుని ఎదుర్కోలేడు అతను.

"ఎక్కడికి వెడదాం యింతకీ?" అన్నది సీత.

"సినిమాకి వెడదామా? పబ్లిక్ గార్డెన్సుకి వెడదామా? అల్లా టాంక్ బండ్ మీద నడుద్దామా?" అన్నది సుమిత్ర.

"వాకింగ్!" అన్నాడు నానీ. సుమిత్రకి నవ్వొచ్చింది. "కాన్వెంటులో కదూ వీడు చదువుతున్నాడు. అందుకే ఈ యింగ్లీషు మాటలు. ఏరా? తెలుగు మాట్లాడవా నువ్వు?" అన్నది వాడి బుగ్గ గిల్లి.

"నొ. అయిల్ స్పీక్ ఇన్ ఇంగ్లీష్." అన్నాడు వాడు. సుమిత్ర పకపక నవ్వి, వాణ్ణి దగ్గరకు తీసుకుంది.

ఆ తర్వాత నాలుగు రోజులు గడిచాయి.

సుందర్రావు పని పూర్తయ్యింది. సుమిత్ర ఒకరోజు సెలవు పెట్టి తెలిసినవాళ్ళ కారు ఒకటి తీసుకొచ్చి, చూడవలసినవన్నీ చూపించింది వీళ్ళకి. ఎక్కడికెళ్ళినా ఎవరో ఒకరు సుమిత్రని ఎరిగున్నవాళ్ళు కనుపిస్తూన్నారు. ఏదో విధంగా ఆమె విద్యని, నాట్యాన్ని పొగుడుతున్నారు. సుందర్రావు చెప్పాడు వాళ్ళ కంపెనీ బ్రాంచి మానేజరు కూడా సుమిత్ర చాలా సమర్ధురాలైన ఆఫీసరని చెప్పాడని.

ఓ నాడు సినిమాకి వెళ్ళారు అంతా కలిసి. చిట్టి సినిమా ఆరంభం కాగానే నిద్రపోయింది పేచీ లేకుండా. సినిమా చూస్తున్నంతసేపూ సీత మనస్సు ఏమీ బాగుండలేదు. ఏమిటో నిరుత్సాహంగా ఉంది. చిరుచీకట్లో సుమిత్ర వంక చూసింది. ఆమె కళ్ళల్లో మెరుపు కనిపిస్తోంది. ఆమె కూర్చున్న తీరులోనే ఒక సోయగం ఉంది. ఆమె చూపులో ఒక చకచక, ప్రతి కదలికలో ఒక చైతన్యం ఉన్నాయి. ఆమె జీవితంలోనే చైతన్యం తొణికిసలాడుతోంది అనుకుంది సీత. తన సంగతేమిటి? దైనందిన కార్యక్రమాలలో ఒక వరవడిలో నడుస్తుంది తన జీవితం. చెరువులో నీరు లాగా తన జీవితానికి కదలిక లేదు. సుమిత్ర ఒక సెలయేరు గలగలలాడుతూ, క్రొత్తదనాలతో పరవళ్ళు త్రొక్కుతూ ఉరుకులతో పరుగులతో ప్రవహించే సెలయేరు.

సీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ముత్యాల్లాంటి రెండు కన్నీటి బొట్లు బుగ్గల మీద నుంచి క్రిందికి జారాయి. ప్రక్కకి తిరిగి ఆయన్ని చూసింది. చెదిరిపోతూ కనపడింది ఆయన ఆకారం. తనకి యీర్ష్యా సుమిత్రని చూస్తే? ఎందుకు? తనకీ డబ్బు వుంది. తన భర్తకి హోదా ఉంది.

కానీ .. కానీ .. తమ జీవితాల్లో శోభ లేదు. తమకర్థం కాని విషయాలు, అర్థం చేసుకునే అవకాశం లేని విషయాలు ఎన్నో ఉన్నాయి. సుమిత్ర వున్న ఆ మెట్టు మీదికి, ఆ సంస్కార స్థాయికి ఎక్కడానికి తమకి అర్హత, అవకాశం లేవు. సీతకి ఈ ఆలోచనలు ఊపిరి సలపనివ్వలేదు.

తనని బంధించి, పైకి వెళ్ళనివ్వక, ఔన్నత్యాన్ని అందుకునే అవకాశం లేకుండా చేశాయి యీ పెళ్ళి, యీ పిల్లలు, సంసారం. తనలోని విద్యాతృష్ణకి, ఉత్సాహానికి వేరు మార్గం లేదు. 'ఇదే నీ జీవితానికి పరిధి. ఈ గిరి లోపలనే ఆనందం పండించుకో' అని విధించినట్లయింది.

సీతకి పెల్లుబికి వచ్చింది దుఃఖం. చటుక్కున లేచి బైటికి వెళ్ళిందామె. అక్కడ నిలబడలేకపోయింది. సుందర్రావు లేచి వస్తాడని తెలుసు. గట్టిగా కళ్ళు వత్తుకుని వెనక్కి తిరిగేసరికి, అతను ఎదురయ్యాడు.

"పదండి . వికారంగా వుండి యిల్లా వచ్చాను. సర్దుకుంది యిప్పుడు." అన్నది ఆమె మెల్లిగా.

ఆ రాత్రి సుమిత్ర త్వరగా నిద్రపోయింది. సీత పాపాయికి కావలసినవన్నీ సర్దుకుని, పడుకునేసరికి పన్నెండయింది.

సుందర్రావు చదువుతున్న పేపరు మడిచి పడేశాడు. "చూడు సీతా!" అన్నాడు.

"చెప్పండి."

"మీ సుమిత్ర పెళ్ళి చేసుకోదా అసలు?" అన్నాడు.

"ఇప్పుడెందుకొచ్చింది ఆ ప్రశ్న మీకు?"

"చేసుకునే ఉద్దేశం వుంటే ఓ సంబంధం చెబుదామని."

"ఎవరేమిటి?" అన్నది సీత కొంచెంసేపాగి.

"మా వేణు."

సీత మాట్లాడలేదు. ఒక పది నిమిషాలైనాక "దాని తరహా వేరు. పెళ్ళి, సంసారం, జంజాటం అంతా అఖ్ఖర్లేదు దానికి. హాయిగా వుంది. చీకు, చింతా లేకుండా పైకి వెడుతోంది. కీర్తి తెచ్చుకుంటోంది. దానికెందుకు పెళ్ళి, బంధనం కాకపోతే." అన్నది.

అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

"రేపు వెడతామండీ మేము." అన్నాడు సుందర్రావు మర్నాడు పొద్దున్న కాఫీలప్పుడు.

"అప్పుడే?" అన్నది సుమిత్ర సీత వంక చూసి.

"మరి వెళ్లొద్దూ? ఇప్పటికే వారమైంది వచ్చి. కంపెనీ పని ఈ రోజుతో అయిపోతుంది. ఇంకా వుండడమెల్లాగ?" అన్నది సీత.

"మీ సీత ఇల్లూ వాకిలీ చూడందీ బెంగ పెట్టుకుంటుందండీ. పాలవాడు, పనివాళ్ళు తనకోసం దిగులుపడి పోతుంటారని తన వూహ." అన్నాడు సుందర్రావు నవ్వుతూ.

సీత అతని వంక చూసి నవ్వింది. "మరే! మీరు లేకపోయినా నాకు బెంగ లేదు కానీ పాలవాళ్ళ కోసం మాత్రం బెంగే! ఏం?" అంది.

"ఎల్లుండి రాత్రి నా ప్రోగ్రాం వుంది ఇక్కడ. ఉండరూ? ఆవలెల్లుండి వెళ్లిపోదురు గాని." అన్నది సుమిత్ర సందేహిస్తో.

"మరి చెప్పరేం? తప్పకుండా వుంటామండీ. ఏం సీతా?" అన్నాడు సుందర్రావు హుషారుగా.

"మా సీత ఎల్లాగూ వుంటుంది. అడిగేదేమిటి?" అన్నది సుమిత్ర.

**********

కారు మంచి స్పీడు మీద మెత్తగా జారిపోతోంది రోడ్డు మీద సుమిత్ర తల్లో మల్లెపూల వాసన గుప్పున వేస్తోంది. చీకట్లో సుమిత్ర వంటినున్న ఆభరణాలన్ని ధగద్ధగాయమానంగా మెరుస్తున్నాయి. రేగిన జుట్టుని సవరించుకుంది సుమిత్ర. చేతినున్న గాజులు గలగలమన్నాయి. ఉంగరాలు, గాజులలోని రాళ్ళు తళుక్కున మెరిశాయి.

"సీతా, ఎన్నాళ్ళుగానో అంటున్నావు మీ సుమిత్ర డాన్సు చూడాలి, చూడాలని చూశావుగా? ఎల్లా వుందో చెప్పవేం?" అన్నాడు సుందర్రావు.

"నే చెప్పేదేవిటి? అక్కడి జనమంతా చెప్పారు. బిరుదు యిచ్చి అంతా గౌరవించారు. నా అభిప్రాయమెందుకు?" అన్నది సీత.

సుమిత్ర తన చేయి సీత భుజం మీద వేసింది. "అలా కాదు. నీ అభిప్రాయమే కావాలి నాకు. అందరూ అనే మాటకేంలే." అన్నది.

సీత మాట్లాడలేదు. కారు యింటికి చేరింది. డ్రైవరు మల్లెపూలదండలు, ఇతర సామానులు తెచ్చి లోపలపెట్టి సలాం చేసి వెళ్ళాడు.

లోపలి వెడుతూనే, తన గదిలోకి వెళ్లి డాన్సు డ్రెస్సు విప్పేసి, చీరె కట్టుకుని వచ్చింది సుమిత్ర. రేగిన ముంగురులు, ముఖాన రంగు, నల్లగా దిద్దబడిన కళ్ళు, కనుబొమ్మలు, కెంపుల్లా మెరుస్తున్న పెదిమలు.. సీత కళ్ళు మరల్చుకోలేనంత అందంగా వుంది సుమిత్ర.

"భోజనం చేద్దాం పదండి" అన్నది సుమిత్ర. భోజనం చేస్తున్నంతసేపు సుమిత్ర నవ్వినా, చూసినా, ఏం చేసినా లావణ్యం తొణికిసలాడుతోంది. ఆమె కంఠం గలగలలాడుతూ , చిరుగజ్జెలు మ్రోగించినట్లుగా శ్రావ్యంగా వుంది. అలనాడు లాస్యం చేసిన పార్వతి యిల్లాగే వుండేది కాబోలు అనుకుంది సీత.

"రంగు కడిగేసుకోపోతే, ఏమీ కాదా ముఖం!" అన్నది సీత.

"ఏమౌతుంది? ఏం కాదు.. అలవాటు లేనివాళ్ళకి తెల్లారేసరికి పీక్కుపోయినట్లవుతుంది ముఖం." అన్నది సుమిత్ర.

భోజనాలయ్యాక హాల్లో చాలాసేపు కూర్చున్నారు కబుర్లలో. సుమిత్ర తనకివ్వబడిన బంగారు నటరాజవిగ్రహాన్ని చూస్తో నిలబడింది చాలాసేపు.

పన్నెండైనాక సుందర్రావు లేచి "నిద్రొస్తుంది. నీకు నిద్ర రావడం లేదా?" అన్నాడు సీత వంక చూసి.

"మీరు పడుకోండి." అన్నది సీత. అతను వెళ్ళి పోయాడు.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. సుమిత్రనిట్టూర్చింది. "ఇన్నేళ్ళకి ఇప్పుడు కనిపించావు. ఇంకెప్పటికి కనిపిస్తావో మళ్ళా ?"

"మేమే రావాలని ఏమిటి? నువ్వు రాకూడదూ? హాయిగా వంటరిదానివి కదా? సుమిత్రా, ఎన్నైనా చెప్పు. చదువుకున్నవాళ్ళ దారి వేరు .. డబ్బు, హోదా ఎన్నైనా ఉండొచ్చు గాక. ఆ తరహా రాదు." హఠాత్తుగా ఆవేశపూరితమైంది సీత కంఠం.

"అల్లా అంటావేం సీతా? చదువుకుని నేను బావుకున్నదేమిటి? నీకు తక్కువైనదేమిటి?" అన్నది సుమిత్ర చేతులకి, చెవులకి ఉన్న వస్తువులు తీస్తూ.

"నీకర్థం కాదు సుమిత్రా, ఎల్లాగూ తప్పదు ఆ భేదం. అప్పుడు చదువుకోలేదా.. అంతే. ఇక ఎప్పుడూ ఆ రాత అంతే __ నా అంతట నేనిప్పుడు ఏదైనా నేర్చుకుందామన్నా తగిన ఆసరా లేదు. ఆయనా అంతంతమాత్రం చదువే చదివారు. యిక ఈ జన్మకి కుదరదు పైకి వెళ్లడమనేది మాకు. ఈ పెళ్లి, సంసారం, పిల్లలు, వీటిల్లో పడి ఏమీ తెలియక, ఏమీ పట్టక అన్యాయమైపోయాను" సీత కంఠం గద్గదికమైంది.

సుమిత్ర దగ్గరగా జరిగింది సీతకి. "చూడు, నేనేదో సాధిస్తున్నానని, అంతస్థులో వున్నాననీ అనుకుంటున్నావు నువ్వు . నీ సంగతి నీకు తెలియడం లేదు సీతా!"

సీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "నన్ను ఓదార్చాలని నాక్కూడా మా నాన్న చదువు చెప్పించి, ఏ సంగీతమో, ఏదో చెప్పిస్తే నేను కూడా పైకి వచ్చేదాన్ని కాదూ?"

సుమిత్ర మాట్లాడలేదు.

సీత అన్నది. "చిట్టి దీపం ఉంటే లేస్తుంది. ఆర్పేయి అది." అని.

సుమిత్ర లేచి ఆర్పేసి వచ్చింది. సీత చేతులు తన చేతుల్లోకి తీసుకుంది. పైకి రావడమంటే ఏమిటి సీతా? కొంత పేరు, డబ్బు, హోదా కదూ? ఏమిటా పైకి రావడం, నేనిప్పుడు ఔన్నత్యం పొందానంటావు నువ్వు. నేను సుఖపడుతున్నాననా? ఇవాళయితే మీరున్నారు, యీ దండలు, విగ్రహం చూడడానికి, నాకు బిరుదు ఇచ్చారని సంతోషించడానికి రోజూ ఎవరుంటారు? చీకట్లో, అర్ధరాత్రి

వేళ తలుపు తెఱుచుకుని, ఆ దండలు అలా పడేసి చెవుల్లో ఆ చప్పట్లు మారుమ్రోగుతోంటే వంటరిగా ఉండడానికి భయం వేసి, యింట్లోని దీపాలన్నీ వేసుకుని కూర్చుంటాను."...

కొంచెం ఆగి, "నాలుగు వందల మైళ్ళ దూరంలో వున్న అమ్మ, నాన్న నా దగ్గిర వున్నా నాకు శాంతినివ్వలేరు సీతా"

ఆమె చేతులు చల్లగా ఐపోయి, వ్రేళ్ళు ఏమీ తోచనట్లు సీత చేతుల్లో కదులుతున్నాయి.

"తోటిదానివి కాబట్టి నీతో చెప్పుకోగలుగుతున్నాను, నన్ను అపార్థం చేసుకోకు. నువ్వు ఆయన వంక చూసి నవ్వితే, ఆయన నీవేపు ఇష్టంగా నవ్వుతోంటే .. అప్రయత్నంగా యిది గమనిస్తోంటే అర్థమైంది ఆ లోటు ఏమిటో. నీకు తెలీదు నీ జీవితంలో ఎంత సంపూర్ణత్వం ఉందో, ఆ పిల్లల కోసం కష్టపడటంలో, ఆయన కోసం శ్రమించడంలో నువ్వు చూపే ఓర్పు చూస్తోంటే నీ జీవితమే అందుకు అర్పించేస్తున్నావని తోస్తోంటే.. నీలో ఔన్నత్యం కనుపిస్తుంది. నీలోంచి ఒక ప్రేమపూరిత వాహిని, ఒక తియ్యని వెల్లువ లోకాన్నంతనీ ముంచెత్తి వేస్తుందనిపిస్తుంది. సీతా, నీ కళ్ళల్లో లోతు నీకర్థం కాదు. అద్దంలో చూసుకుంటే కనపడదు. నీ చిట్టి వేపు నువ్వు చూస్తోంటే కనబడుతుంది..."

సీత మెల్లిగా తలెత్తి, సుమిత్ర కళ్ళల్లోకి చూడ్డానికి ప్రయత్నిస్తోంది. ఏముందో వెతకాలనుకుంది. సుమిత్ర తన అరచేతులు చెంపలకదుముకున్నది.

"నేనేమిటో పైకి వచ్చానంటావు.. కానీ నీలాగా పైకి రాలేదు సీతా నేను. నీకు భవిష్యత్తు వుంది. అనంతమైన భవిష్యత్తు వుందనిపిస్తుంది. మూడు జీవితాలు నిన్ను ఆధారం చేసుకుని, నిన్నల్లుకుని వున్నాయి. రెండు జీవితాలు మలచి, వ్యక్తిత్వాలు రూపొందించి, యింక ఎన్నో చేయాల్సిన భవిష్యత్తు వుంది. నీ జీవితానికి ఒక అర్థం, పరిపూర్ణత్వం ఉన్నాయి. నాకు ప్రాణం విసిగిపోతోంది. ఈ హోదా, జీతాలు, గొడవలు.. కానీ నేను జీవితంలో ఒక భాగాన్ని చూస్తున్నాను. ఆ భాగం ఇంక ఇక్కడికి అంతం చేసి యింకా ఎన్నో చూడాలి అనిపిస్తుంటుంది నాకు. లేకపోతే ఎన్నో అనుభూతులు, మమతలు, నాకు అర్థం కాకుండా ఉండిపోతాయి.".... సీతకిదంతా అర్థమౌతోంది. కానీ ఆమె ఇదంతా నిర్ధారణ చేసుకోవాలన్నట్లు సుమిత్ర ముఖంలోకి చూస్తోంది.

"సీతా, నేను స్వేచ్ఛగా వున్నానన్నావు. బ్రహ్మాండమైన ఎడారిలో విడిచేస్తే మనిషికి కావలసినంత స్వేచ్ఛ వుంటుంది _ అల్లాంటిదే నాదీ. ఆ స్వేచ్ఛ భరించడం కష్టం సీతా! ......." సుమిత్ర కంఠం వణుకుతోంది. సీత ముఖంలోకి వెతుకుతూ, తరచి తరచి చూస్తూన్న కళ్ళు , చీకట్లో కూడా మిలమిలలాడుతూ కనుపిస్తున్నాయి.

లోపల నానీ కదిలినట్టు అలికిడైంది. సీత చిట్టిని భుజాన వేసుకుని లేచింది "వేసంకాలం ఓ మాటైనా రాత్రి నీళ్ళు త్రాగించాలి వాడి చేత. దాహం వేస్తోంది పాపం!" అంటూ లోపలకి వెళ్ళింది. ఐదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చింది.

ఒక్క క్షణం ఆగి సుమిత్ర నవ్వింది "చూశావా మరి అదీ నీ తరహా చూడు, అన్నీ మర్చిపో. పడుకుని నిద్రపో నిశ్చింతగా. చిట్టి లేస్తుంటుంది నువ్వు పక్కన లేకపోతే.... పద. నా ధోరణే యింత" అన్నది.

మర్నాడు రాత్రి రైలు హైదరాబాదు విడిచిపెట్టి మెల్లిగా నడుస్తోంది. కనుమరుగయ్యేదాకా సుమిత్రని చూశారు సీత, సుందర్రావు. లోపలికొచ్చి తలుపు వేశాడతను.

సీత అతని వంక చూసి నవ్వింది. అతను కూడా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావు?" అన్నాడు.

"మీరెందుకు నవ్వారు?2 అంది సీత యింకా చిలిపిగా నవ్వుతూ.

"నువ్వు నవ్విన తర్వాత, నేను నవ్వకపోతే, నువ్వు ఏడుస్తావేమోనని" ప్రక్కన వచ్చి కూర్చున్నాడు.

"ఏడవలేకపోయానులెద్దురూ!" కిలకిల నవ్వింది సీత.

"చూడండి.. మన వేణూకి మీరు చెప్పిన సంబంధం చేద్దాం. ఏం?" అన్నది.

సుందర్రావు ముఖంలో ఆశ్చర్యం తొంగిచూసింది. ఎల్లా యీ మనిషిని అర్థం చేసుకోవడం అన్నట్లుగా ప్రశ్నార్థకం కూడా వచ్చింది. మరుక్షణం నవ్వి "అల్లాగే" అన్నాడతను.

.




# ఎందుకు పారేస్తాను నాన్నా!?

## చాసో

( భారతి మాసపత్రిక , మే 1944 సంచికనుంచి పునర్ముద్రితం)

చెల్లిని వొళ్ళో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్తున్నాడు. వాళ్ళ నాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బులిచ్చేడు.

కృష్ణుడు వీధి ముఖం చూడకుండా, మొగుడు చచ్చిన విధవలాగ ఇంట్లో దూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలుదాటి చుట్టల దుకాణానికెళ్ళాలి. మేస్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడుకి రోడ్డెక్కటమే నామోషిగా ఉంది. బడిపక్క నుంచి ఎలాగ వెళ్ళడమని గింజుకుంటూ బయలుదేరేడు.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నాది. బడిపెట్టేవేళ, వీధి చివర నుంచే బడిగోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడిపక్క నుంచి వెళ్ళక తప్పదు. రాక తప్పదు.

బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లలు గందరగోళంతో కలకల్లాడుతున్నాది. వరండాలు, గదులు, చుట్టూరోడ్లు, విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగా ఉంది. రోడ్డువారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

"కృష్ణా!" అని స్కూలు వరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగి చూడక తప్పిందికాదు. నరిసింహం పరిగెట్టుకొచ్చి వాడి భూజం మీద చేయ్యేసి-

"ఏంరా, నువ్వు బళ్ళోకి రావడం లేదు?" అనడిగేడు.

"సోమవారం చేరుతాను". అని కృష్ణుడు చెప్పేడు.

" పుస్తకాలు కొన్నావా?"

"ఇంకా లేదు"

"వేగిరం కొనుక్కో మళ్ళా అయిపోతాయి. ఎక్సరుసైజు పుస్తకాలు షాపుల్లో కొనకేం. స్టోర్సులో చవగ్గావున్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగిపోయాయిరా!?"

నరసింహం డబల్ కప్పు చొక్క హనావాపేంటూ, జోళ్ళూ తొడక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడికి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు. ఉన్నాయంటే ఉన్నాయి. ఒకనిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా భుజం చిరిగి జారిపోతే, వాళ్ళమ్మ ఎత్తికుట్టింది. చెయ్యి బుట్టలాగా లేచిపోయింది. రేవుకో జత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్ట ఎక్కువ పడుతుంది. బట్ట ఎక్కువైతే డబ్బు ఎక్కువౌతుందని వాడికి తెలుసు. మరి రెండు జతలు కుట్టించమని బతిమాలుకున్నాడు. కాళ్ళావేళ్ళా పడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేకపోయింది.

నరసింహం చంకలో కృష్ణుడికి కొత్త పుస్తకం కనబడ్డాది.

"ఎం పుస్తకంరా అదీ?" అనడిగాడు.

"ఇంగ్లీషు పుస్తకం. నేనన్ని పుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీ పుస్తకమే కొనలేదు. జాగ్రఫీ పుస్తకాలింకా స్టోర్సువాళ్ళకి రాలేదు. చూడు పుస్తకం". అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒక విధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకంలోకి మొహంపెట్టి వాసన చూశాడు.

"కొత్తపుస్తకం వాసన బాగుంటుందికదరా?" అన్నాడు నరసింహం.

"కమ్మగా ఉంటుంది. నాకెంతో యిష్టం". అన్నాడు కృష్ణుడు.

" నీ కింగ్లీషులో ఫస్టుమార్కురాలేదు కదరా?"

"నాలుగు మార్కుల్లో పోయింది."

"ఎవరి కొచ్చిందిరా?"

"శకుంతల కొట్టేసింది."

"నిజమే! నేన్నమ్మలేదు. దాని కెన్నొచ్చాయి?"

"నా కరవై నాలుగు, దాని కరవై ఎనిమిది."

"అడపిల్లని మేష్టరు వేసేసుంటాడు."

"నీ మొహం! అది తెలివైంది."

"తస్సాచెక్క! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!"

కృష్ణుడు మార్కుల గొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్ళు గుడ్డలని చూసి అంతా దూరంగా ఉండేవాళ్ళే. వాడికి బడిపక్కని నిలబడడం, బడికెళుతున్న నరసింహాన్ని చూడడం చాలా కష్టంగా ఉంది. ఎంచేతంటే కృష్ణుడు బడికెళ్ళి చదువుకొనే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్ళ నాన్న ఈ యేడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

"ఎక్కడేనా చదువు మన్పించుతారండి? ఋణమో పణమో చేసి ముక్క చెప్పించకపోతే కుర్రడెందుకేనా పనికొస్తాడా? చదువుకునే ఈడులో బడి మానిపించి, ఇంట్లో కూచోబెడితే తరవాత గాడిదలని కాయడానికేనా పనికిరాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి". అని వాళ్ళమ్మ శతపోరి చెప్పుకొస్తున్నది.

"బళ్ళో వెయ్యగానే సంబరమా? వాడు చదివేది ఫోర్తుఫారమ్. జీతమెక్కువ. నెల నెలా ఎంత కట్టాలో తెలుసా? తూగ్గలనా? ప్రవేశ పెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది ఏభై రూపాయలు. దస్తాకాగితాలు రూపాయి, అర్ధణా పెనసలు అరణాలు! ఎక్కణ్ణుంచి తేవడం? మొహాన్ని వాడికి లేందే! వాడి ప్రారబ్ధం. మన ప్రారబ్ధం! వారంవారం ఎక్కడలేని డబ్బూ బియ్యానికి ముడుపు చెల్లించడానికే తల ప్రాణం తోక్కోస్తున్నాది. మాటలా?" అని వాళ్ళ నాన్న చెప్పుకొస్తున్నాడు.

తల్లి మాటే నెగ్గుతుందో, తండ్రిమాటే నెగ్గుతుందో ఇంక తేలలేదు. కృష్ణుడికి మాత్రం సందిగ్ధం లేదు. వాడు తలిదండ్రులని బాగా ఎరుగును. తల్లి ప్రతి విషయంలోనూ బడబడలాడడమేకాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూ ఉంటుంది. అంచేత చదువుకి స్వస్తి చెప్పడమే ఖాయమని నిర్ధారణ చేసుకుని నామర్దాతో కృష్ణుడు కుళ్ళిపోతున్నాడు.

కృష్ణుడికి కొత్త ఇంగ్లీషు పుస్తకం పేజీలు తిరగేసిన కొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్ళ మీద ఈర్ష్య, తనకి చదువు లేకుండా పోయిందన్న దుఃఖము రెండూ రెండు లేడిక పాములై అతని బుర్రని కరకర లాడిస్తున్నాయి.

"కృష్ణా, వేగం చేరరా! డివిజన్లు పెట్టేశారు. నేను 'జే' డివిజన్‌లో పడ్డాను. మన బేచివాళ్ళంతా 'జే' డివిజన్‌లోనే పడ్డారు". అన్నాడు. నరసింహం.

"అమ్మ బాబో! 'జే' డివిజనుదాకా పిల్లలున్నారా!" అని అశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

"'జే'తో ఐపోలేదు. 'కే' డివిజను కూడా ఉన్నాది."

ఏ,బి,సి,డి,అని లెక్కబెట్టి "పదకొండు డివిజన్లే!" అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందలమంది విద్యార్థులున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకాన్నిచ్చేసి "నేను చుట్టలకెళ్ళాలి పోతా." నన్నాడు.

"ఈ బొమ్మ చూశావట్రా?" అని నరసింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్నచేలు కోస్తున్నారు. జొన్న రేకులని కూడదీసి కట్టుకొన్న పిట్టగూడు గుడ్లతోనే జారిపోతున్నది. చేలమీద రెండు పిట్టలు ముక్కులు విప్పి ఎగురుతున్నాయి. కోతల వాళ్ళు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అదీ త్రివర్ణ చిత్రం!

హైస్కూలు మొదటిబెల్లు ఖంగుఖంగు మంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్డు, వరండాలు, గదులు విద్యార్థులతో, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో కలకల్లాడుతున్నాయి.

పుస్తకాలు పట్టుకుని సరస్వతీదేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్నపిల్ల పదకొండేళ్ళది. సూది ముక్కు, సూది గెడ్డాం, ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంతుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్ళు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

"కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!" అని వొస్తూనే ఉడికించింది.

"ఒక్క ఇంగ్లీషులోనే కదా! నాకు మూడింట్లో ఫస్టుమార్కులొచ్చాయి, లెఖ్ఖల్లో నూటికి నూరు!" అన్నాడు కృష్ణుడు.

"ఇంగ్లీషు ముఖ్యమైందండీ!" అన్నాది శకుంతల.

"లెఖ్ఖలంతకన్నానండి. ఆ మాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టుమార్కెవరిదండి?"

"ఇంగ్లీషే ముఖ్యమండి. ఎవరి నడుగుతవో అడుగు!"

"తెనుగేనండి బియ్యేవాళ్ళక్కూడా ఇంగ్లీషులో మానేసి లెక్కలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి!"

"నువ్వు మహా పేపరు చదివి ఏడిశావు!"

"నే నాంధ్రపత్రిక రోజూ చదువుతాను. మాయింటి దగ్గర వాళ్ళకొస్తుంది."

రెండోబెల్లు ఖంగుఖంగుమని ప్రారంభమైంది.

నరసింహానికి శకుంతల మొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూ సంధ్యారాని దద్దమ్మ. వాళ్ళతో పాటు సంభాషించడానికి తాహతు లేక తల వాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హనవా పంట్లాము ధగధగలాడుతున్నా కృష్ణుడి కుళ్ళు నిక్కరు కనబడుతున్నా వాడికి తక్కువ తనం పట్టుకుంది. రెండో బెల్లు కాగానే చల్లగా బడిలోకి జారిపోయాడు.

"బెల్లయింది బళ్ళోకి రా!" అన్నాది శకుంతల.

"నేను సోమవారం నుంచి వస్తాను." అన్నడు.

"ఫోర్తుఫారమ్‌లో నీపని చెపతాను. ఒక్క ఫస్టుమార్కు రానివ్వను."

"ఇహనన్నీ ఫస్టుమార్కులూ నీవేలే!"

"ఏం?"

"ఏమీలేదు."

"నువ్వు మా ఇంతికి రావడం మానేశావేంరా? మా అమ్మా, నాన్నా 'కృష్ణుడు రాలేదేమా' అని రోజు

అంటారు."

"ఏమీలేదు."

"నేను బళ్ళోకి పోవాలి బాబు!"అని పరిగెట్టింది.

"శకుంతలా?" అని పిలిచాడు.

"ఏం?" అని అగింది

ఎందుకు పిలిచాడు? ఆమెతో నిజం చెప్పేసి దుఃఖోపశమనం చేసుకుందుకా? ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

"ఏమీలేదు." అన్నాడు.

శకుంతల వెళ్ళిపోయింది. ఇద్దరూ ఒక్క ఈడువాళ్ళు. క్లాసుకి వాళ్ళిద్దరే అందరికన్నా తెలివైనవాళ్ళు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకుంటూ స్నేహంగా వుండేవాళ్ళు. పంతంతో చదివేవాళ్ళు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతంగా ఉండేది. శకుంతల దస్తూరి కృష్ణుడికి జ్ఞాపకమొచ్చింది. ఆమె దస్తూరీ మంచిదికాదు. కొక్కిరిబిక్కిరిగా రాస్తుంది. అతనిది ముత్యాలకోవ.

శకుంతల బడిలోకి పెరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తూ నిలబడిపోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగిపోయింది. వరండాలన్నీ ఖాళీ అయిపోయాయి. మేస్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కులు మీదవాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడి దగ్గర నుంచి కృష్ణుడు కదలలేకపోయాడు. తన చదువుపోయింది కదా అని కుమిలిపోతున్నాడు. స్కూలు వరండలో కెళ్ళాడు.

"నే నిక్కణ్ణుంచి కదలను". అనుకొని స్తంభానికి జేరబడ్డాడు.

"నే నింటికి వెళ్ళను" అని నిశ్చయించుకున్నాడు.

నాలుగోక్లాసు దగ్గర నుంచి బడిలో తను చదివిన ఐదేళ్ళ సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికి వొచ్చేయి.

ఐదవక్లాసు చదువుతుండగా ఒక పిల్లడు కృష్ణుడు మీద మేస్టరుతో చాడీలు చెప్పేడు. మేస్టరు నమ్మక అబద్ధాలు చెప్పేడని వాణ్ణే చితకతన్నేడు.

మూడవఫారంలో తెలుగు మాస్టరు "గాంధారపతి" అంటే అర్థం చెప్పమన్నాడు. అంతా నేలచూసి, ఇంటికప్పుచూసి, ధృతరాష్ట్రుడనిచెప్పేరు. తానొక్కడే "గాంధార దేశపు రాజు" అని చెప్పేడు.

రెండవఫారం చదువుతుండగా దసరా తరువాత ఒక కుర్రవాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరును రోజు పిలిచి మేస్టరు అబ్సెంటు వేస్తూ ఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశాడని తెలిసింది. ఆవేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి మేస్టరు "డిస్కంటిన్యూడ్" అని రాసి ఆ ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పాడు. ఆనాటి నుండి కృష్ణుడు "డిస్కంటిన్యూ" అన్న మాటకి అర్థం మరచిపోలేదు. ఆ పదం జ్ఞాపకం రాగానే అతనికి దుఃఖం పొర్లుకుంటూ వొచ్చింది.

"నే నింటికే వెళ్ళను" అని పునఃనిశ్చయించుకొన్నాడు.

"నేను భోజనానికే వెళ్ళను". అనుకొన్నాడు.

అతని మొహం గాలికొట్టిన కొత్త పుట్‌బాలులాగ దుఃఖంతో పొంగి కందగడ్డ అయిపోయింది. ముక్కు నీటితో బరువెక్కి దిబ్బదేసి పోయింది. ముక్కు ఎగబీల్చుకుంటూ పొంగుకొస్తున్న దుఃఖానికి అనకట్టలు కట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడి పోయాడు.

మొదటి పీరిడైపోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ళ నాన్న బజారుకు బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

"ఒరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగిమారేవేం?" అన్నాడు.

"చూడు!" అన్నాడు కృష్ణుడు

"ఏమిట్రా చూడ్డం?" అన్నడు తండ్రి.

"పాపం. కనబడదు!"

"ఏమిటిరా నీ శ్రాద్ధం?"

"నాశ్రాద్ధమే!"

"ఏమిటిరా!?"

"వాళ్ళంతా బడికెళ్ళారు!"

అప్పుడు తండ్రికి కొడుకు మొహంలో విచార రేఖలన్నీ కనబడ్డాయి.

"వెర్రి నాగమ్మ అదిరా!" అన్నాడు. కృష్ణుడికి అనకట్టలు తెగ్గొట్టుకొని దుఃఖం కొట్టుకొచ్చింది. వెక్కివెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకు బాధంతా తండ్రికి బోధపడ్డది. కొడుకు బాధంతా తండ్రి పడ్డాడు.

"చదువు మానిపించానని అంత బాధపడుతున్నావా? బడి వరండాలు పట్టుకుని దేవుళ్ళాడుతున్నావా నాయనా? పద ఇంటికి". అన్నాడు.

"నే న్రాను!" అని భూమి బద్ధలైపోయినంత గట్టిగా అరిచేదు.

"ఏం చేస్తావురా?"

"గోడ కేసి బుర్ర బద్ధలుకొట్టుకుంటాను!" అని ఇంకా గట్టిగా అరిచేదు అంతపనీ చేస్తాడేమోనని వెళ్ళి తండ్రి కౌగలించుకొన్నాడు.

"పద నాయన ఇంటికి!" అన్నాడు.

"బడి నాది!" అని గట్టిగా కేకేశాడు.

"నీదేనురా బాబు!"

"బడిలోకి తీసుకెళ్ళు మరి".

"తల తాకట్టుపెట్టుకునేనా బళ్ళో వేస్తాను. ఇంటికి పద."

"ఇప్పుడే వెయ్యి!"

"డబ్బు చూసి వేస్తాను."

"ఇంటికి వెళ్ళి లేదంటావు."

"అన్ను రా!"

"ఐతే పుస్తకాలు ముందు కొను!"

"వెర్రి నాయనా! వాటికి మాత్రం డబ్బొద్దూ!"

"ఒక్క పుస్తకం కొను"

"ఏ పుస్తకం కొన్నమన్నావు?"

"ఇంగ్లీషు పుస్తకం కొను."

"కొందాం, పద. ఏడవకునాయనా, నే చచ్చిపోయాను ఏడవకు!" అన్నాడు తండ్రి.

తండ్రి చేయిని చంకలో పెట్టుకుని గిలగిల కొట్టుకొని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవతీశాడు.

తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. చుట్టలు మానేద్దా మనుకొన్నాడు. ఎంత మానుదామనుకొన్నా మానలేక పోతున్నాడు. చుట్టలు మానేస్తే జీతానికి సరిపోతుంది! ఇంకో విధంగా పాలు పోలేదు.

"ఇందాకా చుట్టలకిచ్చిన డబ్బులున్నాయా పారేశావా? అనడిగేడు కొడుకుని.

"ప.....ప్పు... ప్పారీలేదు. జేబులో ఉన్నాయి. ఎందుకు పారేస్తాను నాన్నా?" అన్నాడు కృష్ణుడు.




# మా నాన్న నాకేమిచ్చారు?

## అవసరాల రామకృష్ణారావు

( యువ మాసపత్రిక , జనవరి 1962 సంచికనుంచి పునర్ముద్రితం)




ఫిఫ్తుఫారం మొదలు బియ్యేస్సీదాకా ఒకే చోట కలసి చదువుకొని బ్రతుకు తెరువుకోసం ఎవరి మటుకు వాళ్లు విడిపోయినా రవణమూర్తీ, రామ్మూర్తుల మనస్సులు మాత్రం ఎప్పుడూ కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూనే ఉంటాయి. అందుకనే ఒక మూర్తి ఈ లోకం నుంచి తప్పుకున్నా రెండవ మూర్తి లోకంలో మాత్రం ఆ మూర్తి స్ఫూర్తి ఎప్పటికీ కళకళలాడుతూనే ఉంటుంది. అలాంటి ఒక సందర్భంలో రవణమూర్తి ఓ సారి స్నేహితుడి కొడుకుని చూడ్డానికి వచ్చాడు.

'ఇదిగో అలా నువ్వుకంత తడి పెడితే నేను రాకనే పోదును. మామూలు రకం పరామర్శలకయితే రోజులు దాటకుండానే వచ్చి ఉందును. మూడు నెలలు దాటేక రావడమెందుకూ?'

రవణమూర్తి గోపాలం చెయ్యి మొహం నించి బలవంతంగా అడ్డు తీసేశాడు. గోపాలం రెండు కళ్లల్లోంచీ కన్నీళ్లు కాలవలు గట్టేయి 'ఓహో అంటే ఓహో అనుకునే స్నేహితులు వందల కొద్దీ ఉన్నా మనస్సు విప్పి చెప్పుకునే వారు ఏ ఒకరో యిద్దరో ఉంటారు. నెల్లాళ్లకి ఒక మారయినా మీ గురించి వింటేనేగాని నాన్నగారికి తోచేది గాదు బాబాయిగారు! మిమ్మల్ని చూస్తుంటే నాన్నగారు జ్ఞాపకం వచ్చి నా మనసు మరీ కెలికేసినట్లు అవుతోంది.'

'అబ్బే, అదేవిఁటి బాబూ బొత్తిగా చిన్న పిల్లాడిలా?'

'లేదు నేను చిన్న పిల్లాడిని అనుకునే వారింకెవరూ లేరు. చీరలూ నగలూ యిచ్చే మొగుణ్ణి మా అవిడికి నేనున్నాను. బిచకత్తులూ, పిప్పరమెంతు బిల్లలూ తెచ్చే నాన్నని మా పిల్లలికి నేనున్నాను. నాకెవరున్నారు? మనమల్ని ఎత్తగల వయస్సున్న కొడుకయినా సరిగ్గా తింటాడో లేదో అని భోజనం దగ్గర విసనకర్రతో ప్రత్యక్షమయే తల్లి నాకు ఏనాడో కరువయింది. కొండంత నీడ, అకాశమంత అండ, మా నాన్న కూడా నాకు లేకుండాపోయాడు... ఇంక నా కెవరున్నారు?' గోపాలం వెక్కి వెక్కి ఏడ్వనారంభించాడు.

విడదీసిన కొద్దీ దెబ్బలాట ఎక్కువైనట్టు– తవ్విన కొద్దీ గొయ్యి పెద్దదైనట్టు అనునయించిన కొద్దీ విచారం ఎక్కువౌతుంది అందుకనే అనుభవం గల రమణమూర్తి గదిలోకి వెళ్లి పుస్తకాలన్నీ వెతికి 'హేమ్లెట్' పట్టుకొచ్చాడు. పుస్తకం అటూయిటూ తిప్పి ఒక పేజీ దగ్గర అగేడు 'ఇది నువ్వు చదివావుగా బాబు! తండ్రిని కోల్పోయి సర్వస్వాన్నే కోల్పోయినట్టు బాధపడే 'హేమ్లెట్' కి చెప్పినట్టు చెబుతూ షేక్స్పియరు మానవాళికి అందించిన మహత్తర వాక్యాలు చూడు.'

గోపాలం ఆశ్చర్యంగా ఆ వాక్యాలు చదివేడు. సద్గ్రంథాలకీ జీవితాలకీ అంత సామీప్యం ఉంటుందని అతనెప్పుడూ అనుకోలేదు.

ఆ వాక్యాల సారాంశం యిది: ' ఇందులో కొత్తదనం గాని విచారించ వలసింది గాని ఏముంది? నీ తండ్రి తన తండ్రినీ ఆయన వాళ్ల తండ్రినీ... అలా.... ఎందరో వాళ్ల తండ్రుల్ని కోల్పోయారు... నువ్వీనాడు నీ తండ్రిని కోల్పోవడం అతి సహజం. ఇందులో వింతేముంది? చింతే మున్నది? ప్రకృతి సూత్రం అంతే నన్నది!'

గోపాలం పుస్తకాన్ని ఆ పేజీ దగ్గిర విరచి అలాగే టేబులు మీద పెట్టేడు. అరిచేతుల మధ్య మొహం పెట్టి కళ్లు మూసుకున్నాడు.

★ ★ ★

గోపాలం యింకా యింటికి రాలేదు. రవణమూర్తి ఒక్కడూ గదిలో అటూ ఇటూ పచారు చేస్తున్నాడు. అతను ఆ యింట్లో చూసిన రామ్మూర్తి తాలూకు వస్తువులు పొడుంకాయ, టైరుజోడు, రోల్డ్ గోల్డ్ ఫ్రేం కళ్లజోడూ, చిన్న వివేకానందుడి ఫోటో– యిలాంటి వాటికన్న.... అతని జ్ఞాపకాలూ ముఖ్యంగా నిర్లప్తతా, సంతృప్తీ, హాస్యం, మేళవించిన అతని చమత్కార సంభాషణలూ రవణమూర్తిని కదిలించాయి.

'వెధవ పిల్లి పాలన్నీ ఎలా పారబోసిందో.'

'బాగుంది, గిన్నెలోనే ఉండి వేడిగా ఉంటే అదెలా తాగ గలదు మరీ? అన్ని పాలూ మనమే ఊన బడితే దాని కడుపు నిండేది ఎలా? అయినా నేడో రేపో యీనేట్టుంది కూడాను.'

'అదేవిఁటీ, దేవుడికి లేకుండా ఆ పువ్వులన్నీ ఊరూ వాడా పంచి పెట్టేస్తున్నారా, ఏం మనుషులమ్మా?'

'బాగుంది, మూడొంతుల మంది దేవుళ్లు పువ్వుల్లో పుట్టిన వాళ్లే.... వాళ్లకి మళ్లీ అవే యిస్తే బాగుంటుందా మరీ?'

'రామం, మొన్న బస్సులో వస్తుంటే నీ పర్సు పోయిందిట పాపం?'

'బాగుంది, అందులో ఉన్నదెంత గనుక? పాపం ఓ పూట ఓ కుటుంబానికయినా కడుపు నిండెనో లేదో.... అయినా నాలాంటి అజాగర్త పరుల్నందర్ని ముందు జైల్లో పెడితే దేశం దొంగతనాలు తగ్గునేమో!'

'ఏవండీ చూశారా, నల్లెలా అంట బోడిచేసిందో.... ఎంత దద్దు రెల్లిపోయిందో!'

'బాగుంది జడ్జిగారి కూతుర్ని నల్లి పిల్లకుట్టడమే? అంత బొత్తిగా భయం భక్తి లేకుండా పోయిందా? దొంగ రాస్కెల్, ఈ మారు కనబడనీ కనుక్కుందాం!'

'పాపం, కోడలు యింటికి వచ్చే వరకైనా మీ ఆవిడ బతకలేక పోయింది...'

'బాగుంది.... కోడలు యింటికి వచ్చేక సుఖంగా బతికిన అత్తగారు ఎవరు గనుక? ఒక వేళ యీవిడ సుఖంగా బతికితే ఆ కోడలు

జీవించేది ఎన్నాళ్లు గనుక?'

'ఇంటింటా తిరుగుతూ యిలా కబుర్లు చెబుతూ ఎన్నాళ్లని తిరగ్గలవు తాతయ్యా?'

'బాగుంది......పిలుపు వచ్చే వరకూ ఆగ కేం చేస్తాం? ఇంకా మా అమ్మకి దయ కలిగినట్టు లేదే మరి!'

★ ★ ★

బాగుంది... జీవితం యింత బాగున్న వాళ్ళకి మరణం కూడా మరింత బాగుండకేం చేస్తుంది? కలిగి ఉన్నా కళ్లు కలగని మనిషికి, మంచం మీద ఉన్నా మంచి ముత్యంలా గడిపిన మనిషికి, పంకంలో ఉన్నా పద్మంలా వికసించిన మనిషికి ఆఖరి కాలం కూడా అందంగా ఉండకేంజేస్తుంది? సూర్యాస్తమయం కూడా సుందరంగా ఉండడంలో వింత ఏముంది? అన్నీ సద్దుకుని సరిదిద్దుకుని రైలు ప్రయాణానికి వెళ్ళినంత ఉత్సాహంగా వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

రవణమూర్తి కళ్ల నీళ్లు తుడుచుకున్నాడు. క్రిందటేడు తను రామ్మూర్తిని చూడ్డానికి యీ ప్రాంతాలకి వచ్చినపుడు ఒకమారు ఏం జరిగిందనీ......

తియ్యని మాటలేకాక తియ్యని మాత్రలు కూడా యివ్వడం వాడికి అలవాటు. ఇంట్లో వాళ్ళకీ, తెలిసిన వీధిలో వాళ్ళకీ, ఎరిగిన ఊళ్ళో వాళ్లకీ సాయం చెయ్యడంలో పెద్ద ఆశ్చర్య మేమీఁలేదు. ఆ రోజు తనూ రామ్మూర్తీ ఇలా గుమ్మం దిగి వీధిలో అడుగు పేట్టేరో లేదో.....'ఏం బాబు బత్తాయి పళ్లు మంచి వున్నాయి– ఏవైఁనా పడతాయా యేటి' అంటూ పళ్ళమ్మి ఎదురొచ్చింది. దాని నెత్తిన ఉన్న పళ్ల గంపకన్నా అది చంకనెత్తిన గయ్యాళి గంపే రామ్మూర్తిని ఎక్కువగా ఆకర్షించింది.

'ఈ గుంటని తీసుకెడితే యింక నువ్వు పళ్ళు అమ్ముకున్నట్టే... నీ కేక కన్న దాని ఏడుపే బాగా వినిపిస్తోందేఁవేఁ?'

'ఎందుకేటి బాబూ, నాల్రోల మట్టి బొట్టి మూసిన కన్నెరగుదు. ముండనన్నోగ్గదు, నోరు కట్టదూ... నా నేటి సెయ్యను సొప్పండి?'

'చెబుతా... ముందా గేటు తలుపు వేసి లోపలికిరా....'

రవణమూర్తి అడ్డుబడ్డాడు.

'ఒరే మనం రైలుకి వెళ్దామనుకున్నాంగా... మధ్యని ఈ పేటా పని ఏవిఁటీ?' రామ్మూర్తి మాట వినిపించుకుంటేగా.... లోపలికి వెళ్ళి పోట్లాలు కట్టి తీసుకొచ్చాడు.

'చూడూ ఈ మాత్రలు దీన్చేత మింగించు. ఈ ఎఱ్ఱ పొట్లం చీకటి పడ్డాకా, ఓ రాత్రి వేళ ఈ తెల్లపొట్లమూ.... ఈ విధంగా మింగించు'

'గొప్పోళ్ళు.... గొప్పమనసు గలోళ్లు, కొత్త కొత్త కోడళ్లు కలిగి, గొప్ప గొప్ప లోగిళ్లు కలిగి....'

'ఆఁ అలా గలాగేలే. ఈ రెండ్రోజులూ తిరుగుళ్లు ఆపు..... ఏణ్ణర్థం దాటని వెర్రిముండని ఎండలో తెగతిప్పి బరి కిందని బజాయించకు, ఈ బియ్యమూ ఈ పావలా దబ్బులూ పట్టిగెళ్లి రేపూ ఎల్లుండీ కాలక్షేపం చెయ్యి... రెండ్రోజుల పాటు ఇంటి పట్టున ఉంటేనే గాని మళ్ళీ నీ బుల్లి నీది కాదు తెలిసిందా?'

'మా అమ్మే, నా బాబే... ఎంత సల్లని యేల, ఎంత సల్లని తల్లి నన్నీ బూమాలచ్చి కిచ్చిందో.... బాబ్బాబు సెమించాల.... ఎంచుబడి కాయలన్నీ అమ్మేసుకున్నాను... దిక్కుమాలిన ముండని నా కాడేం లేదు. ఈ కాయలుంచు బాబో.....'

'అలాగే పిల్లదానికి తొనలు తీసి తినిపించు... నేనే తీసుకుందును గాని యింట్లో చెట్టే ఉందిలే.... అడ్డులే.... అవతల నాకు పనుంది.... పదరా రవణా.... దీనొక్కర్తితో కూచుంటే అయ్యిపోతుందా యేవిఁటి?'

అవును.... విశ్వమానవ సౌహార్థమూ, విశాల దృక్పథమూ ఉన్నవాళ్ళకి ఒక్కరితో కూచుంటే అయిపోతుందా? ఒక్క 'పని' తో సరిపోతుందా అందుకే ఆ వయస్సు అయీ అవగానే పదవీ విరమణ చేస్తే అందరికీ అశ్చర్యం కలిగించింది.

'అదేవిఁటీ, మీరు విశ్రమిస్తామంటే మాత్రం మేం ఒప్పుకుంటామా ఏవిఁటి? మీలాంటి 'సిన్సియర్ వర్కరూ', 'కేపబుల్ హేండూ' మళ్ళీ మాకు దొరకద్దూ? ఏదో రూలు కోసం రిటైరు అవడాని కింత వయసని ఏర్పరిచారు గాని రెండుసార్లు రిటైరు అవడానికి సరిపోయిన వయసుతో ఎంతమంది ఉద్యోగాలు చేయడం లేదూ!? అసలు ఓ చెంప నెరవడమే ఈ దేశంలో నాయకత్వానికి కావలసిన క్వాలిఫికేషను గదా' అని చెప్పి చూశాడు పై యజమాని.

'అందుకని అందుకని చచ్చే దాక డబ్బు సంపాదించడమే పరమావధిగా పెట్టుకోమంటారా? భవిష్యత్తుమీద గంపెడాశతో ఉద్యోగం కోసం భర్తని పంపించి వీధిలో అతని కోసం ఎదురుచూసే పచ్చని పడుచు కడుపులో చిచ్చు పెట్టమంటారా? వద్దు బాబూ వద్దు డబ్బు యిచ్చే సుఖంకన్న అది అరాయించుకోడంలో కలిగే అజీర్తే ఎక్కువ'

ఆఫీసర్లనీ, అడిటర్లనీ మేపడాలు పన్నుల ఎగవేతలూ, ఎకౌంటు సర్దుబాట్లూ వీటితో కొట్టుకుపోతూ కంటి మీద కునుకు ఎరగని పాపిష్టి పనులతో రామ్మూర్తి లాంటి వారికెలా ఉంటుంది యింకా ముడి? పువ్వులతో మేలుకొని, పిల్లలతో ఆడుకుని, పక్షులతో పడుకునే అయనకి జీవితంలో అందని దంటూ ఏముంటుంది? పొద్దుటే ఆయన లేవడం చూసుకుని సూర్యుడు ఉదయించే వాడేమో! అయన పనిమనిషికి, పాలవాడికి జీతాలు యిచ్చేరోజున అది ఒకటో తారీకని అందరూ గుర్తు పెట్టుకోనే వారేమో... ఆయన ఏదైనా జవాబు రాస్తుంటే అంతకు ముందు అరగంటై అయనకి ఆ ఎడ్రసు నుంచి ఉత్తరం వచ్చి ఉండాలని తెలుసుకునే వారేమో....

మొగాళ్ళయితే జబ్బలనూ ఆడాళ్ళయితే చీరలనూ ప్రతిక్షణం చూసుకొని మురిసిపోతూ ఉంటారు. అసలు అద్దాల ముందు అతుక్కు పోవడానికే ఎక్కడలేని టైమూ చాలదు... ఇంకా ఏమైనా టైం మిగులితే తనకన్న అన్ని విధాల తక్కువ వాళ్ళని చూసి తమ గొప్పలను చెప్పుకుంటూ ఉంటారు. 'ఏవంటావు నేను చెప్పింది సరైన దవునా కాదా?' అని అడుగుతూ ఉంటారు. 'మీరు సెలవియ్యడం మరోలా జరగడమూనా?' అనిపించుకుంటూ ఉంటారు. వారానికి మూడుసార్లు తలంటుకొనే అత్తాగారి కయినా, 'అయ్యో అంత శ్రద్ధ లేకపోతే ఎలాగమ్మా మీకూ? నెలయిందిగదా తలంటుకుని... పదండి యీపాటికి యింత నూనిచుక్క పెడతాను' అనే కోడలు కావాలి. రెండు వారాలకు గాని ఒక జత బట్ట మార్చని ఆఫీసరుకయినా 'అదేవిఁటో, మీ దగ్గరకి వస్తే యిదీ అని వర్ణించడానికి వీల్లేని పరిమళమూ, నిర్మలత్వమూ వెల్లివిరుస్తాయి సుమండీ చెప్పకేం' అనే అసిస్టెంటు కావాలి. ఊళ్ళో అమ్మిన గైడ్సూ ఎవరో చెప్పిన నోట్సూ దగ్గిర పెట్టుకోందే పాఠం చెప్పలేని టీచరుకయినా 'అరటిపండు ఒలిచి చేతులో పెట్టడం అనడం వినడమే గాని అనుభవించలేదు. ఇదే కాబోలు' అనే శిష్యుడు కావాలి.

ఎంత సేపు తన వర్ణనా, తన ఓర్పూ, ఇంతకు మించి అలోచించడానికి టైమేది? ఇంకా ఏమైనా మిగిల్తే సంసార తాపత్రయంలో మునిగి తేలడానికి ఒక్కొక్కరికి రెండేసి జన్మలు చాలవు. అవతల వాళ్ల గురించి తన ఆలోచన ఎప్పుడూ ఉండదు, ఒక వేళ ఉంటే ఆ పద్ధతే వేరు.

'ఏదో పనున్నట్టు మా గోడెక్కి ఊఁ అరవకపోతే, ఒసే కాకీ, నీ పాండిత్యం ఎదురింటి రవణమ్మగారి దగ్గిర వెలగబెట్టకూడదుటే' అనికోనివాళ్లూ.

' పక్కింటి మోహనరావుగారి యింట్లోనే ఒక కట్టకి కట్ట ఉత్తరాలు దిగేయ్యకపోతే నీ కొచ్చిన యేళ్లకి, పక్షపాతపు బుద్ధి కాకపోతే మా యింట్లో కూడా ఒక శుభలేఖ విసిరితే నీ నిక్షేపం తరిగి పోతుందా ఏమిటయ్యా పోస్టుమేను?' అనుకొని వాళ్లూ అరుదు– అందుకే ఆశ్రయింపులకే జీవితం అంకితం చేసి దేశంలో, చరిత్రలో పెద్ద పెద్ద స్థానాలు కల్పించుకునే వాళ్ల రొదలో సరళ జీవనులైన సామాన్యుల కథ వినిపించడమూ వికసించడమూ కూడా అరుదే.

★ ★ ★

'ఏవిఁటి యీ ఆలోచనలు తాడూ బొంగరం లేకుండా?' అనుకున్నాడు రవణమూర్తి. వెనక్కి తిరిగిచూశాడు. ఎంత సేపయిందో గాని

గోపాలం వచ్చి కూచున్నాడు.

'ఏవంయినా అదృష్టవంతుడువయ్యా గోపాలం నువ్వు.... మీ నాన్న దేవుడు గాని మనిషి కాదు బాబూ.... మీ నాన్న చివరికాలమంతా.... అందరి కంటే ఎక్కువగా నీ దగ్గరే గడిపేడు.... ఇంతటి సత్సంప్రదాయం ఊరికే పోదు బాబూ'

'నేనూ అలాగే అనుకున్నాను.... కాని అలశ్యంగా పోల్చుకున్నాను.........నేను అన్ని విధాలా అన్యాయమై పోయాను'

రవణమూర్తి ఆశ్చర్యంగా గోపాలం వైపు చూశాడు.

'అవును...మీ ముందు నాకు దాపరికం లేదు. మనసు విప్పి చెప్పుకోడానికి కూడా మీకంటే నాకింకెవరూ లేరు. ఉన్న ఊరినీ, కన్న వారినీ ఒదిలిపెట్ట లేక స్కూలు ఫైనలు ప్యాసవగానే ట్రెయినింగు అయిపోయి ఈ ఊళ్లోనే హైస్కూల్లో టీచరుగా స్థిరపడి పోయానని మీకు తెలుసు. నా సర్వీసంత వయస్సు లేని మా పెద్దకుర్రాడు ఎల్.సి.యీ ప్యాసై నూటయాభై తెస్తున్నాడు గాని నా జీతం నూరు దాటలేదు. అడిగిన వాడికి లేదనని మా నాన్న వచ్చే జీతంలో ఏదో పెద్ద ఆస్తి మిగులుస్తాడని నా కెప్పుడూ ఆశ లేదు. ఇంత డబ్బునిలవ చేద్దామన్న ఆలోచన మీద ఆయనకి ధ్యాస ఉన్నట్టు నా కెప్పుడూ తోచలేదు. ఆయన స్నేహితు డొకడు చేయించిన యిరవైవేల లైఫ్ పోలసీ మీద మాత్రం అందరితో పాటు నా కళ్లూ ఉండేవి. అది ఆయన మొదట్లో ఎవరికీ 'ఎసైన్' చెయ్యలేదు. ఇంటి పట్టున ఉన్న వాణ్ణి గనక ఉన్న వాళ్లలో పిల్లలు ఎక్కువా, సంపాదన తక్కువా అన్న దాంట్లో ఫస్టు మార్కు నాది గనక కనీసం అందులో ఓ పదవేలయినా నాకు ముట్టచెబుతారని ఆశించాను..... కాని.... జరిగిందేవింటో మీకు తెలుసుగా బాబాయ్‌గారు?'

'తెలుసు.... వాడు దాన్ని సంస్కృత పాఠశాలకు రాసిచ్చాడటగా'

'మీకిది సబబుగానే తోచిందా?...'

'.....సరేలే ...... చెప్పు చెప్పు'

'ఇంకేం చెప్పేది? చెట్టంత నాన్నతో పాటు కొండంత ఆశ కూడా నేల కూలి పోయింది. మానాన్న నాకేమిచ్చారో మీకు తెలుసునా? చెప్పు దెబ్బలు!'

'చెప్పు దెబ్బలా?'

'అవును నాలాంటి నిర్భాగ్యుడికి అంతకన్న లభించేవి ఏమున్నాయి? అప్పుడందరూ యింటికి వచ్చినప్పుడు ఎంతో దగ్గిర వాళ్లు కూడా ఎంత లేసి మాటలాడేరో మీరు ఊహించలేరు. ఆ రోజున ఎంచేతో నాకు జ్ఞాపకం లేదు, అదే పిల్లలూ యింట్లో లేరు.... ఆవాళ కొంచెం తల నొప్పిగా ఉంది. మామూలు టైం కన్న ముందుగానే నేను యింటి కొచ్చేశాను. నేను రావడం వాళ్ళు చూసినట్టు లేదు. ఎవరో అంటున్నారు.

'అలాంటి మహాత్ముడికి అన్నం పెట్టే అదృష్టం యింత మంది బలగంలో ఈ కోడలికే దక్కింది. ఇంతకీ ప్రాప్తం!'

'ఆఁ, ముప్పై రూ పాయలు పారేస్తే వంట మనిషి దొరక్కపోయిందా ఏవింటి గాని... అయినా నాకు తెలీక అడుగుతానూ, నెలకి మూడొందలు పెన్షను తెచ్చి యిల్లు నింపే మావంగారు ఎవరికి చేదే?' అని జవాబు చెప్పింది మా పెద్దొదినగారు. 'అయినా వెంటనే కాచుకుని పెద్ద డాక్టరు చేత వైద్యం చేయిస్తే నాన్న దక్కునమ్మా! అయన దగ్గర తినడమంటే అందరూ సిద్ధంగాని, పెట్టడమంటే అందరికీ కష్టమే కదుటమ్మా' అని రాగాలు పెట్టింది మా చెల్లెలు.

'ఎంత దానం చేసే మనిషయినా ఇంట గెలవక రచ్చ గెలిచేంత అవివేకి కాదు మా నాన్న... దగ్గిరుంది ఏళ్ల తరబడి తిన్నది చాలక ఈ గోపాలంగాడు ఏం ప్రాణం విసిగించాడో, ఆయనకి ఒళ్లు మండి అలా రాసిపారేశారు. మొత్తమీద ఎవరికీ ఏం లేకుండా చేస్తేగాని వాడి కళ్లు చల్లబడ్డాయి కాదు' అన్నాడు మా చిన్న తమ్ముడు! మా దొడ్డమ్మ అందుకుంది, 'అది కాదు గాని నామాట కాస్త వినండి మీరందరూ ఆ మహాపట్నల్లో వందలకి వందలు తెచ్చుకుని మహా సుఖపడుతున్నారనే అక్కసుకొద్దీ అదే యింత పని చేయించి ఉంటుంది. ఉన్నన్నాళ్లూ ఆ

మహానుభావుడికి ఓ పూట పెట్టీ పెట్టకా ఆ జాణ పుట్టింటి కీ పాటికి ఎంత జేరేసుంటుందో! దానికి లెక్కా పద్దూ అంటూ ఉన్నాయా యేమిటి?'

'విన్నారా బాబాయిగారూ నాకు మిగిలిందేవిఁటో..... ఇందులో ఇంకోరు అసూయ పడ్డానికి కూడా ఉందా? మా నాన్న నాకేమిచ్చాడు?'

రమణమూర్తి చిరునవ్వుతో గోపాలం వైపు చూశాడు. అ కళ్లల్లో కాంతులు చూసి అతడు ఆశ్చర్య పోయాడు.

'ఇంతకన్న నీకు మీ నాన్న యింకే మివ్వాలి గోపాలం? ఎంతో పూర్వపుణ్యం చేసుకున్న వాళ్ళకి గాని యిలాంటి ఆస్తి అభించదు. ఎవరో ఎందుకు, నీ సంపద చూసి నేనే అసూయ పడుతున్నాను!'

'అదేవిఁటి? నాతో మీరు హాస్య మాడుతున్నారా?'

'లేదు..... నీ ముందున్న చీకటిని తొలగించడానికే ప్రయత్నం చేస్తున్నాను. గట్టునే చూస్తే గంగలో నీళ్ళైనా కలకబారినట్టే కనిపిస్తాయి. పైపైన కొలిచే నిర్ధారణ చెయ్యడం న్యాయమా గోపాలం? మీవాళ్ళంతా డబ్బుతోటే మనుషుల మంచి చెడ్డలు కొలిచే మర మనుషులయి పోయారు. అదే జీవనం అనుకున్న వాళ్లు అదే లేకపోతే అసలుస్వరూపం బయటపడి– బయటపడ్డ చేపల్లా బాధ పడి పోతారు.... అందుకనే వాళ్ళు అలా విమర్శించడం చాలా సహజంగా ఉంది. కాని డబ్బు సంపాదించినా దాని వల్ల చెడిపోని వాడు కుటుంబం మొత్తంమ్మీద మీ నాన్న ఒక్కడే... ఆయన నీడలో మీ అన్నదమ్ములందరి కన్న ఎక్కువకాలం నువ్వు గడిపేవు... నీ నుంచి మాత్రం యిలాంటి మాటలు నేను 'ఎక్స్పెక్టు' చేయ్యలేదు.'

'అదేవిఁటి.....'

'అడ్డురాకు..... నన్నలా చెప్పుకు పోనీ..... నిన్న పొద్దుటకదూ నేను మీ యింటికి వచ్చాను– వస్తూనే నే చూసిందేమిటో తెలుసా? నీ పిల్లలు అప్పటికే స్నానాలుకూడా చేసి చక్కగా తలలు దువ్వుకొని గడగడ చదువుకుంటున్నారు. మీ ఆవిడ కుంపటి దగ్గిర కూచుని ఎడంచేత్తో ముక్కలు వేయిస్తూ కుడి చేత్తో ఒళ్లో పెట్టుకుని మడిచిన పేపర్ని అటూ యిటూ త్రిప్పుతూ చదువుకుంటోంది. నువ్వు గదిలో కూచుని కాంపోజిషను పుస్తకాలో ఏవో దిద్దుకుంటున్నావు. నేను వాచీ చూశాను. ఆరయింది! అవును.... ఇందులో ఆశ్చర్యపోడానికేముంది..... ఇది మన రామ్మూర్తి యిల్లు మరీ, ఇంకోలా ఎలా ఉంటుంది? అనుకున్నాను....

గోపాలం, సాధారణంగా కాలేజీలు పదింటికి తెరుస్తారని నీకు తెలుసుగా.... అందరూ కాదుగాని చాలా మంది విద్యార్థుల దినచర్య చెబుతా విను.... ఏ తొమ్మిదిన్నరకో లేస్తారు.... వెంటనే శుభ్రమైన యిస్త్రీ జత ఒకటి తొడిగేస్తారు.... ఎడం చేత్తో పుస్తకాలూ కుడిచేత్తో పళ్లుదోము పుల్లా, పట్టుకుని కాలేజీకి వచ్చేస్తారు. ఏ కాలేజీ కయినా అతి దగ్గిరలో ఒక కాఫీ హోటలూ మంగలి షాపూ తప్పవు. కావలిస్తే చూడు. ఏ కొళాయిదగ్గిరో దంతధావనం అయిందనిపించి మంగలి షాపులో మేకప్ అవుతారు.... హోటల్లో 'లోడ్' వెసుకుని యివతల పడేసరికి ఫస్టుబెల్ ఎలాగా అవుతుంది.

ఇదెందుకు చెబుతున్నానంటే దినదిన పతనమై కృత్రిమమై పోతున్న సాంఘిక వ్యవస్థను గమనించిన నా కళ్ళకి మీ యిల్లు చల్లని పందిరిలా కనిపించింది బాబూ'

రవణమూర్తి ఒక్క నిమషం ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

'మధ్యాహ్నం ఓ మారు పడుకుని లేచే సరికల్లా మరో మనోహర దృశ్యం నా కంట పడింది. మీ అమ్మాయి పెద్దది కాబోలు, బిందెతో నీళ్ళు తీసుకోస్తోంది, వెనకల అబ్బాయి రాగి చెంబుతో నీళ్ళు తెస్తున్నాడు. నన్ను పులకింప చేసింది ఇవేవి కావు. వీళ్ళ వెనక మీ చంటిది ఎట్టిటి లక్క పిడత నిండా నీళ్ళు పోసి తలమీద పెట్టుకుని రెండు చేతులూ పైకెత్తి అతిపొందికగా, ఒక్కచుక్క నీళ్లుపడిపోకుండా తీసుకోస్తోంది.

'ఇదెక్కడ్నించెవ్ గొల్లభామా' అని నేను పలకరిస్తే ఆ ఆరిందా అంటుందీ....

'బాంది... ఎవరింట్లో నీల్లు వాల్లు తెచ్చుకోలూ?'

మీ పెద్దమ్మాయి చెప్పింది, ఆవాళ మీ యింట్లో దాసిది రాలేదుట. దాసీదంటే జ్ఞాపక మొచ్చింది. పరాధీనతలో పతాక సందుకున్న మా కుటుంబం మాటే చెప్పాలి. మా యింట్లో దాసీదీ, మొక్కలకు నీళ్లు పోసేదీ, బజారుకెళ్లేదీ– ఇన్నిటికీ యింతమంది నౌకర్లూ ఉన్నారు. నీతో చెప్పకేం మా యింట్లో ప్రతి ఒక్కరికీ, కనుక్కోడానికి ఒకరూ, పొగడ్డానికి ఒకరూ కనీసం యిద్దరేసి మనుషులు కావాలి... ఏ ఒక్క మనిషి లేకపోయినా అయిదు నిమిషాలు జరగదు. ఇంతమంది నౌకర్లలో ప్రతి రోజూ ఎవరో ఒకరు మానేయ్యకా మానరు. ఇక వేగుతున్న పేలాల్లా మా యింట్లో ప్రతి ఒకరూ ఎగిరెగిరి పడతారు. చూసి తీరవలసిందే.... బాబూ, డబ్బువల్ల మేం పొందుతున్న సుఖం యిదీ... నెలకి నూటయాభై సంపాదించిన నాడూ మేం అందులో ఇమడలేక పోయాం.... ఇప్పుడు పదిహేను వందలు తెస్తున్నా యిమడలేక చెప్పలేని బాధ పడిపోతున్నాం....

మీ నాన్న క్రమశిక్షణలో– సంతృప్తితో, స్వయం సహాయంతో సంతోషంగా బతకడం నేర్చుకున్న మీ కుటుంబానికి ఏం తక్కువయ్యా? ఇప్పుడు చెప్పు గోపాలం మీ నాన్న నీకేం యివ్వలేదుటయ్యా?...

చూడు గోపాలం..... మీరందరూ పుట్టక పూర్వం... సుమారు ఏభై ఏళ్ళ క్రిందట... వెన్నెల రాత్రిలో ఏటిఒడ్డున యిసకలో నేనూ రామ్మూర్తీ ఒకరినొకరు అలసి పోయేదాకా తరుముకొనే మధురస్మృతులు నాకు మరొక చోట జ్ఞాపకం రావు సుమీ... ఇంతటి చల్లని వాతవరణం యిది. క్రమబద్ధమైన మీ జీవితంలో నీ భార్య కూడా భాగస్వామి కాగలిగిందంటే నీ అదృష్టాన్ని అభినందిచకుండా ఉండలేక పోతున్నాను. నా మనసు కెప్పుడైనా కష్టం కలిగితే విశ్రాంతి కోసం మీ యింటికే వచ్చి తలుపు తడతాను. అవును మరి, రామ్మూర్తి యిల్లు యిది! నిష్కామమైన వాడి జీవితంలో శతాంశం యిక్కడ ప్రతి ఫలించినా యింతకన్న విలవైన అస్తి ఉంటుందా? గోపాలం, తలెత్తి నా కళ్లల్లోకి చూస్తూ చెప్పు మీ నాన్న నీ కేం యివ్వలేదా?'

గోపాలం భక్తి, కృతజ్ఞతలతో కన్నీళ్లతో నిండిన కళ్లతో ఆయన వైపు చూశాడు. అంతకంటే బాగా ఎత్తున ఉన్న తండ్రి ఫోటో వైపు చూశాడు. హైస్కూలు మేష్టరీ చేసినా అందరూ మనుషులే.... అది గుర్తించడం కన్న ఆనందాన్ని అందించేది ఏమున్నది?

●●●




# పలితకేశం

## తిలక్

( ఆనందవాణి , జనవరి 1, 1940 సంచికనుంచి పునర్ముద్రితం)

ప్రసాదరావు అద్దం ముందు నిలుచున్నాడు. అతనికి తనని తాను తీరికగా చూసుకోవాలనిపించింది. అందులో ఏదో తృప్తి ఉంది. అహం ఉంది. అతనికి బాధ్యతలు ఎక్కువ. ఆ ఊళ్ళో సమాజంలో అతను చెప్పుకోదగ్గ వ్యక్తి. ఒక మిల్లూ, పల్లెటూళ్ళో భూములూ, రెండు మూడు మేడలూ అతనికి ఉన్నాయి వీటిని జాగ్రత్తగా తెలివిగా నిర్వహించుకుంటూ మున్సిపల్ కౌన్సిలర్ గా, రోటరీక్లబ్బు సభ్యునిగా, సంగీత సభ కార్యదర్శిగా ఇంకా ఎన్నో సంఘాలలో సభ్యునిగా తన బాధ్యతల్ని నెరవేర్చాలి. దినదినాభివృద్ధి అవుతున్న కీర్తితో పాటు తన మీదగల బరువూ ఒత్తిడీ కూడా ఎక్కువ అవుతున్నాయి. వీటన్నింటిలోనూ ఒక మెలకువతో, ఒక తెలివితో తాను వ్యవహరించాలి అదీగాక అతని అభిప్రాయాల్ని దృక్పధాన్ని నలుగురూ అంగీకరించేటట్టు చేయాలి. అతను అందరిలాంటి వాడూ కాదు. అందరి విశ్వాసాలు అతనివి కావు. శాస్త్రీయమైన, సహేతుకమైన అతని దృక్పథం ముందు సమాజంలో చలామణీ అయ్యే నమ్మకాలూ ఆదర్శాలూ అర్ధంలేనివిగా కనిపిస్తాయి.


తిలక్

ప్రసాదరావు అద్దంముందు నిలుచున్నాడు అతనికి తనని తాను తీరికగా చూసుకోవాలనిపించింది. అందులో ఏదో తృప్తివుంది. అహం ఉంది అతనికి బాధ్యతలు ఎక్కువ. ఆ ఊళ్ళో సమాజంలో అతను చెప్పుకోదగ్గ

మంచి సౌష్టవంతో ఉన్న అతని శరీరం అద్దంలో ప్రతిబింబించి అతనికి తృప్తి కలిగించింది. అతని ఆరోగ్యం మంచిది. అతనికో విధమైన గర్వం కూడా. అలాగ అద్దంలో చూసుకుంటూన్నంతసేపూ అతనిలో ఆత్మవిశ్వాసం ప్రబలం కాజొచ్చింది తానెంతో అర్ధవంతంగా బతికాడు. ఇకముందుకూడా ఇలాగే ప్రయోజనాన్నీ పరమార్థాన్నీ కలిపి జీవితాన్ని సార్ధకం చేసుకోగలడు. తనకి ఒక బాహ్యామైన రూప సౌందర్యమే కాదు, లోపల్లోపల ఒక ఆంతరంగికమైన వ్యక్తిత్వంకూడా ఉంది. తన

వ్యక్తిత్వపు ముద్ర ఎన్నింటిమీదనో పడింది. ఈ పట్టణంలో అతని వ్యక్తిత్వం కలిసిపోయింది. ఈ పట్టణం అతని వ్యక్తిత్వంతో కలిసి పెరిగింది. తాను నిజంగా అదృష్టవంతుడు. ఎవరికో గాని యిటువంటి తృప్తి కలిగే అవకాశం ఉండదు. ప్రసాదరావు మరోసారి అద్దంలో తన ప్రతిబింబాన్ని నిదానించి చూసుకొన్నాడు అతని మనస్సు చటుక్కున కలుక్కుమంది. అరె! నొసటిమీద ఒత్తుగా వంకరతిరిగిన జుట్టులో తెల్లని వెంట్రుక కనపడింది.

అతనికి చిరాకు కలిగింది. ఆశ్చర్యం కలిగింది. భయం వేసింది. ఇంతవరకూ ఉన్న మనస్స్వాస్థ్యం చెడిపోయినట్టయింది. ఎక్కడిదీ తెల్లవెంట్రుక ? ఎప్పుడు ఎలావచ్చింది ? అభేద్యమనుకొన్న ఈ కోటగోడకి పగులు ఎలా ఏర్పడింది. ప్రసాదరావు మొహంలో రంగులుమారాయి. ఆతనికి చీకట్లో వొంటరిగా నడుస్తూంటే ఎవరో శత్రువులు చుట్టుముట్టి నట్టనిపించింది. అతను సరదాగా మంచు మీద స్కేటింగ్ చేస్తుంటే చటుక్కున అంచువిరిగి అగాధమైన లోయలోకి జారిపోతున్నట్టు అనిపించింది. తన నిస్సహాయత తనకి తెలియవచ్చింది ఈ తెల్ల వెంట్రుక ఇక నల్లబడదు. ఈ ఒక్క తెల్లవెంట్రుక ఆసరాతో తక్కిన వెంట్రుకలు కూడా తెల్లబడిపోతాయి. అతను ఎన్నో పరిస్థితులను ఎదుర్కొన్నాడు, పరిష్కరించాడు. కాని యిది తనచేతిలో లేదు. ఏదో బలవత్తరమైన శక్తి అతన్ని ఆక్రమిస్తోంది. ఓడిస్తోంది. శ్రీమంతుడైన ప్రసాదరావు, హేతువాది అయిన ప్రసాదరావు, ఆప్టిమిస్టు అయిన ప్రసాదరావు, గౌరవమూ ప్రతిష్టాగల ప్రసాదరావు సిసలైన వ్యక్తిత్వం కల ప్రసాదరావు తెల్లబోయి కంగారుపడి అద్దంముందు వెర్రిగా నిలుచునిపోయాడు.

అవును, తనకి ముప్పైతొమ్మిది సంవత్సరాలు గడచి నలభైయవ ఏడు వచ్చింది. ఈ మధ్య ఒళ్ళంతా బరువుగా ఉంటూన్నట్టూ, నొప్పులు పెడుతూన్నట్టు అప్పుడప్పుడు అనిపిస్తోంది. ఆఫీసులోగాని సభలలో కాని అలసట కలుగుతోంది. మధ్యమధ్య ఏదో దిగులు ఆవరిస్తోంది. ఇదంతా ఎందుకో ఏమిటో అర్థంకాలేదు. ఇప్పుడు తెలుస్తోంది. తనకి వయసు పైబడుతోంది. తాను వృద్ధాప్యంలోకి అడుగు పెట్టాడు. తన జీవన సూర్యుడు అస్తమయ శిఖరంవైపు ఒరుగుతున్నాడు. ఇలా అనుకుంటూంటే అతనివొళ్ళు వొణికింది. అతన్ని ఎవరో దగా చేస్తున్నట్టు అనిపించింది. అతనికి ఏడవాలనిపించింది. ఇన్ని ఆశలూ ఆదర్శాలూ కట్టుదిట్టాలూ చేసుకున్నా ప్రకృతిధర్మం ముందు మానవుడు ఎంత అల్పుడూ, నీరసుడూ అయిపోతాడో తెలిసిపోయింది. మరి ఎందుకు యీ జీవితమనే నాటకం !

అతనికి తన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అనుమానం కలిగింది. డాక్టరుచేత ఒకసారి Check up చేయించుకోవాలి. బహుశా తనకు రక్తపుపోటు ఎక్కువయి వుండొచ్చును. ఊపిరితిత్తులు బలహీనమై పోవచ్చును. మధుమూత్రరోగం వచ్చివుండవచ్చును. రేపే వెళ్ళి డాక్టరుకి చూపించుకోవాలి. భోజనంలో కారం పులుపూ తగ్గించాలి. తగినంత విశ్రాంతి కావాలి. ఇన్ని సంఘాలలో సభ్యత్వాలు వదలుకోవాలి. అరె! ఏమైపోతున్నాడు తను! ముసలివాడు, రోగి, బలహీనుడు, భయస్తుడు... ప్రసాదరావు అనే అఖండ జీవనది పాయలు పాయలై నిర్దయాపూరితమైన కాలపు యిసుక పర్రలలో పడి యింకి పోతుందా ?

ఇంతలో అతని గదితలుపు తెరచుకొంది. కామేశ్వరి చేతిలో మరచెంబుతో నవ్వుతూ వచ్చింది 'ఏవిటి అలాగ అద్దంలో చూసుకొని మురిసిపోతున్నారు' అంది దగ్గరగా వచ్చి. ప్రసాదరావు ఆమెను నిదానించి చూశాడు నల్లగా ఒత్తుగా వొంపులు వొంపులుగా ఉన్న ఆమె జుట్టు ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంది. ఆరోగ్యంగా ప్రౌఢంగా అందంగా ఉన్న ఆమె పసిమిఛాయను మరింత అందగింపజేస్తూ నీలమేఘంలా ఉంది. వెనకాల చుట్టూ కొన్న సిగలోని తెల్లపువ్వుల తాలూకు పరిమళం పరువమైన యౌవనపు బరువునీ మత్తునీ సూచిస్తోంది. ఆమె జుట్టులో ఎక్కడా తెల్లవెంట్రుక లేదు.

'ఏమిటండీ అలా చూస్తున్నారు నామొహాన్ని?' అంది కామేశ్వరి.

ప్రసాదరావులో ఏదో అసూయ కదలింది. ఆమెకీ తనకుగల వ్యత్యాసం కొట్టవచ్చినట్టు కనబడుతోంది. తమ యిద్దరిమధ్యా వయస్సులో గల తేడాకూడా గుర్తుకువచ్చి అతని ప్రాణం గిజగిజ లాడింది. ఎనిమిదేళ్ళ వ్యత్యాసం ఉంది తమ ఇద్దరి వయస్సులో. ఆమెకి

ముప్పైరెండు ఏళ్ళు అయినా చిరాకులూ బాధ్యతలూ తనకున్నంతగా లేనందువల్ల కాబోలు ఆమె ఇంకా నాలుగేళ్ళు చిన్నదిగా కనబడుతోంది ఆమె బుగ్గల్లో బుజాల్లో ఆరోగ్యపు నిగనిగ ఉంది. అతని మొహంలో వయసుపెరిగిన తాలూకు చారలు తొంగి చూస్తున్నాయి. అతను నీరసంగా విషాదంగా నవ్వి మంచంమీద చతికిలబడ్డాడు. ఆమె అతని దగ్గరగా నుంచొని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి గోముగా అంది 'ఏం అలా ఉన్నారు దొరగారు?'

అతను నిట్టూర్చాడు 'ఇదిగో ఇలారా' అని ఆమెని అద్దం ముందుకు లాక్కువెళ్ళి నిలుచున్నాడు. తన నొసటి మీద ఉన్న తెల్లవెంట్రుకల్ని చూపించి 'చూడు' అన్నాడు. ఆమె కిలకిల నవ్వింది 'అయ్యో ముసలి మొగుడు' అని సాగదీసింది నవ్వులాటగా హేళనచేస్తూ. కాని అతనికి బాధకలిగింది. మళ్ళీ అసూయ ప్రజ్వరిల్లింది. ఒకే జీవన యాత్ర చేస్తున్న తమ యిరువురిలో వ్యత్యాసం యింతగా ఉండడం సబబు కాదనిపించింది. కళ్ళుమూసుకొని మంచం మీద పడుకున్నాడు బాధగా నిట్టూర్చాడు.

ఆమెకి పెట్టి పోషించేందుకు తానున్నాడు. నౌకర్లున్నారు, వంటవాడున్నాడు.. ఆమెకి ఏ విషయంలోనూ నలిగిపోవాల్సిన అవసరం లేదు. చివరికి ఆమెకు కాన్పులు కూడా ఎక్కువలేవు. ఒకడే కొడుకు బుద్ధిగా చదువు కొంటున్నాడు ఆమె కోరిన కోరికలన్నీ తీరుతున్నాయి. రేడియో, సినిమా, పేరంటం వ్రతాలూ, ఆమెకి అంతా కాలక్షేపమే ఆమె ఉపవాసాలుంటుంది నిజమే... కాని అవి ఆమె ఆరోగ్యాన్ని మరింత సంరక్షిస్తున్నాయి అతనికి ఏదో బెంగపుట్టింది 'కామీ' అన్నాడు బాధగా.

'ఏవండీ' అంది కామేశ్వరి సిగలో పువ్వులు సర్దుకుంటూ...

'ఇక నేను ఎక్కువకాలం బ్రతుకను... నేను ముసలి వాణ్ణయిపోతున్నాను.' అన్నాడతను. ఆమె వింతగా భయంగా అతనివైపు చూసింది.

'నాకు బ్లడ్ ప్రెషర్ ఉంది నాకు తెలుసును...'

ఆమె దగ్గరగా వెళ్ళి అతనిపక్కన కూర్చొంది. 'ఛఛ... ఏమీ లేదు.. మీకు నూరేళ్ళాయిష్షు! నాకు తెలుసును' అంది.

'నేనుపోతే నువ్వొకత్తెవూ బాబుని పెంచుతూ ఉండగలవా' అన్నాడు అతను గద్గదికంగా.

ఆమె అతన్ని హత్తుకుంది 'ఏవిటి ఇలా పిచ్చివారైపోతున్నారు యివ్వాళ? అసలు ఏమొచ్చింది?' ఆమె సాలోచనగా నిశ్చయంగా అంది. 'నేనే ముందుపోతాను. నాకు తెలుసును పసుపు కుంకుమలతో నేను పునిస్త్రీగానే చచ్చిపోతాను!'

'ఏడిశావ్!'

'నిజం... త్రిపురసుందరి నన్ను అన్యాయం చెయ్యదు. మీకేం ఫరవాలేదు. అయినా ఒక్క తెల్లవెంట్రుకకి యింత బేజారెత్తి పోతున్నారేవిటీ! మా పింతండ్రి కొడుక్కి పాతికేళ్ళు రాకుండానే జుట్టంతా తెల్లబడి పోయింది!'

'కాని నా విషయం వేరు ఈ తెల్లవెంట్రుక నాకు సూచన కామీ! నా ఒంట్లో ఉన్న సత్తువ క్రమంగా హరించుకు పోతుంది!'

'ఎప్పుడూ కాదు. నా దేవత మీదా నా పూజమీదా నాకు నమ్మకముంది. త్రిపురసుందరి ఎన్నోసార్లు కలలో కనబడి నాకు చెప్పింది...' ఆమె గొంతులో విశ్వాసం ఖంగని మ్రోగింది.

'మూఢనమ్మకం' అన్నాడతను.

'ఇదిగో యిలా అంటే అలా అంటారు. పోన్లెండి బాబూ! నా నమ్మకాలు నావి, మీరు పడుకోండి వెర్రి మొర్రి ఆలోచనలు పెట్టుకోక ఛా, యింత భయస్థులనుకోలేదు మీరు...' ఆమె అనునయంగా మాట్లాడి అతని పాదాలు నొక్కుతోంది.

ప్రసాదరావు కళ్ళుమూసుకొన్నాడు. అతను కొంచెం సిగ్గుపడ్డాడు తన ఆవేశానికి భయానికీ కాని తన భార్యకున్న విశ్వాసం తనకిలేదు, తన ఉద్దేశ్యంలో ఆమె మంచిది శీలవతి, సద్గృహిణి.. అన్నిటికన్నా ఆమె మూఢురాలు తనకి దేవుడూ మతాలూ పూనకాలూ తావీదులూ

ఇలాంటి వాటిమీద నమ్మకంలేదు, ఆమెకి అన్నీ నిజాలు. గడ్డం పెంచుకున్న ప్రతీ బైరాగిలోనూ ఆమెకి మహత్తు గోచరిస్తుంది, ప్రతీ పఠంలోనూ శిలావిగ్రహంలోనూ దేవుణ్ణి చూస్తుంది... వ్రతాలు చేస్తుంది. ఉపవాసాలుంటుంది తననీ తన కుటుంబాన్నీ దేవుళ్ళు వేయికళ్ళతో కనిపెట్టి రక్షిస్తున్నారని ఆమె నమ్మకం, దేవుళ్ళూ దేవతలూ ఆమెకి కలల్లో కనపడి ఆమెకి వరాలు అడిగినన్నీ యిచ్చి వెళ్ళిపోతుంటారు, ఆమెలో ద్వైధీభావం లేదు. సంశయంలేదు. అందుకే ఏమో ఆమె ఎప్పుడూ హాయిగా నిశ్చలమైన సరోవరం లాగుంటుంది.

'నా పాదాలు కళ్ళకి అద్దుకుంటావేమిటి ఛ ఛ' అంటాడతను.

'నా దేవుడెవరో నాకు మీకన్నా బాగా తెలుసులెండి' అంటుంది ఆమె.

'ఈ పూజలూ ఉపవాసాలూ ఏమిటి కామీ? నీ ఆరోగ్యం పాడైపోతుంది' అంటాడతను. ఆమె తనని చూసి జాలిగా నవ్వి ఖాతరు చెయ్యదు.

ఏమైనా తర్వాత రోజునుంచీ ప్రసాదరావు మారిపోయాడు. భార్యని చూడగానే అతనికో అసూయ అనుకోకుండా కలిగేది. అతనిలో భయం పెరగజొచ్చింది. డాక్టర్లకి చూపించుకొంటాడు. వాళ్ళు కొంచెం బ్లడ్ ప్రెషర్ ఉందనో లేదనో మరొహటో ఏదో అంటారు. దానితో అతనికి మతిస్థిమితం పోతుంది. ఇప్పుడతను ఆహార విహారాలు చాలా నియమంగా చేస్తున్నాడు. చప్పిడి తింటున్నాడు. రాత్రుళ్ళు నిద్రకోసం అప్పుడప్పుడు మాత్రలు మింగుతున్నాడు. భార్యని కసురుకొంటున్నాడు. ఆమెపక్కన ఉంటే అతనికోవిధమైన బాధా, అసూయా, పైబడుతూన్న వయస్సూ అన్నీ జ్ఞాపకం వచ్చి పిచ్చివాడై పోతున్నాడు. అతను కసురుకున్న కొలదీ కామేశ్వరి మరీ ఓర్పుగా ఉంటోంది చిరునవ్వుతో, లాలనతో అతన్ని మరపించాలని చూసేది. 'మీరుకూడా వచ్చి నాతో పూజ చేయండి, ఈ సంశయాలు బాధలూ ఉండవు' అనేది నిజమే ఏమో అనుకునేవాడు. కాని యింతలోనే అతని శాస్త్రీయదృక్పథం అడ్డు వచ్చేది. హేళన చేసేవాడు ఆమెనీ ఆమె విశ్వాసాల్ని ఏదో తెలియని కసితో.

ఆరు నెలల్లో మరికొన్ని వెంట్రుకలు కూడా తెల్లబడ్డాయి ప్రసాదరావుకి అద్దంలో చూసుకోవడమే భయంగా ఉంది. లోపల్లోపల పెరుగుతూన్న అసంతృప్తినీ అస్థిమితత్వాన్నీ కోపం నిర్దయగా మార్చి భార్యమీద నౌకర్ల మీదా రైతులమీదా మిల్లు కూలీల మీదా చూపించేవాడు. హఠాత్తుగా ఒకనాడు అతని భార్య తెలివితప్పి కిందపడి పోయిందని ఫోన్ లో చెప్పినప్పుడు ఆఫీసునుంచి యింటికి పరుగెత్తుకు వెళ్ళాడు. ఆమె పెద్ద మంచంమీద దిండ్లనానుకుని పడుకుని ఉంది డాక్టరూ ఆ ఇంటి నౌకర్లూ అక్కడే ఉన్నారు.. "ఏమైంది డాక్టరు?" అని ప్రసాదరావు గాభరాగా అడిగాడు.

'ఈమెకి జ్వరం చాలా తీవ్రంగా ఉంది న్యూమోనియా అని అనుమానిస్తున్నాను' డాక్టరు తలపంకించి చెప్పాడు.

'ఏం ప్రమాదం లేదుకదా'

'ఈమె గుండెకూడా సరిగ్గా పనిచేయడంలేదు. అవును కాని ప్రసాదరావుగారూ! మీరీమె విషయంలో ఏ శ్రద్ధ తీసుకోనట్టు తెలుస్తోంది ఈమె రోజు రోజూ ఉపవాసాలూ స్నానాలూ చేస్తున్నారట మీరెందుకని వారించలేదు?' అని ప్రశ్నించాడు డాక్టరు.

నిజమే తాను పట్టించుకోలేదు కాని ఆమె చేసే స్నానాలు, పూజలూ వ్రతాలూ ఉపవాసాలు తనకోసమే. నిజంగా తన కామేశ్వరి తనకోసమే ఏం చేసినా! స్వార్థం ఒకింత కూడాలేని ఆమె గృహిణీ జీవితం అతని కళ్ళకు కట్టింది. అతనిలో ఏదో పశ్చాత్తాపం బాధా వెల్లువై ఉబికాయి. ఆమెతో పోల్చుకుంటే తనెంత అల్పుడుగా గోచరిస్తాడో కూడా తెలుసుకున్నాడు.

కామేశ్వరి కళ్ళు తెరచి అటూ యిటూ చూసింది. తనని చూసి నీరసంగా చిరునవ్వు నవ్వి 'నాకేం భయంలేదు మీరు వెళ్ళి భోంచెయ్యండి. ఇప్పటికే ఆలస్యమైపోయింది' అంది.

ఇప్పుడూ... ఇంత జ్వరతీవ్రతలోనూ తనని గురించే ఆమె ఆందోళన! ప్రసాదరావు సిగ్గులో పశ్చాత్తాపంలో కూరుకుపోయాడు. ఆమె దగ్గర కూర్చొని నొసటిమీద కురుల్ని సవరిస్తూ 'కామీ నీకు నయమయే దాకా ఇంకొక పని ఏదీ చూడను నీ దగ్గరే ఉంటాను' అన్నాడు ఆమె స్నేహ పిచ్చిలంగా నవ్వింది.

వారంరోజులైనా జ్వరం తగ్గే సూచనలేమీ కనబడలేదు. ఆమె హృదయ పరిస్థితి భయావహంగా ఉందని చెప్పాడు డాక్టరు. ప్రసాదరావుకి అన్నం సయించదు, నిద్రపట్టదు. అలాగే ఆమెను కనిపెట్టుకుని కూర్చున్నాడు ఆమెకి ధైర్యం చెబుతూన్నాడు.

'నాకేమీ భయంలేదు. అన్నింటికీ త్రిపుర సుందరే ఉంది మీరు నా ఎదురుగా ఉన్నారు నా కొడుకున్నాడు నాకు కావలసిందేముంది? ఇంక చనిపోయినా సరే'

చప్పున ఆమె నోరు మూశాడు ప్రసాదరావు. అంత ఆందోళనలోనూ అతనికొక ఆశ్చర్యం కలిగింది. ఆమెలో ఉన్న నిబ్బరం! ఆమెకి తన జబ్బుని గురించి తన పరిస్థితిని గురించి ఏ మాత్రం భయంలేదు. ఒక్క తెల్లవెంట్రుక కనపడగానే తాను చలించిపోయాడు. ఆమె ఆపన్న మృత్యువుకి కూడా కొంచెమైనా కంగారుపడదు బాధపడదు. భయపడదు నిశ్చల సరోవరంలాగ నిర్మలంగా ఉంది! ఏ అఖండ విశ్వాసం ఏ రహస్యం ఆమెకీ శక్తినిచ్చింది? ఇంత విజ్ఞానంతో శాస్త్రీయ దృక్పథంతో కూడా తానెందుకింత చపలుడూ, దుర్బలుడూ అయిపోయాడు?

ఒకనాడు ఉదయమే కామేశ్వరి భర్తని పిలిచింది ఇద్దరు డాక్టర్లు ఆమె మంచంపక్కనే ఉన్నారు ప్రసాదరావు ఏడుపు నాపుకుంటూ ఎర్రని కళ్ళతో చూస్తున్నాడు.

'చూడండి' అంది నీరసంగా కామేశ్వరి. 'నా నొసట మీ చేత్తో కుంకుమ పెట్టండి' అంది

ప్రసాదరావు వొణికే చేతులతో ఆమె ఫాలాన బొట్టు పెట్టాడు. ఆమె తలను తన వొళ్ళో పెట్టుకున్నాడు 'కామీ! నన్ను అన్యాయం చెయ్యకు' అని ఏడ్చాడు.

ఆమె కళ్ళు తెరచి పాలిపోయిన పెదాలమీద చిరునవ్వు వెలుగుతూండగా యిలా అంది. 'నేను మీకు చెప్పాను కదూ! పసుపు కుంకుమలతో నేనే మీ సెలవు తీసుకుంటానని. త్రిపురసుందరి నాకు అన్యాయం చెయ్యదు'

ఆమె వదనంలో శాంతమూ, తృప్తీ అలముకొని ఉన్నాయి అవిశ్వాసి అయిన ప్రసాదరావు రెండు చేతులెత్తి పైకి నమస్కరించి 'ఓ భగవంతుడా! నా భార్యని బ్రతికించు' అని ఆక్రోశించాడు.

డాక్టర్లు క్షణం క్షణం మందులిస్తూ యింజెక్షన్లు యిస్తూ మృత్యువుతో కుస్తీ పడుతున్నారు. ప్రసాదరావు లేచి స్నానం చేసి పట్టుబట్ట కట్టుకొని కామేశ్వరి పూజామందిరంలోకి వెళ్ళి త్రిపురసుందరి ముందు మోకరిల్లాడు. కన్నీళ్ళతో ఆమెని వేడుకొంటున్నాడు ఇంతలో కెవ్వనికేక — నలుగురూ ఏడ్చిన ధ్వని — ప్రసాదరావు స్పృహతప్పి త్రిపురసుందరి పాదాగ్రాల వద్ద పడిపోయాడు.

[రేడియోలో ప్రసారితం]




# తమ్ముడుపెళ్ళికి తర్లీవెళ్ళడం

## భమిడిపాటి కామేశ్వరరావుగారు

## (భారతి మాసపత్రిక, 1928 మార్చి సంచికనుంచి పునర్ముద్రితం)

అబ్బే, ఏం లేదండీ ! ఓనాడు తెల్లవారీ వారడంతోటే ఉదయం రైల్లో ఉరికే ఫిరంగిగుండులా ఊడిపడ్డాడు, మా మేనమామ, కాకినాణ్ణించి. ఇల్లా ఇంకా గుమ్మం దాటి లోపల పళ్ళేదు, ఆ పళంగా హత్తెరీ అని దొరకబుచ్చుకున్నాడు మమ్మల్నీ ! "పెళ్ళి పెళ్ళి పెళ్ళి, వ్యవధిలేదు వ్యవధిలేదు" అంటూను. కాళ్ళు కడుక్కోడు, కూర్చోడు, ఆగడు, ఆలోచన తోచనివ్వడు, "శుభస్యశీఘ్రం అన్నాడు. కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదు. పెద్దలంతా వ్యాపారం అల్లా రైటు చేశారు. ఇహ చూస్తే లాభంలేదు, నడుం కట్టాలిగాని!" అంటాడు. నిజమే ఆ మాట. పుట్టడానికి పూర్వంనించీ గూడా అనుకుంటూనే ఉంటాంగా మేనరికం సబంధం ! కాని, మన్లోమాట, మా తమ్ముడూ తమ దయవల్ల ఏవో రొండు ముక్కలు చెప్పుకుంటూ ఉన్నవాడేగాని వొట్టి రికామీమనిషి కాడు. వాడికీ కో అంటే కోటిమంది అన్నట్టు వస్తూనే ఉన్నారు, లాంఛనాలు మినహా కట్నం, ఓ పిల్లికూనదాకా చెబుతూను. ఏం జరిగితేం, మాకు మొదణ్ణించీ దీనిమీదే ఉంది మనస్సు, కానైతే, అందుకన్లేదూ! ఏదో ఆడపిల్ల వాళ్ళం మేం అయినట్లు అతగాని ధోరణికి చెబుతున్నా. మేనరికం అంటే కన్యాప్రదాతకి కాస్తంత స్వరాజ్యంగావును ! రెండు మూడు దఫాలు విశ్వప్రయత్నం చేశా అక్కడికీ __ "చెప్పావు కాట్టయ్యా, కాస్త నిదానించు, గుఱ్ఱం దిగు కొంచేం మరి; ఇల్లా కచ్చల్లో కందులు వేయించితే ఎల్లాగు? వెనకా ముందు చూసుకోనీ. కావలిసిన వాళ్ళమేగదా, ఏదో పైసలు చేద్దాంలే!" __ అంటూ పెట్టి ఒక్కరవ్వ కసురుగున్నట్టు డబాయిద్దాం అని. అయితే అతనెక్కడ ? అబ్బే! ఊఁహుఁ. తను చెప్పేదేదో అదేగాని, తెడ్డయినా మామాట చొరనియ్యందే ! మళ్ళీ మాట చెప్పడం సొంపు మా అందరిదగ్గిరా ఉంది. ఉంటేం? ఏమీ అతడు వినిపించుగోండే! ససేం! పైగా, మేనమామ. ఓవేళమాట్టాడ్డాని కాతడు మాకు తెరపిచ్చినా మేం అతణ్ణి నెగ్గగల్తుమా? అమ్మయ్య! ఏదో ఆ భోజనం చేసేటప్పుడు ఆ ఆసామి ఏం తమాయించాడోగాని, అస్తమానం ఒక్క వరసగా ఉన్నాడూ, మరొక్కవారం ఉంది ముహూర్తం అని కాయితంమీద రాసిచ్చాడు లగ్నం అదీని. సరి ఆ మధ్యాన్న వేళ రైల్లో గావును వాళ్ళవూరు నిష్క్రమించాడు.

అవునా; ఉన్నమాట అనేస్తే తీరిపోతుందీ, నాకు మాత్రం మా చెడ్డతట్టుగా లేసుకొచ్చింది, చెప్పద్దూ! కాని ఏమిటి చెయ్యడం! పెద్దవాడూ! మరోటీ, అతనన్నదీ నిజమే! శుభశోభనాదులనీ ఏదో చకాపికీగా గబగబా హైరానగా అయిపోతుంటాయిగాని, ముందెంత

గుణించుగు కూర్చున్నాసరే వీటిల్లో స్థాయిగా ఉండడం బహు అరుదు. ఒకసారి నేను కూడా అర్థ ఆలోచించాను. "ఇక పెళ్ళికీ, వడుక్కీ అంటూ ఇంతంతా ఇంతంతా లేరు మనికి చెల్లిళ్ళూ తమ్ముళ్ళూనూ. చెల్లిల్ని అత్తారింటి కి పంపేశాం, తమ్ముళ్ళు ఈవరకే సంతాన వంతులయారు; ఎటొచ్చీ ఇహ నాలుగో తమ్ముడు వీడొక్కడూనూ. వీడుకూడా ఓయింటివాడవడమే గదా మనం కోరేదీనూ. ఊహూ, మంచి చెడ్డలు చెప్పడానికి మాత్రం దగ్గిర పెద్దవాళ్ళెవరున్నారు గనకా" అని తలపోసుకుని, నేను మనసు నిబ్బరం చేసుగుని, నా స్నేహితుడు ఒక మేష్టరు మా భవనంలోనే మరోభాగంలో కాపరం ఉంటే ఆయన్ని తక్షణం కలుసుకుని, హైసా అని ఆయనా నేనూ కలిసి పట్టుపట్టుమని కొన్ని కొన్ని ఖంజాయింపులు చేసుకుని, రివ్వున వెళ్ళి ఉత్తరాలైచ్చి, మా తమ్ముళ్ళకీ, పెత్తండ్రిగారికీ, కడ మాబంధుకోటికీ, ఈ సంగతంతా గోకేసి ఆహ్వానం రాసి, నుంచున్న ఫళాన్ని వాళ్ళని యావన్మందినీ యకాయకీని బయల్దేరివచ్చివాలమని, పెళ్ళికి ఓ ఇదేనీ, ఓ అదేనీ ఆడవాళ్ళు పురమాయించిన మీదట ఏవో బజార్లో కొనుక్కొచ్చి ఇంట్లో గిరవటేస్తూ, ఆ ముహూర్తానికే కాకినాడ వెళ్ళాడానికి ఆయత్తపడడం వెంటనే ప్రారంభించాం.

పెద్దవాళ్ళు కార్యాదులు ఎల్లా కొనసాగించుతోచ్చారోగాని, ఆ నాలుగు రోజులూ మాకేమన్నా ఊపిరి సలిపిందా, కాళ్ళు విరగదొక్కుకున్నాంగాని ! ముహూర్తం అనే మాటలో ఉంది ఎంతసొగసైనా! అది మానవులే పెట్టుకుని, అదొచ్చి మీద పడిందంటారు. దాని బలిమి ఏం బలిమి? డబ్బు కుదురుతుంది, వీలు కుదురుతుంది, మనసు కుదురుతుంది, చాలామందికి జలుబువొదిలి రోగం కుదురుతుంది, జరిగితీర్తుంది! సంబంధించిన పునిస్త్రీలకి నెలలు నిండడంగాని, సంబంధించిన ముసలమ్మలకి ఏళ్ళు నిండడంగాని జరక్కుండా ఉండాలిగాని ముహూర్తం మానవులకోసం ఆగదు. ముహూర్తాలంటూ పెట్టకపోతే, మన్లో ఉండే విధ్యుక్త కార్యనిర్వహణానికి ఒక్క పెళ్ళీ పడకనే పోను అసలు! ఈమాట అందరికీ తెలుసు. అంచేత దూరపు బంధువులైనా అశ్రద్ధలు చెయ్యరు. చేసినా పాకెన్న దాటనివ్వరు. కావలిసినవాళ్ళు పిలుపందకపోయినా రాక మాన్నేలేరు. వచ్చి తమరికి సరియైన పిలుపేలేదని దెప్పడం గునపడమూనూ. గునపడానికి బాగా సావకాశం ఉండేనిమిత్తమే పెళ్ళి అయిదురోజులంటూ ఏర్పరిచింది అని కొందరి ఊహ. సరి, మా వాళ్ళూ నా ఉత్తరాలు చూసుకుని సెలవచీటీలు రాసిపారేసి, ఆ మట్టున చక్కావచ్చారు. క్రితంనాడు మధ్యాహ్నానికప్పుడే మా పెత్తండ్రిగారూ, వాళ్ళవాడూ, పిల్లలూ అంతానున్నూ నిమ్మనిమ్మణంగా ఒహొక్కరే ఒహొక్కరే నా అన్నవాళ్ళంతా జేరుకున్నారు ఎల్లాగైతేం. ద్వారబంధానికి తోరణంగట్టి, పెళ్ళికొడుకు కళ్ళకి కాటికా, బుగ్గని చుక్కా పెట్టేటప్పటికి వొస్తుంది కావున పెళ్ళికళ. ఆపళంగా అదివరదాకా సంసారపక్షంగా ఉంటూన్న ఇంటిల్లపాతి జనంలోనూ ప్రతీనస్మరంతిగాడూ కూడా గొడ్డలిపెట్టుగా ఒక గొప్ప మొగపెళ్ళివాడుగా మారిపోయి ఊరుకుంటాడు. అక్కణ్ణించి అడుగులు లెక్కెడుతూ నడిచేవాడొకడూ, నిద్దరోతూ మాట్టాడేవాడొకడూ, అభోజనం పడుకుంటానని గడ్డంపట్టించుగునే ధీరోదాత్తుడొకడూ, తాను భంత్రోతంటే తనికి భంత్రోతనే ఘరానా వాజమ్మ ఒకడూ, "అబ్బ! వాణ్ణెళ్ళమందూ, దుక్కలా ఉన్నాడూ!" అని ఎగేసేమందుడొకడూ ఆవిర్భవించడం వల్ల వ్యాపారం తారుమారవుతుంది. కాని, సందడి అంటే అదే సందడిలెండి మరి! "ఈ దార్లో తుంగచాప పరిచారెవరూ?"__(ఎవడు చెబుతాడు సమాధానం?) "ఈ టముకు పెట్టి ఎవరిదర్రా, కాలు బద్దలవుతూనూ?" "ఏమర్రా, మూడుకోతల దంతపు దువ్వెన్న చూడలేదుకదా, మీరెవరూ?" "ఇదుగో, చూడూ! నా పట్టు తాపితాలు ఎక్కడున్నాయి ? ఇయ్యి, అవీ మరచెంబూనూ!" "ఈ వెధవని తియ్యవే ఇక్కణ్ణించీ! తీసి నీళ్ళట్రా" అంటూ అనవరతమూ కేకలు వినబడుతూ, చంటిపిల్లల గుక్కలట్టడాలూ, కాస్త పెద్ద పిల్లల అల్లర్లూ __ పల్లకీలో కూర్చోడానికి తగూలూ, గాయికం వచ్చినవాళ్ళు మెత్తుకున్నా వినిపించుకోకుండా పేకాటలూ, ముసిలివాళ్ళ కూకలెయ్యడాలూ లాంటి వాటితో నిండి ఉంటే అప్పటి ఆ వైభవం సంసార సౌఖ్యసారం అనచ్చునేమో! చెప్పొచ్చేముక్క, మేమంతా ఇంకా ఆడపెళ్ళివారి ఊరెళ్ళి వాళ్ళేర్పాటు చేసే విడిదిలో దిగకుండానే, ఇక్కణ్ణించీ కూడా తయారుగానే ఉన్నాం. ఇంతంత గలిభీ, హడావిడీ జరిగిపోతుంటే పైవాళ్ళమైతే మహా చెడ్డ సొగసుగా చూడచ్చు ! కాని ఎవరో ముగ్గురో నలుగురో నడుంకట్టి వ్యాపారం అంతా చక్కపెడుతూ, అడిగినవి ఇవ్వడానికీ, ఇచ్చినవి అమర్చడానికీ, అమర్చినవి ఉపయోగించడానికీ, వెన్ను వాల్చడానికేనా తీరిక లేకుండా యెముకలు పొడుంగావలసిన వాళ్ళు ఉండితీరాలిగా ! ఇక్కడ ప్రస్తుతం

నేనల్లాంటివాణ్ణి. ఇహను ఆ తెల్లారకట్ల అయిదుగంటల రైలుకే ప్రయాణం. అంతా పడుకున్నారు. నేను వీలైనప్పుడల్లా ఓ కునుకు లాగుతూ లేస్తూ గడిపాను. మా ఆవిడమాత్రం _ మరి పెద్దలు ఇంట్లో లేరుగామరీ ! __ రాత్రెల్లా చిమ్మెటల్లా ఏదో సవిరిస్తూనే ఉంది; సవిరింపు తెమల్నేలేదు.

ఇక ప్రయాణ సరంజాం కల్లామూలం మావాళ్ళు నాలుగు బళ్ళు చెప్పొచ్చారు. చెప్పొచ్చీ, ఇహ తమ నిద్దర సంగతేగాని మరి బండీవాళ్ళ అతీగతీ కనుక్కోలేదు. వాళ్ళూ చాలాసేపు అరిచారట, ఆగారట, ఎంతైనా తంటాలు పడ్డారట. కాని ఛస్తారా ఏమిటి, ఫికర్లేకపోతే! ఆఫళంగా విసుగేసుగొచ్చి వాళ్ళు మాయమై చక్కాపోయారు. ఈ సంగతి నాకు నాలుగు గంటలకి మెణుకువ రావడం ఏమిటి, తెలియడం ఏమిటి, రెండూ ఓమాటే జరిగాయి! బండివాళ్ళ పిలుపులు వినిపించుకోనందుకు నాకు చర్రుమనిపోయింది__ నేనైనా తప్పనిసరివల్ల కోప్పడతానుగాని, నేను మాత్రం వినిపించుగో కూడదూ!__ ఆగి అప్పట్లో కడం వాళ్ళనందర్నీ లేవగొట్టడం శక్యం అయిన పనిలా కనపడక, తీరా రైలు దాటిపోతే (అందర్నీ కదుపుకుని వెళ్ళేటప్పటికి), మళ్ళీ స్నాతికం అడ్డుతుందేమోగదా అని హడలెత్తి, "పోనీ కొంతమంది ముందు వెడితే!" అనిపించింది నాకు. సరి, పెళ్ళి కొడుకొహడూ__ పెళ్ళి పెళ్ళికొడుకూనా అన్నట్టు నేనూ, మావాళ్ళూ వెళ్ళి తీరాలిగా! తక్షణం, "రైలు వేళయింది లేవండర్రోయ్" అని ఇంట్లో మేఘధ్వని ఓటి ఖర్చుపెట్టి, మేం ముగ్గురం ముఖ్యం అనుకున్నదీ, చేతికి అందినదీ ఊచిపుచ్చుకుని, రైలుస్టేషన్కి ఎగడ్డాం. కొంతరంగం ధౌడు తీసేటప్పటికి, ఓ ఒంటెద్దుబండీ కునికిపాట్లు పడుతూ మాకు ఎదురుపడితే అది బేరం లేకుండానే వెనిక్కి స్టేషన్కి పట్టమన్నాం. ఏట్లానో బాధపెట్టగా, వాడు ముందు బరువూ, వెనక బరువూ, అసలు బరువు అంటూ మమ్మల్ని కొరుక్కుతినేసి అఫీషూ స్టేషన్కి ఈడ్చుకుపోయాడు. స్టేషన్లో ఊహూకోలాహలం బయల్దేరింది__ ఇటోటీ అటోటీ రొండురైళ్ళున్నాయిలెండి, అప్పుడే! మా రైలు కర్ణశూలం వంటి రాక్షసికూత ఓటి ఎక్కడకూసి తోకముడిచేస్తుందో అని నాకు ఓటేబెంగ! "డబ్బిచ్చీయండి, బాబుగోరు, యెల్తాను!" అని బండీవాడు. నాదగ్గిర చిల్లర్లేదు. "ఉండరా, టిక్కట్లు కొన్నతరవాత నీ డబ్బు నీమొహాన్ని కొడతానూ!" అన్నాను. అంటే వాడు అల్లా ఎల్లాగండీ అని బలవంతపెట్టి, నుంచున్నపాట్న కక్కమని కూర్చున్నాడు. "నీమొహం దగలేసిరిగదరా, నీమొహం దగలెయ్య!" అనుకుని, గొడుగుంటేను చేతులో, అది వాడిమొహంమీద కొట్టి, "ఇదుచ్చుగు ఏడవరా, డాబ్బిచ్చిందాకానూ !" అని నేను నోటుపైకి తీసి పరిగెట్టి, కిటికీ దగ్గిర ఉల్టాసీదా అంతపని జరిగి, ఎల్లానో మూడు టిక్కట్లు కోయించాను. మావాళ్ళిద్దరూ మించిపోయినట్టు స్టేషన్లోకొచ్చి దిక్కులు చూస్తూ నిలబడ్డారు. ఇంతలో నేను చిల్లరట్టుగుని "ఇదుగో రోయ్" అంటూ బళ్ళదగ్గిరికి వెళ్ళేటప్పటికి, ఏడీ బండీవాడూ? ఈ భూప్రపంచంమీద లేకుండాపోయాడు. "నాలుగుంబావలా కిమ్మతు అసలు బుట్టమార్కుది, నిక్షేపంలాంటి గొడుగు, నీపొట్టనెట్టుగున్నావుట్రా, నీపొడుగు బొగ్గులుగానూ!" అనుకున్నాను. అనుకుని, మావాళ్ళమీద కొంచెం చిర్రుబుర్రుమన్నాను, వాడికోసం ఎల్లానూ బయల్దేరిన కోపాన్ని నిరర్థకంగా అంతరించిపోనీకుండాను !

ఇంతట్లో, ఇంటిదగ్గర నాకేకతోటి మావాళ్ళంతా పొగేస్తే తేనిపట్టు రేగినట్టు ఒక్కమాటు చలించారట. ఓ ముగ్గురు తెగతిరిగి నాలుగు వీధులూను, బ్రహ్మాండం మీద రెండుబళ్ళు సమకూర్చి యింటికి తెచ్చి, వాటిల్లోకి పెళ్ళివారి సామాన్నీ పెళ్ళివార్నీ చిటికెలో రవాణా చేసి పారేశారట. ఇహ బయల్దేరపోయే సమయాన్ని కరకమ్మగారు తనతల్లిని తీసుగుని, ఓ ట్రంకుచ్చుగుని, ఓ అరిటిగెల వేసుగుని కాకినాడ తనూ వస్తానంటూ కాళ్ళకి అడ్డంపడిందిట. కరకమ్మ మాకు చుట్టంకాదు పక్కంకాదుష్మండి, మా హవేళీ లోనే ఉంటూన్న పొరుగావిడ. క్రితం ఆర్నెల్లనించీ ప్రతినిత్యమూ నేను ఆవిణ్ణి చూస్తోచ్చినా, ఎప్పుడూ సంబోధించలేదు. వినడం ఆవిడ దొడ్డమనిషే అని. మనిషి ఊరికే సన్నంగా కదురులా పేనులా ఉంటుంది. నిజమేనండి, ఉత్త ఆటుగ్గింజ, పాపం! కాని, కట్టెపేలగా ఉంటేం, గాత్రం మాత్రం మహా గట్టిది గావుకేకలెట్టడానికి. కాయశరీరం ఏమో, ఆవిడ అనేక పుష్కరాలకి కోటిలింగాలరేవులో స్నానం చేసింది. ఆవిడికి ఓ తల్లి, ఈవిడికి కన్నూ కాలూ కొంతవరకే ఉన్నాయిగాని, మడీ ఆచారంమట్టుకు చెక్కపూటుగా ఉన్నాయి. వీరికి ఓట్రంకుట. అబ్బే, ఎంత ట్రంకండీ, నా మొహం! ఉత్త

మన పెద్దబాలశిక్ష పుస్తకం అంతాయె. పైపెచ్చు ఓ చిన్న అరిటిగెల! వీళ్ళు ఎక్కడికక్కడికే అని పెళ్ళివాళ్ళతో తెల్లారగట్టే తయారయారు, సమూహంలో కొట్టుగుపోవచ్చుగదా అని. సరే అనుకున్నారట మావాళ్ళు. అనుకుని ఓ రొండు నిముషాల్లో వీళ్ళనీ ట్రంకునీ అరిటిగెల్నీ సర్ది ఎక్కడోను బళ్ళు తోలుకుని మేహాలమీద వచ్చిపడ్డారు స్టేషన్కి. గుడ్డిలో మెల్ల, ఇంకా మా రైలు కదల్లేదు. వస్తూనే, మా రొండో తమ్ముడు నాదగ్గిరి కొచ్చేసి, " మేష్టారు సాయంత్రం వస్తానన్నాడు. మనికి పన్నెండు టిక్కట్లు కావలన్నయ్యా!" అన్నాడు. "సరే మీరెళ్ళి సామాన్తో రైల్లో పడండి!" అని నేను అదివరలో కిటికీదగ్గిర మోచేతితో పిడీల్తో టిక్కట్లు కొన్నవాణ్ణి ఇప్పుడు లోపలికెడితో ఏదోమహా పొడిచేస్తానన్నట్టూనూ, మనికీ ఉద్యోగమేగదా, టిక్కట్ల గుమస్తా నన్ను మన్నించకపోతే యెరగడా మన మజాకా అన్నట్టూనూ, గురుక్కున తిరిగి లోపలికెళ్ళి, "అయ్యా ! దయచేసి కాకినాడకి పన్నెండు!" అని జాతిభాషలో అడిగి, ఆ టిక్కట్లూ చిల్లరా బహునమ్మకంగా__ మళ్ళీ పల్లెటూరి గబ్బిలాయికి మల్లే తిరిగీ లెక్కపెట్టుగుంటూ కూర్చోక__జేబులో వేసేసుగుని, ఏదో గొప్ప దిగ్విజయం చేసినట్టు గరాగరీగా ఇవతలకి వస్తూంటే ఒకడు "అయ్యా! ఈ టిక్కట్టు ద్వారపూడికేనా చూసిపెట్టండి!" అని నన్ను కనుక్కునేటప్పటికి, నేను "అయ్యో! పిచ్చిపుల్లాయిలా ఉన్నావేమిటి, ఎక్కడో! అక్కడికే!" అంటూ వాడి అతిజాగర్త అసహ్యించుకుంటూ చక్కాపోయి, మావాళ్ళంతా బండీలో పడగలిగినందుకు ఆనందపడి, ఇహ రైలు కూసి పొగవొదిలి ముందుకి సాగేవేళకి నేనూ ఎక్కేసి పెట్టి తలుపేసుగుని, "అమ్మయ్య" అనుకుని లోపలకూర్చోపడ్డాను.

రైలు "ఆఁ నేను వెళ్ళను" అన్నట్టు కొంత హరామీ చేసి వెనక్కి కదలడం మొదలెట్టింది. ఆపళంగా రైలువాడు "ఏడిశావు, నడుద్దూ, నీ యిష్టం ఏముందీ!" అన్నట్టు చెవులు గింగురెత్తేలాగు రైంయ్యిమని గావుకూత ఓటేసి, రైల్ని నసాళం అంటేటట్టు ఒక్కటేశాడు. దాంతోటి పాపం రైలు నెమళ్ళు కక్కుగుంటూ పరిగెత్తడం మొదలెట్టింది. కావలసినంత బలం ఉంది రైలుకి! ఉంటేం ? అన్ని పుట్ల ఇనపసామగ్రీ కూడా ఒక్క నరమానవుడు ఎల్లా చెబితే అలావింది, వొదిలిపోయింది. నాకేమైందీ ? రైల్లో పడ్డానికి కాదూ సహళతొక్కుళ్ళటాజరిగిందీ, ఆ మట్టున కిటికీలోంచి కొడుతూన్న ఆ ప్రభాతమందపవనం ధర్మమా అని కళ్ళు ఇట్టేమూతడి ఊరుకున్నాయి. నిద్దర కూర్చున్నప్పుడు మరీవొస్తుంది. ఒక్కొక్కప్పుడు కూర్చుంటేనేగాని రానేరాదు, దాంతగలెయ్యా! అల్లాగే కాస్సేపు జోగి, ఓతభరకా, ఆ కునికి పాట్ల షికారులో నేను మరీ జోరుగా కుడిపక్కకి ఒసిలేసరికి గభీమని మెణుకువ చక్కావచ్చి, "ఎక్కడికొచ్చాం?" అన్నాను. అంటే "ద్వారపూడి దాటాం!" అన్నాడు మా పెత్తండ్రిగారివాడు. ఏమోగాని, "ద్వారపూడి" అనేది చెవిని పడ్డంతోడే నాకు మహాభయం వేసిపోయింది చెప్పద్దూ! అప్పడే రొండోమాటు వినడం మరి ఆపేరు. అనేంజేశాడూ మావాడూ! నేను పైన తగిలించిన నాకోటుజేబులో __ పొడుంకాయకోసమే అని జ్ఞాపకం__ నిమ్మణంగా చెయ్యెట్టాడు. పెట్టేటప్పటికి టిక్కెట్ల దొత్తర తగిలింది; యథాలాభంగా అది పైకి తీశాడు. అప్పటికి తెల్లగా తెల్లారింది తీసిచూసి, "ఇదేమిట్రా, ద్వారపూడీ!" అని చదివాడు. అయ్యా చెబితే మీరు నమ్మరూ! నాకు ఒళ్ళునీరైపోయి ఉపద్రంగా భయం, దారుణంగా కోపం బయల్దేరాయి. వాడు, సరి ఆ టిక్కట్టు వెనక్కి పెట్టి తరవాత దానికేసి చూసి "ద్వారపూడి" అని మళ్ళీ చదివాడు. "టిక్కట్లమ్మే ద్రోహిగా, ఎంతపనిజేశావురా, నీమొహాన్ని జీడెట్టా!" అనుకున్నాను. నాకళ్ళు చింత నిప్పులులా అయిపోయాయి. మావాడూ ఒక్కొక్క టిక్కట్టే తీస్తుండడం చిలక్కిమల్లే "ద్వారపూడి, ద్వారపూడి" అని చదువుతూండడం లంగించుకున్నాడూ! అల్లా పన్నెండు టిక్కట్లు ద్వారపూడికని చదివాడు. చదివి, "ఒరేయి, ఇంకామూడు ఎక్కువ ఉన్నాయి యెందుకురా?" అన్నాడు. అనీ, అవి మూడూ కాకినాడకని చదివాడు. అంతాకూడా ఊరికే విస్తుపోయి ఊరుకున్నారు. మా రొండో తమ్ముడు నాకేసి తిరిగి "ముందొచ్చిన మీ ముగ్గురికీ టిక్కట్లు పుచ్చేసుగున్నావా ఏమిట్రా, లేదనుకుని నేను పన్నెండు చెప్పానూ!" అంటూ సర్దడం మొదలెట్టాడు. "ఏడిసినట్టే చేశావు! ఇంతేపన్లు! దమ్మిడీ సాయంలేదు. మా గొడవెందుకు, తరువాతొచ్చిన స్వరూపాల సంఖ్య నేనడిగితేనూ!" అని నేను లేచాను. "ఒరేయి, నువ్వూ చదువుకున్నవాడివేగదా! నేను 'పన్నెండు' అనేటప్పుడు " నేను ఇల్లా ఇల్లా మా ముగ్గురికీ టిక్కట్లు పుచ్చుగున్నాను. కడం వాళ్ళెందరూ?" అని నాతో చెప్పి మరీ అడగద్దుట్రా? అది చెప్పదా! పోనీ, ఏవో కొన్నవాడవు ఎల్లానూ కొన్నావు గనక చూసుగోవద్దా, అవి ఎక్కడికిచ్చాడో?" అంటూ మావాడు అందుకున్నాడు. "ఏముంది వొర్థి భడవారకం,

తెలివి మద్దెపు దద్దమ్మలు వీళ్ళు?" అంటూ కుర్రాళ్ళమీద నేను, " నీ పెద్దతనం మట్టుకు? ఉన్నమాట మనస్సులో పెట్టుగుఇదయావు?" అంటూ వాళ్ళు. ఇంతలో ఆడవాళ్ళు, "ఇందులో తక్కువ తిన్నవారెవరు? అందరి ప్రయోజకత్వాలూ ఒక్క టాకీగానే ఉన్నాయి, అడగాలీవేరేను?" అని ఈసడింపులు మొదలెట్టారు. నాకు రావణారేచిక్క వేసింది. అంతా స్వజనం అయిపోవడం వల్ల ఊరుకున్నానుగాని, లేకపోతే ఒక్కొక్కర్ని ఇల్లా చీరేసుందును.

రెండోకంటివాడెరక్కుండా, గుడ్డనీళ్ళు కుక్కుగుని, ఈ సంగతి కప్పెట్టేసి పైకి మాములుగానే కనపడగలిగితే వ్యాపారం దివ్యచకోరంగా ఉండేది, సరిపోయేది. కాని అబ్బే, మేమా! వాదన ప్రతివాదనలతో హోరు జోరైపోయింది. వాటిముందు రైలు చప్పుడు చప్పబడిపోయింది. రైలు ఆగిందో, నడుస్తోందో, బోల్తా వేసిందోకుడా మాకు నిమిత్తం లేకుండా పోయింది. గొడుగా పాయె. టిక్కెట్లా మూడు దండగాయె. కడంగా ద్వారపూడికి తగులడ్డాడాయె, వాడి ద్వారపూడి దొంగల్దూరా ! ఓటైతే ఏడుద్దు ! అక్కణ్ణించి 'చాల్లే తెలివి' అంటే 'చాల్లే తెలివి' అనుకుంటూ, 'నీ మూలాన్నే' అంటే 'నీ మూలాన్నే' అనుకుంటూ, ఒకరిమీద ఒకరు నేరం మోపుతూ, అడ్డమైన హడావిడిలోనూ పడిపోయాం. రైలెప్పుడో సామర్లకోట స్టేషన్లో ఆగి ఊరుకుంది. ఉత్తరక్షణంలో శుద్ధ ఖంగారుతో, లోపల గొణుగులు, పైకి ఉఋములు, రుసరుస, తీవ్రంగా చూపులు, చేతులో వస్తువు నేలనెట్టి కొట్టటం వీట్లతో అతి కోలాహలంగా కొందరం దిగి ఆడవాళ్ళనీ పెట్టెల్నీ దింపడం _ ఇల్లా మొదలెట్టామో లేదో ఇంకా, ఆపళంగా యమకింకరుడులాగా బాగా ఓ తాడిచెట్టంత మనిషైతే చక్కా వచ్చి, మా సంగతి వాడెల్లా విన్నాడో, వినకుండా పసేపట్టాడో ముందావాడు_ఊచిపుచ్చుగు లెంపకాయ లాగినట్టు, "టిక్కెట్, సార్" అన్నాడు నన్ను. ఇంకా మేం దిగీ దిగకుండా ఉన్న అవస్థలో ఆఫీసరునైన నన్ను ఒక అల్పుడు ఇల్లావొచ్చి దుయ్యబట్టుగోనా అని నాకు పట్టరాని రోషం వచ్చింది. అయితే మాత్రం, రోషాలు పనికొస్తాయా, ఆవేశాలు పనికొస్తాయా చేతులారా చేసుగున్న తరవాత, చెప్పండీ! అప్పుడు, నేను టిక్కట్టు ఉన్నవాడి బాబులా నటిస్తూ ధిమాకీగా చిరునవ్వుతో, "ఉండవయ్యా! దయచే, దిగనీ ముందూ!" అన్నాను వాడు తొందరగా ఇంకోర్ని అడగడానికి విరగడైపోతాడేమో అని. అంటే, అబ్బే వాడెక్కడొదుల్తాడూ! మమ్మన్నే పట్టుగున్నాడండీ తిన్నగా వచ్చీ! ఎల్లా పోల్చాడో, వాడి తస్సాగొయ్యా, వాడిదా మరి ప్రజ్ఞా, తక్కినవాళ్ళదా ?

పెట్టెలు దింపారు, చివరికి కరకమ్మగారి తల్లిని గూడా కిందికి సాయం పట్టారు, అనగా రైల్లోంచి. దాంతోటి, అరిటిగెల దింపడం పనికూడా అయిపోయింది_అంటే ఆవిడ ఒళ్ళో పెట్టుగు కూర్చుంది కాదూమరి గెలా! ఇంతలో రైలు కాలకృత్యాలు తీర్చుగుని, ఊగిసలాడి, కూసి విరమించింది. మేం, ఇహ, మమ్మల్ని పట్టుగున్న మనిషి దెయ్యాన్ని వొదిలించుగుని, కాకినాడ టిక్కట్ల గొడవ చూసుగుని ఆ రైల్లో వేరం వెళ్ళిపడాలీ అనుకుంటూంటే, ఏం జేసిందీ కరకమ్మగారూ! మాంచి దెయ్యమల్లా చూపూ ఈవిడానూ, "అయ్యో, హయ్యో, అయ్యో, హయ్యో" అంటూ మొదట చిన్న చిన్న కేకలెట్టి, అక్కణ్ణించి, ఏమని చెప్పను, ఓ తరవాయి లేకుండా, ఓకూమ స్వరాలుగావు, ఓ దీర్ఘాలుగావు, ఓ రాగాలు గావు, మాదుంపతెంపి, పెద్దపెట్టున శోకన్నాలు లంగించుగుంది, కొండవిరిగి మీదపడ్డట్టూ! మాములుగా నేను కోపిష్ఠినీకాను, ఏతత్పూర్వం ఆవిడతో ప్రసంగించాలేదు. కాని, రంగం మారిందిగా ! అక్కడితోటి నేను పళ్ళు పటపటా పిండెల్లా కొరుకుతూ, "నువ్వెక్కడ దాపరించావమ్మోయ్, మంచి శనిలాగోయ్! నీకేమి ఏక్షెత్తు వచ్చిందమ్మోయ్, నీకేమి ఉప్పెనవచ్చిందమ్మోయ్, అంత ఏడుపుకోయ్?" అంటూ గుక్కతిరక్కుండా గర్జించడం మొదలెట్టాను. "టికేట్, టికేట్" అంటూ టిక్కెట్ల సైతాను సందించడం మొదలెట్టాడు. "నా భవిష్యం అంతా మట్టికొట్టుకు పోయిందండోయ్! నా వెండిబంగారాలకీ నాకూ ఏడబాపులు వచ్చాయండోయ్ ! ఇంతమందున్నారు మళ్ళీ, ఆస్తి పిట్టలాగ లేచిపోతూంటే పట్టుగోలేక పోయారండోయ్!" అంటూ కరకమ్మ మరీ గోల చెయ్యడం మొదలెట్టింది. పిట్టకొద్ది, కూత ఘనం అన్నట్టు ఇంతంత పొలికేకలూ నాటు మేకులా ఉన్న కరకమ్మ చెయ్యగలదని నేను లోగడ ఎరుగున్న వాణ్ణే కానైతే. అప్పట్లో పోనీ అది పబ్లీకు స్టేషను గందా కాస్తవడి తగ్గించుతుందేమో అని భ్రమించాను. భ్రమిస్తే! హెచ్చించింది తస్సాగొయ్య. నాకు వొళ్ళు భగ్గుమని రవిలిపోయి ఆ పైషడ్జమంలో నేనూ అందుకున్నాను. అందుకుని, "నీది పోయిందేమిటమ్మోయ్, అసలోయ్ ! మాతో ఆమాట చెప్పి తగులడవమ్మోయ్ ! శుభానికి

వెడుతూంటే నీ ఏడుపు బాజాలేమిటమ్మోయ్ ! ఓ ఘాయిత్యం కూడానూ ! నువ్వేమిటమ్మా మాకోయ్ ! పెళ్ళి కెడుతూ పిల్లిని చంక నెట్టుగువెళ్ళినట్టు నిన్ను పట్టుగొచ్చారేమిటమ్మోయ్, మా వాళ్ళోయ్ ! పెళ్ళిలో దెబ్బలాటలు పెళ్ళి కొడుక్కీ పెళ్ళి కూతురికీ తప్ప కడం వాళ్ళందరికీనమ్మోయ్!" అంటూ జ్వాలాతోరణంలా చెలరేగి పోయాను. "నా టముకు పెట్టి రైల్లో కొట్టుకుపోయిందండోయి. అందులో ఉన్న రొండువందలకీ తిలోదకాలైనాయండోయి" అని కరకమ్మ బాహాటంగా ఏడుపు సాగించి, నెత్తి బాదుకుంటూ చెప్పడం మొదలెట్టింది. సరి, యీ యేడుపులో తల్లికూడా మూలుగుతూ మద్దత్తైంది. మద్దత్తై, వణుకుతూ "మందో వాళ్ళదో చూసి మరీ ఏడవ్వే అమ్మాయోయ్, అనవసరంగా ఏడిస్తే తరవాత మళ్ళీ ఏడవాలి" అంటూ కూతురుతో సలహా. అక్కణ్ణించి నేను "అపృచ్ఛపుమాటలెందుకమ్మా! ఇరవై పెట్టెలు దిగాయికందా మావి, నీకు ఒక్కగాని ఒక్క పెట్టాయిరి (తలగడా అంత)? మమల్ని చంపుకు తినడానికి కాకపోతే, నీకొచ్చిన యేళ్ళకి, అదొక్కటీ నువ్వు దాటపెట్టుగోవాలీ, చెప్పూ! గెల అముసిలిదే పట్టుగుందికదా, నువ్వు చేస్తూన్న ఉద్యోగం ఏమిటి, వెధవ ఉద్యోగం నువ్వూను!" అల్లాగ – ఇల్లాగ అంటూ నేను మండిపడ్డాను. ఏమడుగుతారు కథా! నేనేమో కారాలూ మిరియాలూనూ, ఆవిడా తల్లీ హాలో లక్ష్మణా అని ఏడుపులూ పెడబొబ్బలూనూ; పక్క టిక్కట్ల తణికీ వాడు సతాయింపూ! మావాళ్ళు "ఊరుకోరా, అబ్బా! ఊరుకోవమ్మా!" అంటూ. ఊహూ లబాయిలూ దిబాయిలూనూ ! ప్లాట్ ఫారం మీద ఆశేషజనం ఆశ్చర్యం వేసిపోయి నవ్వులకి పడ్డారు. అప్పుడు, మహారసకందాయపట్టులో ఉంది వ్యాపారం, అని చెబుతోచ్చారు, పైవాళ్ళు!

ఇల్లా నడాడుతూంటే, ఆ కాకినాడ రైలుకాస్తా ఉడాయించేస్తుందేమో అని చెప్పేసి, మావాడు_ నా తరవాతవాడు_ వాడి దగ్గిర(ఏమాటకామాటే ఛెప్పుగోవాలి) బాగా కార్యనిర్వాహకత్వం ఉందీ!_ టిక్కట్లపంతుల్ని కాస్త అసింటా లాక్కెళ్ళి లోపాయికారీగా వాణ్ణి సంతోషపెడతానని వాడికి ఆశపెట్టి వాడిచేత ఇంతమందికీ (సరే, మరిమండినట్టే ఉంది! ముగ్గురికి అహోరించాయిగా! కడంవాళ్లకే) టిక్కట్లు తెప్పించి, వాడికేదో ముట్ట చెప్పి, ఓ రోండు కరుకురూపాయిలు స్టేషను మేష్టారు పాదాలదగ్గిర పారేసి, కరకమ్మని తీసిగెళ్ళి ఆయనకి అప్పచెప్పి_ రాజమండ్రీనించి తమతో కలిసి కాకినాడ ప్రయాణం చెయ్యదలచి కూడా వస్తున్న ఆ మనిషి తాలూకు కిమ్మతయిన ఓ ట్రంకుపెట్టి ఒఖ్ఖ అజాగర్తవల్ల చెయిదాటి వాల్తేరు కేసి కొట్టుకుపోయిందనీనీ, అది వెనక్కి తెప్పించిపెట్టి ఆవిడికి అందజేసి పుణ్యం కట్టుకోమనీని ఆయన్తో అనేసి, బతుకు జీవుడా అని అక్కడ ఆవిణ్ణి వొదిలించేసుగుని, మేం అంతా ఈ లోపుగానే ఎక్కి నిరీక్షిస్తున్న పెట్టిలోకి ఇహ రైలు కదుల్తోందీ అనే వేళకి వచ్చిపడ్డాడు. కరకమ్మ తల్లీ, వాళ్ళ బంధువులెవరో కాకినాడ వాళ్ళు కనబడితేనూ, అరిటిగెల ప్రాణప్రదంగా పుచ్చుకుని మూలుగుతూ వాళ్ళ పెట్టిలోనే కూర్చుంది. సరే, మేం కాకినాడ జేరుకున్నాం మెట్టుకి.

ఆ సాయంత్రం రైల్లో వస్తానన్న మా స్నేహితుడు రాత్రి లగ్నం గనక కాస్తకద్దనగానే వచ్చి తరవాత వృత్తాంతం తను చెప్పాడు. అయిదింటికి ఆయన సామర్లకోటస్టేషను ప్లాట్ ఫారం మీద విహితుల్తో కలిసి మాటాపలుకూ ఆడుకుంటూంటే, గాళుపు కొట్టినట్టు మొహం ఎండిపోయి, కళ్ళు బాగా ఇంతలోతుకి దించుకుపోయి కరకమ్మగారు చక్కా వచ్చి, ఆయనతో (పొద్దున్న జరిగిన సంగతి సాయంత్రం వచ్చే ఆయనకి కొట్టిన పిండైనట్టు) "దొరికిందండి పెట్టి, పట్టుగున్నారు, పాపం! ఏమీ పోలేదు. అరిటి గెల ఎక్కడుందో మీకు తెలుసా" అందిట. "పెట్టేమిటి, అరిటిగెలేమిటి" అన్నాట్ట ఆయన. అంటే, "మా అబ్బాయి వచ్చాడుగా, మా తమ్ముడూ! మా తమ్ముడికి జీతం! వాడొచ్చి నా పెట్టి టెల్లిగ్రాఫులో తెప్పించాడు." అని మళ్ళీ అందిటావిడ. అప్పుడు, "అయితే ఏమంటారు? పెట్టేమిటి? అరిటిగెలేమిటి ? అబ్బాయేమిటి? ఇదంతా యేమిటి?" అని ఆయన తరిచి తరిచి అడిగిన మీదట గావును, ఆవిడ తన పెట్టి తప్పిపోడం ఏదీ! సంగతీ, సందర్భం, దొరకడం, అరిటిగెల తమదే అనీ, అది వాళ్ళమ్మ ఎక్కడేనా వొదిలేస్తే, పెళ్ళివారు జాగర్తచేసుకుని తలో అత్తం మడిగట్టుకుని నోట్లో వేసుకుంటారేమో అని తనకి భయమనీ, కూలివాడికి డబ్బులిచ్చేసి మేమే అది తమబాసలో పడెయ్యవలిసి ఉంటుందనీ, ఏమిటేమిటో చదివిందిట. కాని, ఆ చవటగెల

ఎవడిక్కావాలీ? పైగా, ముసిల్ది ప్రాణమేనా వొదుల్తుందిగాని, గెలవొదిలి పెట్టి ఒక్క క్షణమేనా ఉండందే అసలు! సరి, గెల ముసిల్దే పట్టుకుపోయిందని మా స్నేహితునితో చెప్పేశాం, అక్కణ్ణించి, "ఓరి మన కంగారు బంగారం గానూ" అనుకోడం మొదలెట్టాం.

పెళ్ళిపీడ దీంతో వొదిలింది మాకూ అన్నట్టు పెళ్ళి లక్షణంగానే జరిగింది. అంతా చివరంటా సవ్యంగానే ఉంది. ఆఖరికి, మరోమాట ! మేం కాలక్రమాన్ని రాజమండ్రీ వచ్చేసిన తరవాత, ఇక్కడ తప్పు టిక్కట్లు ఇచ్చినాయన, పాపం, జ్ఞాపకం చేసుగుని మాకు డబ్బు ముదరా ఇచ్చేశాడు. బండీవాడు_ పోనీ, బండీ ఆయన_గొడుగు మాకు వాపసు చేసి తనబేడా పట్టుగెళ్ళాడు. కాని, "టెలిగ్రాం తాలూకు ఇచ్చిన రొండురూపాయలూ మట్టుకు కరకమ్మగారిదగ్గిర వసూలు చెయ్యలేక పోయానుగదా, తస్సాచెక్కా!" అని కొంతకాలం నేను అనుకోవలసిన అవసరం వచ్చినా, పాపం, ఆవిడా ఇచ్చేసింది. అవాంతరాలూ, ఒడుదుడుకులూ మధ్య మధ్యే గాని చివరికి, అబ్బే, ఏం లేదండీ !




# క్షమించాను

## కొమ్మూరి వేణుగోపాలరావు

## (ఆంధ్రసచిత్ర వారపత్రిక 1957 జనవరి 1 సంచికనుంచి పునర్ముద్రితం)

"మిమ్మల్ని క్షమించాను"

★ ★ ★

చీకటి గదిలో ఆదిశేషయ్యగారు వంటరిగా ఈజీచైర్ లో కూర్చుని ఆరాటంగా అటూ ఇటూ మెదుల్తుండగా, అప్పుడే బండీదిగి, చేతిసంచితో, రేగిపోయిన జుట్టుతో, కళావిహీనంగా వున్న ముఖంతో, తడబడుతున్న అడుగులతో లోపలకు ప్రవేశించిన శకుంతల వణుకుతున్న చేతుల్తో లైటు వెలిగించి, ఆ దుర్భరస్థితిలో కూర్చునివున్న తండ్రిని చూసి నివ్వెరపోయి "అమ్మకి ఎలా వుంది నాన్న?" అని ప్రశ్నించింది ఆతృతగా.

ఆయన ఉలికిపడి, మ్లానవదనంతో అటుకేసి చూచాడు. కాని "వచ్చావా?" అన్న ప్రశ్నార్థకం అందులో లేదు. ఇంత ఆదుర్దాగా వచ్చిన కూతురిని ఏమని సంబోధించి ఏం చెప్పాలో పాలుపోవటం లేదు. "నాన్నా!" అంది కూతురు భయంగా. ఆయన అయోమయావస్థ యింకా ఎక్కువైంది. ఎడమచేత్తో లోపలకు పొమ్మని సౌంజ్ఞ చేయటం మినహా ఏమీ ఆచరించలేక తడబడుతూ వూరుకున్నాడు. ఆమె తేజోవిహీనంగా ఓ క్షణం తండ్రిముఖంలోకి చూసి, సంచీ అక్కడే జారవిడిచి, లేని శక్తి తెచ్చుకుని, కంగారుగా లోపలకు వెళ్ళిపోయింది. ఆయన బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు. "మిమ్మల్ని క్షమించాను! మిమ్మల్ని క్షమించాను!! మిమ్మల్ని క్షమించాను!"

కళ్ళు తెరిచాడు. అయ్యో! దీపం వెలుగుతోంది.

★ ★ ★

డాక్టర్ మందంగా నడిచి గేటుదాటి వెళ్ళిపోయాడు. పార్వతమ్మ మంచంమీద పడుకుని వున్న విశాలమైన గదిలో బెడ్ లైటు మాత్రం వెలుగుతోంది సన్నగా. ఆదిశేషయ్య గారు కిటికీ దగ్గర నిలబడి గేటుమీదుగా బయట చీకటిలోని శూన్యంలోకి చూస్తున్నాడు. డాక్టర్ రెండు నిముషాల క్రితం వెళ్ళిపోవటం అస్పష్టంగా కనిపించింది మసక చీకటిలో. చీకటి ప్రథమదశ, జీవితం చివరిదశ, విషాదంగా వుంటాయి.

"చలి వేస్తోంది, తలుపులు మూసివేయరూ?"

ఆయన చప్పున తలుపులు మూసివేసి వెనక్కుదిరిగాడు. నెమ్మదిగా భార్యమంచాన్ని సమీపించి "దుప్పటి కప్పేదా?" అనడిగాడు ఆదరంగా.

"వద్దు. కాని పెద్దలైటు వెలిగించరూ?" అని ఆమె కోరింది బలహీన స్వరంతో.

"వద్దు దీపం వెలుగు నీకు పరిశ్రాంతి కలిగిస్తుంది"

"అబ్బ! చీకటిలోనే చచ్చిపొమ్మంటారా ఏమిటి? యమదూతలు వచ్చే వైనం ముందుగనే కనుక్కొని మీతో కొన్ని కబుర్లు చెబుతాను"

కొంచెం ఆలోచించి, చేసేది లేక, పెద్ద లైటు వెలిగించి వచ్చి దగ్గరగా కూర్చున్నాడు.

"మీ ముఖం అంత దిగాలుపడి ఉందేం? డాక్టరుగారేమైనా చెప్పారా?"

ఓ క్షణమైనా తిరగకముందే, మళ్ళీ తనే ఓ మ్లానమందహాసం చేసి "మా అమ్మకు అమ్మవారు సాక్షాత్కరించేవారుట. అటువంటి సమయంలో పరమేశ్వరుడు గరళాన్ని నిర్లక్ష్యంగా మ్రింగినట్లు యింతింతకర్పూరం మ్రింగివేసేది. ఓసారి అమ్మవారు మా అమ్మతో అందిట. "నీ అంత్యదశ దుర్భరంగానూ, నీకూతురి అంత్యదశ సుఖపూరితంగానూ గడుస్తుందని."

"అబ్బ ఊరుకో .. నీకు పుణ్యం వుంటుంది."

"అమ్మాయికి నాకు చెప్పకుండా ఎందుకు టెలిగ్రాం ఇచ్చారు? పనికుర్రాడు చెప్పాడులెండి."

"ఊరికే నే... సరదాకి."

"నా జీవితంలో రెండే రెండు టెలిగ్రాములు వచ్చాయి మీ విలాసానికి. ఒకటి అమ్మ చచ్చిపోయినప్పుడూ, రెండవది నాన్న పోయి బైరాగుల్లో కలిసినప్పుడూ. ఇప్పుడు అమ్మాయికి ఒక టెలిగ్రాము వెళ్ళింది... రెం...డ.."

"పార్వతీ!"

ఆమె తక్షణం మాట్లాడలేకపోయింది. గాద్గధిక కంఠంతో యిందాకటినుంచీ మాట్లాడుతున్నదల్లా, పొడిదగ్గు వచ్చి ఆయాసపడుతూ పడుకుంది. ఆయన నిర్భ్రాంతత యింకా వదిలిపోక, చూసేసరికి వృద్ధాప్యంవల్ల కొంతా, జబ్బుచేత మరికొంతా జీర్ణరేఖలు స్థావరం ఏర్పరుచుకున్న ఆ వదనంలో విషాదం కన్నీళ్ళై సెలయేరులా పారుతోంది. ఆ అశ్రువులు రక్తమిశ్రితమైనవి అయివుంటే, ప్రకృతిదేవత కొట్టిన కఠినమైన సుత్తిదెబ్బ సరిగా మస్తిష్కం మీద తగిలివుండాలి.

"అబ్బా!" అందామె వేదనగా.

"ఏమిటి? ఏం జరిగింది?"

"నాలో ఏదో తుఫాను చెలరేగింది."

"ఇంకా?" అని కేవలం మనసులో అనుకున్నాడాయన.

"ఆ తుఫాను నీళ్ళకు నేలమీద మట్టితడిసి, చెదిరి అడుగున వున్న గచ్చురాళ్ళు బయటపడుతున్నాయి."

"పార్వతీ! ఇదంతా నీవు సరిగ్గా చూడగలుగుతున్నావా?"

"ఆ! నేను చూసినంత స్పష్టంగా వివరించలేకపోతున్నాను" అని ఆమె ఆకస్మికంగా తెల్లబోయి "నా జీవితకాలంలో నేను మీతో ఇంత చనువుగా, విపరీతంగా మాట్లాడనేలేదు. ఇంతజబ్బూ పడలేదు. ఒకరికి జబ్బు చేసినపుడు వారిచుట్టూ వున్నవారు సన్నిహితులూ అవుతారు, దూరంగానూ జరుగుతారు. మనం ప్రథమావస్థలో వున్నాము. ఇది మీ ఔదార్యం" అంది.

ఆయన ఆలోచిస్తూ బాధగా "నిజమే. నా జీవితకాలంలో నిన్నెపుడూ దయగా చూడలేదు" అన్నాడు.

"నా మాటలకు ఆశ్చర్యపడుతున్నారా?"

"లేదు. చెప్పు."

"మీరు చెప్పండి. వింటాను"

మొదట ఆశ్చర్యపడినా, కొంత చెప్పాలనుకుంటూ భార్య ముఖంలోకి ఏకాగ్రతతో చూశాడు... ఈమెకు యిప్పుడు యాభయి యేళ్ళు సమీపించాయి. తనకన్నా అయిదేళ్ళు చిన్న. ఇంచుమించు ముప్ఫయి అయిదు ఏళ్ళ క్రితం తనతో సంసార యాత్ర ప్రారంభించటానికి వచ్చింది. తామిద్దరూ కలిసి ఎన్నో సుఖాలూ, కష్టాలూ పడ్డారు. ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నారు. ఇన్ని సంవత్సరాల జీవితంలోనూ ఆమె తనమాటనెన్నడూ జవదాటలేదు. తనకెప్పుడూ ఎదురుచెప్పలేదు. క్రోధావేశంలో హింసించినా ఒక్క మాటయినా పన్నెత్తి పలకలేదు. ఈమె స్వాభిమానం మరిచిపోయింది. తానేదైవం అని కొలిచింది. ఒక్కొక్కప్పుడు ఆ అమాయకమైన శరీరం మీద చేయి చేసుకున్నాడు. తాను...!

కష్టమ్మీద కన్నీళ్ళను నిగ్రహించుకుంటూ మళ్ళీ ఆలోచించసాగాడు. ఈమె తన భార్య, తనను మనస్ఫూర్తిగా ప్రేమించింది. ఒకసారి తనకేదో వ్యాధివచ్చి నెలల తరబడి మంచం మీద ఉన్నప్పుడు నిద్రాహారాలు మాని సపర్యలు చేసింది. తనకు తెలిసినంత వరకూ హిందూ సంప్రదాయం అంటే యిదీ అని ఆమెకు ఎవరూ నేర్పినట్లు లేదు. ఇది అనాదినుంచీ అనుశ్రుతంగా వస్తూన్న స్త్రీ హృదయాలోచన పెట్టిన భిక్ష. ఈమె అందంగురించి తనకు వ్యామోహం లేదు. తాను యాభయి అయిదేళ్ళ క్రితం పుట్టిన వాడు కావటం చేత సౌందర్యాన్ని గురించి ఆలోచించే అభ్యాసం తనకు లేదు, అప్పుడప్పుడు పరాయివారి అందచందాలని గురించి ఆలోచించేవాడు గాని, 'సౌభాగ్యం' అని లోకులు పిలుస్తారే, ఆ యీ లక్షణాలు ఆమెకు ఏ శక్తి అన్యాపదేశంగా ప్రబోధించిందో అటువంటిదే మరోశక్తి తనకు ఎవరూ యివ్వని హక్కులున్నట్లూ, అధికారం వున్నట్లూ, అది తనసొత్తు అనీ బోధించి చలాయింపజేసింది. వాటిల్లో కొన్ని మాత్రం తండ్రి దగ్గర నుంచి అనాలోచితంగా నేర్చుకున్నాడు; ఆరోజుల్లో తల్లిని హింసించేటప్పుడు ఆయనపై కోపగించినా కూడా.

తమ ముప్ఫయి అయిదేళ్ళ సమిష్టి జీవితం ముగిసిపోయే తరుణం ఆసన్నమైంది. ఒక రాత్రి, రెండు రాత్రులు యిలా వ్యథాపూరితంగా గడిచిపోతాయి. తరువాత దయలేని ఓ భూతం వచ్చి చుక్క పెడుతుంది. ఒక ఎండిన మొండి మ్రానుమాత్రం జీవచ్ఛవంలా బ్రతుకుతుంది. ఈమె తన సహచారిణి... ఈమెకు యింతవరకూ ఎలాంటి ఉపచారమూ చేసి ఎరుగడు. చేయాలన్న ఉబలాటం పొంగిపోతోంది ఇప్పుడు. కాని...! తామిద్దరూ ముసలివాళ్ళయారు. ఒకరికొకరు తోడునీడగా, అండగా నిలవవలసిన సమయం ఇది. చివరికి ఇలా అనుకున్నాడు. "ఇన్నాళ్ళ నుంచీ యిది యిలా జరగాలి కాబట్టి జరిగి పోయింది. మా దాంపత్యం అనుకూలమైనదనే అంతా అనుకుంటూ వచ్చారు. ఎంత కాదనుకున్నా యిది నిజమేనని నా మనసు ఘోషిస్తోంది. ఆబద్ధమని నన్ను నేనెందుకు మోసగించుకోవాలి? మా జీవితంలో లోటు ఏమీ లేదు. ఇది నా అదృష్టం."

ఈ చివరి ఆలోచన కలిగేసరికి యీ అదృష్టంలోని అంతరార్థం మనసుని కలచివేసి, యిహ కన్నీళ్ళు నిగ్రహించుకోలేకపోయాడు.

"ఏడుస్తున్నారా?" అంది ఆమె అది చూసి.

"నిన్నొక్క ప్రశ్న అడిగేదా?"

ఆమె ఓ నిట్టూర్పు విడిచి "మీరు ఇదివరలో అనేక చిక్కు సమస్యలను ఎదుర్కొన్నపుడు ప్రతిసారీ నా సలహా కోసం అనేక ప్రశ్నలు వేసేవారు. నేను అది పరమ భాగ్యంగా యెంచి నా బుద్ధినంతా వుపయోగించి నానా అవస్థపడి జవాబులు చెప్పి మీముఖంలో ఎటువంటి భావాలు మెదుల్తున్నాయోనని ఆతృతగా చూసే దాన్ని. ఏనాటికైనా అక్కడ సంతృప్తి చిహ్నం కనిపిస్తుందని నా ఆశ. కాని ఒక్కనాడూ మీ ముఖకమలం వికసించలేదు. ఒక్కసారీ నా సలహాప్రకారం ఆచరించలేదు. అసలు నా ప్రత్యుత్తరాలు వినాలన్న జిజ్ఞాసే కనిపించేది కాదు నాకు మీలో... అవి మీ ప్రశ్నలు కావు. కేవలం స్వగతాలు. "

"నేనడుగదలచుకున్న ప్రశ్నకు చేరువగా తీసుకువచ్చావు ప్రస్తావన. పార్వతీ! నువ్విపుడు పదిహేనురోజులనుంచీ మంచం మీద పడివున్నావు. మనమిద్దరం యీస్థితికి లాక్కోబడివచ్చి ఇలా విచిత్రంగా కబుర్లు చెప్పుకుంటామని ఏనాడూ నేను అనుకోలేదు" ఆయన గొంతు జీరవోయింది. ఒక్క క్షణం కల్లోలమై వున్న మనస్సును పదిలపర్చుకున్నాడు. "నేను నీ యెడల చాలా అపరాధాలు గావించాను. అవి తప్పనిసరిగా మగజాతి అభిజాత్యంతో ఆచరించాను. కాని అన్ని సన్నివేశాలలోనూ నువ్వేనాడూ నాకెదురు తిరగలేదు. ఆ గడబిడలు జరిగిన మరునాడే నేను ప్రేమగా పలకరించేసరికి పరవశమై సర్వం మరిచి నాతో కలిసిపోయేదానవు. ఇంత ఓర్పు నీకెలా వచ్చింది? నేను అన్ని అత్యాచారాలు చేసినా నన్నెలా ప్రేమించగలిగావు? చెప్పవూ?"

పార్వతమ్మ భర్తవంక విస్మయపాటుతో చూసింది. వెనువెంటనే ఆమె ముఖం పాలిపోయింది. నేత్రాంచలాలల్లో కొద్దిగా కన్నీరు చింది ఏటవాలుగా ప్రవహించింది. కాని అది కొద్ది క్షణాలపాటు మాత్రమే. క్రమ క్రమంగా ఆమె ముఖం నిండి తేజోవంతమైంది. సంశయం నశించి ధృఢనిశ్చయం ద్యోతకమైంది.

"ఈ ప్రశ్నకు జవాబు ఒక్క వాక్యంలో ఎలా చెప్పను? ఇలా రండి. నాకు బాగా సమీపంలోకి వచ్చి కూర్చోండి."

ఆయన మంచంమీద ఆమెకు మరీ చేరువగా జరిగి, స్థబ్ధంగా చూస్తూ కూర్చున్నాడు.

ఆమె చెప్పసాగింది.

"నేను యీ యింట్లోకి కాలు పెట్టటమే విచిత్రంగా జరిగింది. నాన్న యింటివిషయాలు అసలు పట్టించుకోకుండా వుండటమే కాకుండా చీటికీ మాటికీ అమ్మని చెయ్యి చేసుకుంటూ వుండేవాడు. అప్పటికి మట్టుకు ఆమె ఏడ్చి ఆయన మళ్ళీ తనను పలకరిస్తే సద్భాగ్యమని తలుస్తూ ఆయన అనుగ్రహం కోసం నిరంతరం సతమతమౌతున్నట్లు నాకనిపించేది. నేను ఎప్పుడూ ఒంటరిగా కూర్చుని ఆమె దుఃఖాన్ని గురించి అమాయకంగా ఆలోచించటమేగాని, దగ్గరకు వెళ్ళి ఎప్పుడూ కలగజేసుకోలేదు... నాకు పధ్నాలుగేళ్ళ వయస్సు వచ్చాక నా వివాహం కోసం అమ్మ ముప్పొద్దులా తాపత్రయపడేది. నాన్నమాత్రం ఏమీ పట్టించుకోకుండా నిశ్చింతగా తిరిగేవాడు. మాది పల్లెటూరు కావడం వల్ల యిరుగూ పొరుగూ వాళ్ళు నాకింకా పెళ్ళి కాలేదని దెప్పి పొడుస్తూ వుండటం నాకు దుస్సహంగా వుండేది. అమ్మ ఒకసారి నాన్న కాళ్ళమీదపడి బిగ్గరగా ఏడుస్తూ మొరపెట్టుకుంది. ఆయన చాలాసేపు చీదరించుకుని, ఎంతసేపటికీ పాదాలు వదలక పోయేసరికి దయ తలిచినట్లు 'సరే' అని, అప్పటినుంచీ వారం రోజులు తిరిగి ఒకరోజున మీ సంబంధం కుదుర్చుకుని వచ్చేశాడు.

"కాపురానికి వచ్చేసరికి నాకు పధ్నాలుగేళ్ళు యింకా పూర్తిగా నిండలేదు. పల్లెటూరిలో పుట్టి, అక్కడే పెరగటం చేత నేను అభమూ, శుభమూ ఎరుగని పిల్లను. బస్తీవాళ్ళ లక్షణాలూ, సంప్రదాయాలు చాలా కొత్తగా కనిపించేవి.... నేనూ మా ఊళ్ళో చాలామంది పిల్లలతో స్నేహం చేశాను, ఆడుకున్నాను. మా పల్లెటూరి ఆడపిల్లల స్నేహాలు విచిత్రమైనవి. కొంతకాలం ఒకరికొకరు కలిసి మెలసి చాలా సఖ్యతగా వుంటారు. కొంతకాలం విడిపోయి వాళ్ళమీద వీళ్ళు వీళ్ళమీద వాళ్ళు గుసగుసలు చెప్పుకుంటారు. వాళ్ళ విరోధాల కారణాలు చాలా జాలికరంగా, హాస్యాస్పదంగా వుంటాయి. తర్వాత.. ఎంత ప్రాణమిత్రులుగా వున్నవారైనా సరే పెళ్ళిళ్ళైపోయాక ఎక్కడికెక్కడికో వెళ్ళి ఒక్క ఉత్తరం ముక్కయినా రాసుకోరు. ఒకరినొకరు త్వరగా మరిచిపోతారు. పెళ్ళయిన మరునాటి నుంచీ పెద్ద ఆరిందాలలా మాట్లాడుతారు. తన భర్త తనని చిత్తుగా తన్నినపుడు ప్రక్కయింటి యిల్లాలు ఖేదంపొంది, వచ్చి "అయ్యో పాపం" అను సానుభూతి ప్రదర్శించబోతే "వెళ్ళండి. ఇది మా స్వవిషయం" అని నిష్కల్మష హృదయంతో పలకటమే పరమ ధర్మంగా ఎంచటం వాళ్ల ప్రాతివ్రత్య లక్షణం.

"అలా మీ యింట్లో అడుగుపెట్టాక యిరుగూ, పొరుగూ వాళ్ళని చూసినట్లుగానే నా జీవితమూ ఆరంభమయింది. నేను చదువురాని మొద్దుననీ, అభమూ శుభమూ తెలియనిదానిననీకూడా నేననుకోకుండా చేసేవాళ్ళు. ఎందుకంటే నాకనుభవంలేదు. ఏది ఎలా జరిగినా అది అలా జరగాల్సిన విషయమే కాబోలునని అనుకుంటూ వుండేదాన్ని. అప్పటిరోజుల్లో అత్తాకోడళ్ళ మధ్య వుండే సంబంధాలూ, ఆ ప్రవర్తనలు,

ఆంక్షలు యీ కాలం పిల్లలకు చెబితే అవి కథ అనుకుంటూ నిట్టూరుస్తారు. ఎందుకంటే మన కళ్ళముందు జరిగే విషయాలను మనవి కానట్లు ఎవరి కథగానో చెబితే కళ్ళు చెమ్మగిల్లి, దుఃఖపడటం రివాజు.

"నన్ను అత్తగారు నేను పాతికేళ్ళ వయస్సులో వున్నపుడు కూడా కొట్టడం మీకు తెలియదు. నేను హైందవ స్త్రీని కాబట్టి ఆ విషయాలు మీకు తెలియకుండా దాచి నా పతివ్రతా ధర్మం నిర్వర్తించుకున్నాను.

"నేను సంసారంలో కొత్తగా అడుగుపెట్టినా ఆదినుంచీ వస్తూన్న అభ్యాసమేమో పద్ధతులన్నీ పాతవిగానే వుండేవి. అత్తగారికి నేను ఒకర్తెనే కోడలినయినా ఆవిడ చర్యలు ఆవిడకే విపరీతంగా వుండకపోవటం అన్యాపదేశంగా పెద్దలనుంచి నేర్చుకున్న విద్య. మరో విచిత్రమైన విషయం కూడా చెప్పనా? ఆవిడను మామగారు అడపాతడపా కొడుతూండేవారు. వారికి ఎప్పుడూ ఎదురు పలకకుండా కిమ్మనకుండా వూరుకునేది. నిజమైన సంస్కృతి, సంస్కారం యిక్కడేవుంది... నాకు క్రొత్త అవటంచేత వంటరిగా కూర్చుని అప్పుడప్పుడూ వేదనగా ఆలోచిస్తూ వుండే దానిని. నా బాల్యస్మృతులు, వెర్రిమొర్రి ఆటలు అన్నీ స్పష్టంగా కళ్ళముందు మెదుల్తూ చెప్పరాని బాధగా వుండేది. ఆ బ్రహ్మాండమైన రావిచెట్టు, పండుగలకు పిచ్చి సంబరంతో దానికి ఉయ్యాలలు కట్టి ఊగటం, ఊరికి పడమరగా పోతున్న కృష్ణపాయలో పెద్ద వాళ్ళతో చలిలో వెళ్ళి స్నానం చేయటం, విన్న పురాణాలే విని ఎప్పటికప్పుడు నూతనానందం పొందుతూన్న మనవాళ్ళు ఆ కథలు మాకుచెబుతూ, తమ చిన్ననాటి అనుభవాలు పునశ్చరణ చేసుకుంటూ కన్నీళ్ళు విడవటం అవన్నీ గుర్తుకువచ్చి ఆ జీవితానికీ యీ జీవితానికీ సమన్వయం చేసుకుంటూ చెప్పరాని ఆరాటానికి లోనవుతూండేదాన్ని. ఇటువంటి సమయాలలో ఆ బాల్యజీవితమే అమందానందకరమైనదనీ, తిరిగి అందులోకి పోగలిగితే బాగుందని అనుకోవటం ఎవరికైనా సహజం. కాని మనిషి పెరుగుదలతో బాటూ మానవధైర్యాన్ని పరీక్షించే అనేక సమస్యలు ఉత్పన్నమౌతుంటాయి. ఇది ప్రకృతిసిద్ధం. బాధ్యత అని గుర్తించి నిశ్చలమైన మనస్సుతో నిలబడినవారు ఏదో సాధించగలుగుతారు. పరీక్షలు వరుసగా తప్పుతూన్న విద్యార్థి, ఎలా కృతార్థుడవాలో చేతకాక 'ఇంతకంటే చిన్నతనమే బాగుంది. అప్పుడు యీ బాదరబందీ ఏమీ లేదు' అని దానిని తలుచుకుని ఉవ్విళ్ళూరుతుంటే యిహ వయసుకు బాధ్యత ఎందుకు? అందులో వీసమెత్తుకూడా ప్రయోజకత్వం లేదు. ఈ సత్యాన్ని తెలుసుకుని నేను విచారాన్ని మరిచి ముందుకు పురోగమించ గలిగాను.

"సంవత్సరానికి ఏ ఒకనాడో తప్ప పుట్టింటికిపోయి ఎరగను. అమ్మ నన్ను ఏవో ప్రశ్నలు వేసేది. ఆదుర్దా పడేది. మళ్ళీ తనే నీతులు బోధించేది. నేను ముభావంగా ఊరుకునేదాన్ని, దేనికీ సమాధానం చెప్పక.

"మీరు అడిగిన ప్రశ్నకు జవాబు యిహ లభించబోతున్నదనుకుంటాను. ఇది మీకు చెబుతూ వున్నంతసేపూ మీరు ఎటూ చూడక సరిగ్గా నా కళ్ళలోకి చూస్తూ వుండండి. నా కడసారి ప్రార్థన యిదే.

"నేను మీతో అలవాటుపడిపోయాను. చాలా సంవత్సరాలు గడిచిపోతున్నాయి. పెద్దవాళ్ల మైపోతున్నాం.. మీరు నన్ను చాలాసార్లు కొట్టారు. ఒకసారి నా నెత్తి చిల్లిపడి నెత్తురు చుక్కలు రాలాయి. ఒకసారి మణికట్టు బొమిక విరిగి నెలరోజులు మంచాన వున్నాను. ఒకసారి మీ దెబ్బలకు, స్పృహతప్పి పడిపోయాను. కాని ఏనాడూ మిమ్మల్ని ఎదురించలేదు. క్రోధపూరితంగా మీకేసి చూడలేదు. కిమ్మనకుండా, కిక్కురు మనకుండా వూరుకున్నాను. ఎందుకు?

"ఒకసారి... మీరు రోజూ అర్ధరాత్రివేళ లేచి ఎక్కడికో వెళ్ళిరావటం ప్రారంభించారు. అప్పుడు ఒకరోజు రాత్రి పదకొండు గంటలవేళ మీకు పాదాలుపడుతూ కూర్చున్నాను. మీరు "రెండు గంటలవేళ నన్ను తప్పకుండా లేప"మని చెప్పి నిద్రపోయారు. మీరు రెండుగంటలకు లేచి ఎక్కడికి పోతారో నాకు తెలుసు. అయినా అప్పటివరకూ మెలకువగావుండి మిమ్మల్ని తప్పకుండా లేపుదామనుకుంటూనే, పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని వుండటంవల్ల ఎంత ప్రయత్నించినా నిద్ర ఆపుకోలేక, కూర్చున్నచోటనే నేలమీద వళ్ళుమరిచి వాలిపోయాను. దభీమని పెద్ద బాధతో మెలకువ వచ్చి ఉలికిపడ్డాను. మీరు చేతిలో ఓ కర్రతో ఉగ్రస్వరూపులై ఎదురుగా నిలబడివుండి "రెండింటికి లేపమంటే

లేపలేదేం పొగరుబోతా" అని అరుస్తూ నన్ను లేవనీయకుండానే వీపు మీద పది పదిహేను దెబ్బలు కొట్టారు. నేను భయంతో 'ఎంత ప్రయత్నించినా నిద్ర ఆపుకోలేకపోయాన'ని చెప్పాను కష్టమ్మీద లేచి నిలబడుతూ. 'అంత ఆదమరిచి నిద్రపోతావా భడవా' అని నన్ను చావగొట్టారు. తెల్లారిలేస్తూనే ఆరోజు మీచేత అన్ని దెబ్బలు తిన్నాను. బాధకు తాళలేక గ్రుడ్లనీరు క్రుక్కుకుంటూ మీవంక చూశాను. ఏమీ ఎదురు సమాధానం చెప్పలేదు. క్రిక్కురు మనలేదు. తలవంచుకుని లోపలకు వెళ్ళిపోయాను. ఎందుకు?

"మనమ్మాయి పుట్టిన క్రొత్తరోజుల్లో నేను పగలు ఒంటి గంటకు దాన్ని పడుకోబెట్టి నిద్రపుచ్చి, మళ్ళీ ఎక్కడ లేస్తుందోనన్న కంగారుతో ఆదరాబాదరాగా అన్నం తింటున్నప్పుడు దబ్ మని క్రిందపడ్డ చప్పుడు విని నోట్లో ముద్ద నోట్లోనే వుంచుకుని 'అమ్మో' అనుకుంటూ పరిగెత్తుకువస్తున్నాను. ఆఫీసుగదిలోంచి పరిగెత్తుకు వచ్చిన మీరు 'అంత వళ్ళు తెలియకుండా ఛస్తున్నావా?' అంటూ నేను అమ్మాయిని యింకా నా చేతుల్లోకి తీసుకునే ముందే కాలితో డొక్కలో ఒక్కటి తన్నారు. నేను ఎలాగో లేచి పిల్లను గుండెకు అదుముకుంటూ, బాధనంతా భరిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయాను. ఎఱ్ఱగానైనా మీ వంక చూడలేదు. ఎందుకు?

"ఒకరోజు నేను గాఢనిద్రలో వున్నాను. మీరు రాత్రివేళ యింటికి ఆలశ్యంగా వచ్చి తలుపు తట్టినట్లున్నారు; కాని నాకు మెలకువరాలేదు. చాలాసేపు తలుపు బాదినా నాకు మెలకువ రాలేదన్న కోపంతో మీరు కంకరరాయితీసి కిటికీలోంచి బలంగా విసిరేశారు. ఉలిక్కిపడి 'అమ్మో' అంటూ లేచాను ఏదో పీడకలకంటున్న దానినల్లా నుదురు రక్తం చిమ్ముతున్న చోట తడుముకుంటూ కంగారుగా లేచివచ్చి తలుపుతీయగానే లోపలకు ఒక్క త్రోపు త్రోసి జుట్టు పట్టుకుని కొట్టారు. నేను మారుకూడా పలకకుండా యీ గొడవకు లేచి, ఏడుస్తున్న పాపని సముదాయించటానికి వెళ్ళాను. ఎందుకు?

"అత్తగారు యింకో రెండు మూడు నెలలకు చనిపోతారనగా, మంచానపడి వుండి కూడా, ఎవడితోనో నాకు సంబంధం కట్టారు. అది విని మీరు ముందూ వెనకా ఆలోచించకుండా నన్ను చావచితకకొట్టారు. ఇంతకంటే అవమానం నాకు వేరే ఏముంది? కాని నేను పెదవి విప్పలేదు.

"మీ పరిచర్యల్లో ఏవో లోపాలున్నాయని అడపా తడపా కొట్టారు, తిట్టారు.

"ఒకసారి, మణికట్టు బొమిక విరిగిందని చెప్పానే, అప్పుడు నెలరోజులపాటు మంచంమీద వుండాల్సివచ్చింది. మీరు విసుక్కునేవారు. చాలాసార్లు ఒక్కొక్కసారి రెండునెలల తరబడి కూడా మీరు జబ్బులో వున్నప్పుడు కూడా నిద్రాహారాలు, సర్వసుఖాన్నీ త్యజించి మీకు సపర్యలు చేశానన్న విషయం మీ విస్మృతిలో పడిపోయింది. వారం రోజులన్నా గడవకముందే రాత్రిసమయాలందు ఎక్కడికో రాకపోకలు సాగించారు. మరి నేను మాత్రం మనిషిని కాదా? కాని మిమ్మల్ని పిలిచి "నేను నెలలపాటూ విస్మరించిన సుఖాన్ని, మీరు కొన్నిరోజులు మరిచిపోలేరా? అని ప్రశ్నించలేదు.

"మీరు సంతోషంలో వున్నప్పుడు అది గ్రహించి అందుకనువుగా నేను మాట్లాడాలి. కోపంలో చికాకులో వున్నప్పుడు దూరదూరంగా తొలగాలి. ఏక్షణంలో ఎట్టి అసంతృప్తి కలిగినా చీదరించుకునేవాళ్ళు. దెబ్బలకన్న పదునైన మాటలతో తిట్టి అవమాన పరిచేవాళ్ళు. అతిహీనంగా చూసేవాళ్ళు. ఏమీ జరగనట్లు మసులుకునే వాళ్ళు. కాని యిన్ని సంవత్సరాల సుధీర్ఘకాలంలో ఏనాడూ పన్నెత్తి ఒక్కమాట అనలేదు. కన్నెత్తి కోరగా ఓ చూపు చూడలేదు. ఎందుకు? మీరు కారణం అడిగారు కదూ?

"నేను యిప్పుడు మృత్యుముఖాన వున్నాను. మీరుగాని, డాక్టరుగారుగాని నా గురించి చెప్పకపోయినా ఏ అవ్యక్తపు పలుకులో నిజాన్ని వచిస్తూ నా శ్రవణ కుహరంలో ప్రవేశించగలిగాయి. ఇహ ఒకటి రెండు రోజుల్లో నాకు మీ అందరితోనూ ఋణంతీరిపోతుంది. ఇటుపై నాకు ఎవరి ఆంక్షా వుండబోదు. అందువల్లే యీవేళ మిమ్మల్ని నాచెంత కూర్చోబెట్టుకుని, నా మనసు యావత్తూ విప్పి చెప్పటం ప్రారంభించాను.

"ఇప్పుడు తదేకంగా చూడగలుగుతున్న మీ ముఖంవంక యిహ పై చూడవలసిన అవసరం లేదు కాబట్టి, యిన్ని ఏండ్లుగా మిమ్మల్ని ఆశ్చర్యపరచిన నా ఓర్పుకు కారణం చెబుతాను వినండి.

**"మగవాడు తుచ్ఛమైన కార్యాన్ని ఘనంగా ఎంచుతాడు. ఆడది ఘనమైన ఓ కార్యాన్ని అల్పంగా యెంచుతుంది.** మీలోని భర్త నాలోని భార్యను నిర్దయగా కొట్టినప్పుడూ, దారుణ హింసావమానాలకు గురిచేసినపుడూ, ధిక్కరించడమూ, తిరగబడడమూ, పారిపోవటమూ, ఆత్మహత్యలకు పాల్పడటమూ మినహా ఆమె చేయగలిగిన ఘనకార్యం ఏమీ లేదని ఆమె అనుకుంటే యీనాటి ఆత్మహత్యల సంఖ్యకూ, సంసారాలు పాడుచేసుకున్నవాళ్ల సంఖ్యకూ మితి వుండేది కాదు. స్త్రీ ఎప్పుడూ తన శక్తికి మించిన పని చేయాలని ఉబలాటపడుతుంది, సాధిస్తుంది.

"పురుషుడు తనని హింసలపాలు చేసినపుడల్లా అతన్ని క్షమిస్తూ వుండటం స్త్రీ సాధించింది.

"మీ వల్ల నేను అవమాన దందహ్యమాన మానసురాల్ని అయినపుడల్లా మొట్టమొదట ధిక్కరిద్దామనుకునేదాన్ని. తరువాత బావిలో పడి చద్దామనుకునే దాన్ని. కాని మరుక్షణంలో యీ అల్పమైన ప్రయోగాలకు నేనెందుకు పాల్పడాలన్న లజ్జ ముంచుకు వచ్చేది. వీటన్నిటికన్న మించిన ఒక విశేషాన్ని నా అధీనం చేసుకుని మీకన్న ఉన్నతురాలినన్న సంతృప్తి, గర్వం నాలో నేను ఆవహింప జేసుకోవాలి... వెంటనే మిమ్మల్ని క్షమించేదాన్ని.

"అవును. మీరు నన్ను వేధించినపుడల్లా మిమ్మల్ని క్షమిస్తూ వచ్చాను. మిమ్మల్ని క్షమించానన్న ఆనందంతో, అభిజాత్యంతో రోజులు సునాయాసంగా, నిబ్బరంగా గడిచిపోయేవి. ఇదంతా అనుభవిస్తూ నాలో నేను ఎంత పరవశం చెందుతున్నానో మీకేం తెలుసు? పై చేయి నాది. ఇది మీకు చెప్పకుండానే దాచబోయేదాన్ని. కాని చివరి ఘడియల్లో నా జీవితాన్ని పునఃవిమర్శ చేసుకుని, దేనిని గురించి నే నాలోచనా నిమగ్నురాలనై వున్నానో, దాన్నే మీరు ముళ్ళకంచెతో బురదనీటిని కదిపినట్లు కదిపారు. అందుచేత సర్వమూ మీకు వెల్లడించక తప్పలేదు. ఇదే మిమ్మల్ని విభ్రాంతి పరచిన నా బ్రహ్మాండమైన ఓర్మికి కారణం. ఇన్నాళ్ళూ.. మిమ్మల్ని.. క్షమించాను!"

ఆమె వదన మండలమంతా ఉన్మిషితమైపోయింది. మైకంలో మైమరుపులో క్షణకాలం మాత్రం కళ్ళు మూసింది. తర్వాత భర్తవంక చూస్తూ మెదలకుండా పడుకుంది.

ఆదిశేషయ్య గారి ముఖంలో నెత్తురుచుక్క లేదు. మలిన పూరితమైన ఆ పదార్థాన్ని అలానే భరిస్తూ నిర్విణ్ణుడై అలానే కూర్చుని వున్నాడు కొంచెం సేపు.

"ఈమెతో యిప్పుడు సంభాషించాలా?" ఈ భయాందోళనలు ఆయన్ని కృంగదీశాయి. ఇక్కడినుండి తప్పించుకోవటం కూడా కష్టమే. కాని యిక్కడ యీ మానవాతీతురాలిగా కనిపిస్తున్న వ్యక్తిముందు కూలబడి ఆలోచనలు కొనసాగించటం అంతకంటే కష్టము. ఎలాగో సర్వశక్తులూ కూడదీసుకుని లేచి, తప్పటడుగులతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

★ ★ ★

కూతుర్ని అయోమయ పరిచి గదిలోకి సాగనంపి దీపం వేసి వున్న గదిలో ఆదిశేషయ్య గారు యింకా ఒంటరిగా కూర్చుని వున్నాడు దీనంగా. వదనంలో విరాగ రేఖలు స్పష్టంగా వ్యక్తీకరించబడ్డాయి యిప్పుడు. తనకు సమాధానం లభించింది. ఈ దీర్ఘకాల సంసారంలో పొందగలిగిన శాంతి, సౌఖ్యాల వెనుక అదమబడి వున్న కారణం తెలిసింది. ఇరుగు పొరుగూ చేత పార్వతీ పరమేశ్వరుల వంటివారని తమలో తామూ, బాహాటంగా కూడా అభినందింపబడడంలో యీ ప్రతిష్ఠ ఎవరికి దక్కాలో తెలిసింది. తనలో దుర్మార్గమనే ప్రత్యేకత వుండికూడా ఆమె పెట్టిన భిక్షవల్ల మామూలు మనిషి క్రింద చలామణీ అయాడు. అసలు మగవాళ్ళంతా యింతే నేమో ! మరి లోకం 'దుర్మార్గుడు' అని ఎవర్ని అయితే పేరుపెట్టి పిలుస్తుందో వాడిలో ఎంత దుర్మార్గం కరుడు గట్టుకుపోయి వుండాలో !

తాను క్షమించబడుతూ పాపాలు చేశాడు. క్షమించబడుతూ వృద్ధుడయాడు. ఈ పాపానికి పరిధి వుంది. ప్రాయశ్చిత్తం లేదు. కాని...? ఇంకా తనను ఏదో పీడిస్తోంది. అభిమానం చావకుండా నిక్కుతోంది. లజ్జ, నిర్లజ్జల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

"ఈ ముప్ఫయి అయిదేళ్ళ సంసార జీవితం !" ... ఆయన ఆశ్చర్యాన్వితుడయ్యాడు. ఒక విశాల హృదయం విధివిరామం లేకుండా ప్రసరించిన క్షమవల్లనే నులుగురిలోనూ అల్లరిపాలు కాకుండా కాపాడబడ్డాడు.

ఈ ఆలోచన తోచే సరికి మనసు భయావిష్టమై స్పందించింది. "నేను పరాధీనుడ్ని, పరాజితుడ్ని, పరాభూతుణ్ణి."

గతచరిత్రంతా ఒక్కసారి చెమ్మగిల్లిన నేత్రాలముందు సాక్షాత్కరించి కదలిపోయింది. ఆ కాలంలో అందరూ మానవుల్లా జీవిస్తున్నట్లు తనకు తెలుసునేమో తన భార్యతప్ప.

ఇంతలో మరో సత్యం స్ఫురించి కంపితుడయ్యాడు. తాను ఆమెను ఎన్నిసార్లు కొట్టాడో ఆమెకు జ్ఞాపకం వుంది. తనకు లేదు.

ముచ్చెమటలు పోస్తుండగా కళ్ళు మూసుకుని గంద్రగోళమైన మనస్సుతో తబ్బిబ్బు అవుతున్నాడు వెనక్కివాలి. డాక్టర్ యివాళ పెదవి విరిచాడు. మహా బ్రతికితే ఒకటి రెండురోజులు! ఆ తర్వాత తనని క్షమించేందుకు ఎవరూ మిగలరు.

ఈ పది పదిహేను రోజులనుంచీ దేముడు చాటుగా తనకు అంతిమ కర్తవ్యం ప్రబోధిస్తూ వచ్చాడు. జన్మలో ఆమె గురించి తాపత్రయపడిన సమయం యిది ఒక్కటే. కాని దానిని గురించి తలచటానికైనా తనకు అర్హత లేదు. ఈ కడపటి వివేకం అసంపూర్ణంగా వుండిపోయింది.

ఇపుడు ఏదో చిత్రమైన అనుభూతి కలుగుతోంది. దాన్ని వారించలేకపోవటానికి అశక్తత ఒక్కటే కారణమవుతోంది. ఇది తన దౌర్భాగ్యం. కాక యింకా అహం పూర్తిగా చావక ఏమూలనుంచో తొంగి చూస్తోందన్న జ్ఞానం కలగటం మరేమిటి ?

అవును. తన మానవత్వం యింకా సంపూర్ణత్వం పొందలేదు. అందుచేతనే ఆమె చెంతకు పోయి ఏవో మాటలు చెప్పటానికి యింకా ఉద్యుక్తుడు కాలేకుండా వున్నాడు.

"కాని తాను ధన్యుడు" ఈ యోచన తనువును పులకరింప జేసింది. మరుక్షణంలో కళ్ళనిండా నీళ్లు పొటమరించాయి. తనకు యీలోకం ముందు ధన్యత చేకూర్చిన ప్రాణిముందు మనసారా కృతజ్ఞత వెల్లడించడానికి తటపటాయిస్తే యీ పాపానికి పరిధి కూడా లేదు; 'తాను ప్రపంచంలో ఒకడు' అని ఓదార్చుకుంటూంటే ఎవరో అజ్ఞాతవ్యక్తి ఆ చుట్టు గీతను కూడా తుడిచి పారేసినట్లు ఆయన ప్రకృతి స్థితుడయాడు. వ్యవధానం తక్కువ. నెమ్మదిగా లేచి, ధైర్యంగా లోపలకు వెళ్ళాడు.

★ ★ ★

"అమ్మా!" అంది కూతురు గుమ్మందగ్గర నిలబడి భీతిగా చూస్తూ.

పార్వతమ్మ నిమ్మదిగా కళ్ళు విప్పి "ఎవరు?" అనుకుంటూ అటుకేసి చూసింది. ఎవరో చూసి ఆనందపడి "తల్లీ" రా అంది నీరస కంఠంతో. కూతురువచ్చి తల్లికి చేరువగా మంచంమీద కూర్చుని బెదురుగా పరికిస్తోంది. ఆమె మృదుహస్తాన్ని తన శుష్కహృదయం పైకి లాక్కుని పార్వతమ్మ "నా కంత్యకాలం సమీపించింది. నా చివరి మాటలు వినటానికి ఎందుకువచ్చావు? పిచ్చితల్లీ" అంది దగ్గుత్తికతతో.

కూతురు యీ మాటలు విని బెంగతో నిశ్శబ్దంగా ఏడువసాగింది. తల్లి గుండెపై తలవాల్చి "ఇలా ఎందుకయిందమ్మా ఎందుకయింది?"

"వెర్రి తల్లీ ! మీ తండ్రిగారి కళ్లముందు నేను దాటిపోవటం నా మాంగల్య మహిమవల్ల అనుకుని ఎందుకు ఊరడిల్లవు? ఈ సౌభాగ్యం అందరికీ ప్రాప్తిస్తుందా ?"

ఆనందోద్రేకంతో వెలిగిపోతున్న తల్లి కృశించివున్న వదనం లోకి తేరిపార చూసింది కూతురు. కాని అందుకు కారణం వేరుగా భావించింది. కేవలం యిప్పుడు ఆడిన మాటల్లోని తాత్పర్యమేనని ఆమె అపోహ. "అమ్మా" అంది బాధతో. ఏదో చెబుదామనుకుంది. కాని దుఃఖంతో గొంతు పూడువడి సాధ్యంకాలేదు. కొద్ది క్షణాలు నిశ్శబ్దవాహినిలో ప్రవహించాయి.

"ఏమిటి?" అంది తల్లి ప్రేమగా.

తన సందేహం తీర్చుకుందామని "నీవింత ఆనందంగా వుండడం నేనెప్పుడూ చూడలేదు?" అంది.

"ఇందులో అంతరార్థం నీ కిప్పుడే తెలియదు"

"పోనీ చెప్పరాదా?"

"నా కడుపున పుట్టినదానవు. నువ్వుకూడా అనుభవశాలివై యీ సత్యం నీ అంతట నీవు శోధించగలిగిననాడు నీవూ యీ అనిర్వచనీయమైన సుఖంలో ఓలలాడుదువుగానిలే."

కూతురు విషణ్ణవదనంతో ప్రశ్నార్ధకంగా చూసింది.

"తల్లీ! నీకు పుణ్యస్త్రీ అంటే అర్థం తెలుసునా?"

"అమ్మా ఏమిటే యిది? నా కేదో భయంగా వుంది. నాన్నని పిలుస్తాను" అంటూ మళ్ళీ ఏడువ సాగింది.

"వద్దు. కళ్ళు తుడుచుకో. చెప్పమ్మా. నీకు పుణ్యస్త్రీ అంటే అర్థం తెలుసునా?"

"ఊహూ... తెలియదు."

ఆమె ఆలోచించి....

"నాకూ తెలియదు సరిగ్గా. నా జీవితం అందుకు ఉదాహరణ ప్రాయం అన్న అభిప్రాయం యింతవరకూ వుండేది. కాని నిన్ను చూస్తుంటే, అమాయకమైన నీ ముఖంలోకి చూస్తూంటే తప్పటడుగు వేశానేమోనన్న సంశయం పీడిస్తోంది. ఇప్పుడు నేను చేసినది ఒక ఉన్మాదక్రియా?" అని నిట్టూర్చి "అయ్యో ఎంత పొరపాటు జరిగిపోయింది! మీ నాన్నగారూ నువ్వూ ముఖాలు యిహమీదట కూడా చూసుకోవాలిగదా నన్న జ్ఞానం లేకపోయిందే నాకు.... ఆయనకు కనిపించావా?"

"ఆఁ నాన్న చీకటిగదిలో వంటరిగా ఎలాగో కూర్చుండటం చూసేసరికి నాకు భయంపుట్టింది."

"ఏమన్నా అన్నారా నిన్ను చూసి?"

"పలకలేదు. విచిత్రంగా, అయోమయంగా చూశారు."

"ఎంత పాడుపని చేశాను?" అని ఆమె తనలో తాను మధనపడసాగింది. "పాపిష్టిదాన్ని. ఈ మేలుకొలుపు నాకు కలగకున్నా బాగుండేది. తుది ఘడియల్లో నాకు సౌఖ్యగరిమ అంతా నేనేపంచుకోవాలన్న స్వార్థదాహం ఎందుకు కలిగింది?"

"అమ్మా!"

పార్వతమ్మ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఎడతెగకుండా ప్రవహించసాగాయి. అవి కూతురుచూసి యీ హఠాత్ పరిణామానికి దిగులు చెందటం కనిపెట్టి "నీ చేతుల్తో యీ నీళ్ళు తుడిచి వేయవూ?" నీ వల్లగాక మరి ఎవరివల్ల నా దుఃఖం ఉపశమనం చెందుతుంది?" అన్నది.

కూతురు తనలో తాను కుమిలిపోతూ, మృదువైన వ్రేళ్ళతో మెల్లగా కన్నీటిపాయలు, చారలు తుడిచివేసి మెదలకుండా కూర్చుంది.

"నా చేయి ఎత్తాలంటే బలహీనంగా వుంది. ఈ చేతిని నీ శిరస్సుమీద పెట్టుకోమ్మా"

ఆమె తన రెండు చేతుల్తో తల్లి దక్షిణ హస్తాన్ని పట్టుకుని తలపై వుంచుకుని శ్రద్ధాభక్తులతో కనులు మూసుకుంది.

తల్లి అస్పష్టస్వరంతో ఉచ్ఛరిస్తూ ఏదో ఆశీర్వదించింది. అది కూతురికి యిలా వినిపించింది:

"అందరి స్త్రీలలానే బ్రతుకు"

కూతురు ఏదో పలకబోయింది. ఇంతలో గది బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఇద్దరూ దృష్టి అటు లగ్నం చేసేసరికి ఆదిశేషయ్యగారు బరువుగా అడుగులు వేసుకుంటూ లోపలకు ప్రవేశించి యిద్దరివంకా తెల్లబోయి చూచాడు. ఒక్కదెబ్బతో ధైర్యమంతా సడలిపోయినట్లయింది.

పార్వతమ్మ కష్టమ్మీద "నాన్నగారు నేను ఏమయిపోతానోనన్న బెంగతో రెండురోజులుగా పచ్చి మంచినీళ్ళు కూడా తాగటం మానేశారు. వెళ్ళి భోజన సదుపాయం చూడమ్మా" అంది. కూతురు లేచి తండ్రివంక ఒకసారి భయభక్తులతో చూసి తల వంచుకుని అక్కడినుంచి నిష్క్రమించింది.

ఆదిశేషయ్యగారు "పార్వతీ!" అని పిలవబోయి, తృళ్ళిపడి ఆమెవంక ఏకదీక్షగా అలానే చూస్తూ నిలబడిపోయాడు.

ఆయనవంక చూస్తూ పార్వతమ్మ ఆలోచించసాగింది. ఈయన మళ్ళీ తన ఎదుటకు వచ్చారు. తన మనస్సు యావత్తూ విప్పి చెప్పగానే, ఆక్షణాలలోనే తన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని అప్పుడు నమ్మింది. కాని... అందుకు భిన్నం, ఇప్పుడు యిద్దరూ ఒకరికొకరు అభిముఖంగా వున్నారు. ఈ అవస్థ భరించటం ఎలాగు? తన ఈ అమర్షభావం ఎందుకు ప్రకటించింది?

"పార్వతీ!" అని పిలిచి ఆదిశేషయ్య గారు సమీపించబోయి, ఉలికిపడి, నీరసంగా చూస్తూ అలానే నిలబడిపోయాడు.

పార్వతమ్మ చూపు త్రిప్పుకోలేదు. అలానే వీక్షించసాగింది. ఇదే ఘడియలో తనకు మృత్యువు ప్రాప్తిస్తే బాగుండును. తల వెయ్యి వ్రక్కలైపోతే బాగుండును... ఎంత.. ఎంత... అదృష్టహీనురాలు?

ఆదిశేషయ్య గారు మెల్లగా సామీప్యంలోకి వచ్చి "పార్వతీ! అని నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఈ మార్పు ఎలా అవతరించింది? ఆ ముఖంలోని ప్రతి అణువూ అలా వివర్ణరూపం పొందివుందేం? ఆ కనుల్లోని తన్మయం, అభిజాత్యభావం ఏమయిపోయాయి?

పార్వతమ్మ పెదవులు కంపించసాగాయి. "రండి" అంటూ ఆయన్ని ఆహ్వానించింది చివరకు. ప్రక్కకు వచ్చి కూర్చున్నాక ఆయన వొణుకుతున్న చేతుల్ని, తన వణుకుతున్న చేతుల్తో చేరదీసి పట్టుకుని "నన్ను క్షమించరూ?" అన్నది తడబడుతున్న కంఠంతో.

"పార్వతీ!" అన్నాడు ఆదిశేషయ్య గారు నిశ్చేష్టితుడై "నేను ఏమయినా......."

"అవును, నన్ను క్షమించండి. నేను మిమ్మల్ని... నన్ను క్షమించండి"

ఈ హృదయ విదారకమైన వేడికోలు ఆయనను ఆసాంతం కలవర పరిచింది. ముందు "ఎందుకు?" అన్న ప్రశ్న నోటివరకూ వచ్చింది. కాని... సంభాళించుకున్నాడు. ఒక క్షణం ఏదో ఆలోచన పాములా జర జరమని ప్రాకుతూ మనసులో మెలిసింది. తన పశ్చాత్తపంలోని ఆ అసంపూర్ణత్వం...! భార్య వంక తీక్షణ దృష్టితో చూచాడు. మళ్ళీ తలప్రక్కకు త్రిప్పుకున్నాడు. తన నిశ్చయం పటాపంచలౌతుంది. స్వార్థరేఖ హృదయకుహరంలో మింటికి ఎగబ్రాకే మంటలా ఎగసింది. ఇవేళ.... యీరోజు యీ రాత్రి... పరాభవాల వెనుక... పశ్చాత్తాపం వెనుక... ప్రశాంతి వెనుక... ధృఢనిశ్చయం వెనుక.....

అంతే ఆకస్మికంగా ఆమెవైపు తిరిగేసరికి ఆయన నేత్రాలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి. చెప్పరాని మార్పు ప్రవేశించి అస్థిరచిత్తం స్థిరత్వం పొంది వికసించినట్టుగా దృక్కులను ఆమె వరకూ గంభీరంగా త్రోశాయి. బలహీనమైన ఆమె చేతి పట్టు సడలింది. తన హస్తాన్ని ఆమె ఫాలంపై వుంచి "పార్వతీ! నిన్ను నే క్షమించాను" అన్నాడు.

★ ★ ★

రాత్రి పన్నెండుగంటలలోపున జరిగిపోయిన ఆ సంఘటనల తర్వాత, సంఘటిల్లిన సంగతులను గురించి ఉల్లేఖించటానికి కలం వెనుక ముందాడుతోంది. ఈ కథలో ముఖ్యపాత్ర పార్వతమ్మ ఆమెను గురించి వ్రాయటానికి బాధపడి, వదిలివేసి మిగిలిన వారిని గురించి వ్రాద్దామన్నా సాధ్యం కావటం లేదు... ఆమె జీవితం చివరి దశలో చాలా విచిత్రమైన పరిణామాలకు గురైంది. ఆమె ఆశించినట్లు చావు దగ్గరకు రాకుండా దూరదూరంగా జరుగుతోంది, విముఖత చూపిస్తూ.

పార్వతమ్మ తనతల్లి మరణశయ్యపై వున్నప్పుడు టెలిగ్రాం అందుకుని వెళ్ళినప్పుడు ఇలా జరగలేదు. మరునాడే ఆమె తల్లి కళ్ళు మూసింది.

మరునాటి ఉదయం డాక్టర్ యధాప్రకారం వచ్చినపుడు పార్వతమ్మ పరిస్థితి కొంచెం తేటగా వుండటం కనిపెట్టి ఆశ్చర్య పడ్డాడు. నాడి చూసి సంతోషం ప్రకటించాడు. మగత నిండిన నేత్రాలతో ఏదో లోకంనుండి చూస్తున్నట్లు ఆయనవంక పరికిస్తూన్న పార్వతమ్మ మనసు చివుక్కుమంది. ఎందుకీయన ఆశాభావం ప్రదర్శిస్తున్నాడు! తనకి చావు మూడటానికి యింకా కొన్ని రోజులు వ్యవధివుందా?

ఆమె ఎవరితోనూ పలకటం మానివేసింది. తాను పలికితే అందులో ఏ అపస్వరం ధ్వనించి, దానిని గురించి సమాలోచించుకున్నపుడు తనగుండెల్లో చిచ్చుపెడుతుందో ఎవరికి తెలుసు? తాను భంగపడింది. శాశ్వతమైన ఆనందాన్ని క్షణికావేశంతో బయటకు వెల్లడించి భగ్నంచేసుకుంది. దేముడు తనకు రెండు పరీక్షలు పెట్టాడు. ఒకదాంట్లో అద్భుతంగా గెలిచింది. రెండవదాంట్లో చిత్తుగా ఓడిపోయింది. సర్వసాధారణంగా స్త్రీకి లోకం అంటే భర్త. ఆలోకాన్ని ఒక ఉత్తేజంలో ధిక్కరించడం జరిగినా, యిది నిజమైన శాంతి కాదనే అపోహతో మనసులో లేని పరాజయాన్ని బాహ్యంగా ఒప్పుకుంది. ఈ రెండువిధాల హానికలిగింది. అప్పుడు తన నిజస్వరూపాన్ని అవతలివారికి ప్రదర్శించి కూడా, మారు వేషంలో తిరిగి సంచరించడానికి వీలు లేదు కాబట్టి, 'నిన్ను ఇన్నాళ్ళు క్షమించాను' అని అపని జరిగిపోయాక చెప్పి, వ్యక్తం చేసి, తిరిగి క్షమించటానికి సిద్ధపడటం హాస్యాస్పదం కాబట్టి బ్రతకటానికి వీలు లేదు. ఇప్పుడు అంతరంగికంగా తను అనుభవించని ఓటమిని తన హద్దుదాటి కళంకాన్ని ఆపాదించుకున్నానన్న చింతతో బయటకు అంగీకరించటం ద్వారా గార్హస్థ్య ప్రపంచంలో తన స్థానాన్ని శాశ్వతంగా పోగొట్టుకోవడం చేత, యీ దుర్భర అవమానంతో బ్రతకటానికి వీలు లేదు. తాను యిక మనుషులనేవారితో మాట్లాడటం ఉభయులకూ ముప్పు. అందుచేతే కూతురువచ్చి బ్రతిమాలినా, ఏడ్చినా, మొత్తుకున్నా, భర్తవచ్చి "ఏమిటి పార్వతీ యీ చాదస్తం?" అంటూ సానునయ వాక్యాలు పలికినా పెదవి కదపలేదు.

కాని ఆమె ఎంత లేదనుకున్నా మొదటి రాత్రి అనుభవించిన తృప్తీ, సౌఖ్యం రెండు మూడురోజులవరకూ పెనుగులాడుతూనే వున్నాయి మానవబలహీనతవల్ల. ఇది బహుశా భగవంతుడనేవాడికి కూడా తెలియని పరమరహస్యం. అందువల్లనే డాక్టర్ మరునాడు ఆశ్చర్యపడటం జరిగింది. కాని అతడి ఆశాభావం చూసి పార్వతమ్మ కృంగిపోయింది.

వాళ్ళ అందరిముఖాలూ వికసించాయి. తనకి చావురాదు. రాదు. అయ్యో. ఈనాడు ప్రపంచంలో తాను తిరిగి బ్రతకాలి ఈ నరకయాతనలో.

ఆమె మనస్ఫూర్తిగా మరణానికి ఎదురు చూసింది.

కాని....!

ఒక అత్యద్భుతమైన సంఘటన యిక్కడ సంభవించింది. తనకి చావు రాదు. రాదు. తాను చచ్చిపోక బ్రతుకుతుందన్న దుర్భరమైన బెంగతో మానశికంగా కృంగి కృశించి మూడురోజులు గడిచేటప్పటికి క్రమక్రమంగా మరణాన్ని సమీపించసాగింది తిరిగి.

చావనన్న భయంతో పార్వతమ్మ చచ్చిపోతోంది.

★ ★ ★

డాక్టరు మళ్ళీ సందేహాన్ని వెలిబుచ్చి వెళ్ళిపోయినప్పటినుంచీ ఆదిశేషయ్య గారు దిగాలుపడి కూర్చున్నాడు. ఈ కొద్ది రోజులనుంచీ ఆమె తప్పకుండా జీవిస్తుందన్న నమ్మకంతో తిరిగాడు. ఎన్నోసార్లు ఆమె దగ్గరకుపోయాడు. మాట్లాడించటానికి ఎన్నో విధాల ప్రయత్నించాడు. మృదువుగా బ్రతిమిలాడాడు. "ఏమిటి పార్వతీ యీ చాదస్తం" అన్నాడు.

తాను ఆమెను మనస్ఫూర్తిగా క్షమించివేశాడు. ఆమె బ్రతకాలి. తనకోసం బ్రతకాలి.

ఆమె యీనాడు మరణిస్తే తన శేష జీవితమంతా కీకారణ్యంలోని చీకటి. అప్పుడు చచ్చినా బ్రతికినా ఒకటే. ఆ జీవితానికి అర్థం లేదు.

తాను ఆమెయెడల ప్రవర్తించిన హింసా విధానాన్ని ఆమెనోట తెలుసుకున్నా, అందుకు బాధపడినా, ఏదో అవ్యక్తశక్తి ప్రేరణ ద్వారా ఆమెతో మనసారా కొన్నిమాటలు వచించటానికి పోయినప్పుడు, ఆమె తనతప్పు తెలుసుకుని క్షమాపణ కోరింది. అది తనలో తాత్కాలికమైన విస్మయాన్నీ, గగుర్పాటునూ రేపింది. కాని కొద్ది క్షణాలలో పరిస్థితి మారింది. తన నేత్రాలు ఉజ్వలమైన కాంతితో ప్రకాశించాయి. క్షమించానని చెప్పివేశాడు. ఇప్పుడు యిద్దరిలో సరియైన శాంతి భద్రతలు నెలకొల్పబడినాయి తనలోని కాఠిన్యం కరిగిపోయింది.

కాని యిదేమిటి? ఆమె జీవించబోవటల్లేదు ఆ రాత్రి జరిగిన సంఘటనల తర్వాత తాత్కాలికంగా వాటిల్లిన ఆమె ఆరోగ్యంలో అభివృద్ధి చూసి యిహ పరవాలేదనుకున్నాడు. కాని తనకు తెలియకుండా ఏదో జరుగుతోంది. అశాంతి దాపురించబోతోంది. ఇహమీదది తన యీ వృద్ధప్రేమను ఆమెకై గ్రుమ్మరించాలన్న ఆశలన్నీ అడియాస లౌతున్నాయి.

"నాన్నా !" అంది కూతురు గుమ్మంలోకి వచ్చి నిలబడి. ఆదిశేషయ్య గారు తలఎత్తి చూసి "ఆఁ" అన్నాడు.

కూతురు దగ్గరకు వచ్చి తండ్రి ముఖంలోకి భీతావహంగా చూస్తూ

"అమ్మకి... ఏమవుతుంది నాన్నా?" అంది.

"ఏ...మో...తల్లీ"

"అమ్మ ఏదో విషాదంలో మునిగివుంది నాన్నా!" అంది కూతురు కొంచెం ఆలోచించి ఆవేదనతో.

"నీకు... ఎలా తెలుసును అమ్మా?"

"నేను ఊహించగలిగాను నాన్నా! ఇక్కడికి వచ్చిన రోజు రాత్రి అర్ధస్వగతంగా ఏవో మాటలు చెప్పింది. నాకెంతో భయం వేసింది. తాను ఏదో పొరపాటు చేశానని గొణిగింది. ఆ పొరపాటు నీకేమైనా తెలుసా నాన్నా?"

ఆయన తడి ఆరిపోతూన్న గొంతుతో "అబ్బే.... తెలియదమ్మా."

"అమ్మ నాకు సరిగ్గా చెప్పలేదు. అదే ఒకవేళ చెప్పటం ఏమో. 'అందరి స్త్రీలలానే బ్రతుకు' అని నన్నాశీర్వదించింది. ఆమె ప్రవర్తన యీరీతిగా వుండటం నేనెన్నడూ చూడలేదు. నేను అతిగామాట్లాడుతూంటే క్షమించు. ఏస్త్రీ కూడా తాను చేసింది పొరపాటని మనసా, వాచా చెప్పివేశాక యిహదానిని గురించి మధన పడదనుకుంటాను... నన్నా సంశయం వేధిస్తోంది నాన్నా."

"ఏమిటది? ఏమిటమ్మా అది?"

"అమ్మ తాను జీవించాలని కోరుకోవటల్లేదు. నేనిది బాగా గ్రహించాను. ఆమె వెయ్యి కళ్ళతో మరణానికి ఎదురు చూస్తోంది."

ఆదిశేషయ్య గారు నిశ్చేష్టితుడయాడు. "తనకు ఏమిటది?" అని జిజ్ఞాస కలిగించిన యిందాకటి మాటలూ, యీ చివరి మాటలూ బాగా మనసులో నాటుకున్నాయి. ఈ విచిత్ర నాటకం విపరీతమైన సంచలనాన్ని కలిగిస్తోంది. ఇంతకీ ఒకరి మనసు ఒకరు అర్థం చేసుకోనేలేదన్నమాట. డాక్టర్ 'మీకేం భయంలేదమ్మా' అన్నప్పుడు ఆమెకళ్ళలో ప్రతిబింబించే వ్యాకులపాటుతో కూడిన గగుర్పాటుకు అర్థం? ఆయనకు అర్థమయింది. తాను ఏమీ తెలుసుకో లేని మూర్ఖుడా. ఇప్పుడు యీ జ్ఞానదానం చేసింది తనకన్నా ఎన్నో సంవత్సరాలు చిన్నదైన కుమార్తె.

ఆయనకింతలో మెరుపు మెరిసినట్లు ఓ పరిష్కార మార్గం తోచింది. అది అద్భుతమైన యోచన. కాని భయంకరమైనది కూడా.. సర్వ సాధారణంగా చావుబతుకుల్లో వున్న మనుషులకు తుది ప్రయత్నంగా ఓ చిట్కా వంటిది ప్రయోగిస్తారు. అది ఫలిస్తే అమోఘంగా ఫలిస్తుంది. లేదా నాశనం వుండనేవుంది. ఈ తక్షణ మార్పుని గమనించి కూతురు కలవరపాటుతో 'నాన్నా' అంది. ఆయన సమాధానమివ్వకుండా అక్కడినుంచి నడిచి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఒకనాటి మాదిరి భయానకంగావుంది. పార్వతమ్మ పడుకుని వున్న గదిలో బెడ్ లైటు వెల్తురు తప్ప యిల్లంతా చీకటి అలుముకుని వుంది.

"పార్వతీ!" అని పిలిచాడు ఆదిశేషయ్య గారు ముందుకు వంగి.

ఈ కొద్దిరోజులుగా వస్తూన్న జవాబే వచ్చింది.

ఆయన ఒకసారి పెదవులు కొరుక్కున్నాడు. బరువుగా ఊపిరి విడిచాడు.

"నాతో యిప్పుడైనా మాట్లాడవా ? నీ కింత మొండిపంతం ఎందుకు? అమ్మాయి బాగా దిగులు పడింది. చిక్కి శల్యమై పోయింది."

ఆమె కనీసం సానుభూతిగా ఆయనవంక చూడనన్నా లేదు.

"పార్వతీ! ఈ తుది ఘడియల్లో కూడా యిలాగే వేధిస్తావేం ?"

"................"

ఆయన రుద్దకంఠంతో "నీవు భగవన్నామ స్మరణలోనే కాలం గడిపితే నాకు సంతోషమే. మనయింటిలో వున్న రాముల వారి పటం నువ్వు ఏ రోజయినా పూజించకుండా వూరుకున్నావా? పార్వతీ ! ఒకసారి ఆ పటం తెచ్చి నీ కళ్ళముందు వుంచేదా ?"

".............."

"నీకు ఎలా అనిపిస్తుంది ? నా మాటలు నావిగా గుర్తు పట్ట గలుగుతున్నావా పార్వతీ ?"

"................"

"డాక్టర్ ఏదో చెప్పాడు. నీకు నిజంగానే మైకం క్రమ్ముతోందా ?"

"................."

"పార్వతీ ! పార్వతీ ! పలకవేం ! నీ యింద్రియాలు నీకు స్వాధీనంలో లేవా ? అలా చూస్తున్నావేం ? ఎవరు కనిపిస్తున్నారు నీకు ? అయ్యో.... అలా అయిపోతున్నావేం పార్వతీ........ డాక్టర్ చెప్పింది నిజమేనా ? నువ్వు ... నువ్వు... నాకు దక్కవా ?"

పార్వతమ్మ తనువు పులకరించింది. ఆనందంతో ఆమె నేత్రాలు విస్ఫారితాలయాయి. తన్మయంగా ఒకసారి భర్తవంక వీక్షించింది. అబ్బ ! ఆ బాధ, ఆ దుఃఖం... నిజంగా తను....! నిజంగా తను...!

పార్వతమ్మ కళ్ళు మూసుకుంది.

తాను చచ్చిపోతోంది. చచ్చిపోతోంది. "భగవాన్ ! నా కోరిక యీడేరుతోంది."

★ ★ ★

ఈ లోకంలో ఆదిశేషయ్య గారిలాంటి తెలివైన వాళ్ళు వుంటూ వుంటారు. పాపం పార్వతమ్మ బ్రతికింది. కాని అమ్మవారు పార్వతమ్మ తల్లితో ఎందుకు తప్పు చెప్పినట్లు ?




# తల్లిచాటు పిల్లవాడు

## కొడవటిగంటి కుటుంబరావుగారు

*(ఆంధ్రభూమి 1934 జనవరి 1 సంచికనుంచి పునర్ముద్రితం)*

**లోకం ఒక పెద్ద కొలిమి.** అనేక ధక్కా ముక్కలు తిని రాటుతేలిన వాళ్ళు దానివేడికి తట్టుకోవలసిందేకానీ, ప్రసాదరావుబోటి సుకుమారులు ఆగలేరు. అటువంటివాడు కొన్ని కారణాలవల్ల లోకంవాత పడ్డప్పుడు –

పత్నీసమేతుడయ్యేవరకూ ప్రసాదరావు తల్లిచాటున పెరిగాడు. లోకాన్ని గురించి అతనికి గ్రంథపరిచయంవల్ల కలిగిన జ్ఞానమేకాని ప్రత్యక్షానుభవం సున్నా. సుకుమారి. మనసుకూడా అటువంటిదే. ఎక్కువకాలం తన భావప్రపంచంలోనే ఉంటూండేవాడు. ఆదర్శాలు గొప్పవి.

ఒక కొమ్మను వదిలి మరోకొమ్మను పట్టుకోవాలనే టెన్డెన్సీ కోతులకే కాక మనుష్యులక్కూడా ఉంటుంది. భార్య తనదయేరోజు సమీపిస్తున్నకొద్దీ అతను తన భావప్రపంచంలోనుంచి క్రమక్రమంగా తల్లిని తీసేసి ఆ స్థానం భార్యకివ్వటం మొదలుపెట్టాడు. అందులో తప్పేమీలేదు – తల్లి అసూయాగ్రస్తురాలు కాకుండా ఉంటే. వెంకాయమ్మగారు సంతోషించింది.

ప్రసాదరావెంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది. గృహస్థాశ్రమంలో ప్రవేశించబొయ్యేవాడు తన భార్య ఈవిధంగా మాట్లాడుతుంది, ఈ విధంగా ప్రవర్తిస్తుంది అని నూరురకాలుగా ఊహించుకోనివ్వండి కాక, తీరా దగ్గరికొచ్చేటప్పటికి నూట ఒకటోరకంగా ఉంటుంది. ప్రసాదరావు సంగతి పెంపుడు పిల్లికి తిండి పెట్టుతూండగా అది కాస్తా చెయ్యిపీకిన వాడి సామెతయింది. మర్నాడతని మొహాన కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు. అతనదివరకు రకరకాల ప్రణయకథలు చదివాడు. అనేకమంది స్త్రీలనుగురించి విన్నాడు. ఇదే రకమూకాదు. మీదుమిక్కిలి ఆ పిల్లకు సుశీల అని ఎందుకు పేరుపెట్టారో అతనికి అర్థంకాలేదు. గండుపిల్లని కాని కొండముచ్చునికాని నామకరణం చేస్తే ఎంతో సార్థకంగా ఉండేది.

ప్రసాదరావుకు జరిగిన మరో అపకారమేమిటంటే ఆ కిందటిరోజున కూడా అతను భావప్రపంచంలో భార్యతో అద్భుతంగా సుఖపడుతూ చక్కనికలలు కంటున్నాడు. ఇప్పుడా ముచ్చట తీరిపోయింది. భావప్రపంచం పటాపంచలయింది, కలలు వికలమైపోయినై.

రాయటానికీ - చదవటానికీ సుశీల విపరీతమైన వ్యక్తి అనిపించవచ్చును కానీ ప్రపంచంలో అటువంటి పిల్లలు లెక్కలేనంతమంది ఉన్నారు. పెడకట్టె, మొండిది, మూర్ఖురాలు, ముక్కోపి, నాజూకులేనిది, కట్టెవిరిచినట్టు మాట్లాడేది, మర్యాద తెలీనిది. ఏదైనా లెజిస్లేచరుపెట్టి అటువంటి పిల్లలకు పెళ్ళికాకుండా ఏర్పాటుచేస్తే సంఘం కొంతవరకు తరిస్తుంది.

వెంకాయమ్మగారు కొడుకు దురవస్త చెప్పినట్టు గ్రహించింది. (తల్లీ పిల్లల మధ్య భాష అవసరంలేదు.) లోపల చింతించి ఊరుకుంది. ఒక్క నెలరోజుల్లో ప్రసాదరావు దేవత్వం నుంచి దాదాపు రాక్షసత్వానికొచ్చాడు. ఆవిడ అర్థం చేసుకుని ఊరుకుంది.

వెంకాయమ్మగారికి వంట్లో అస్వస్తతగా ఉండి సుశీల వంట చేసుకోవలసొచ్చింది. ఆ పిల్ల మొహం మటమటలాడుకుంటూ వంట ఇంట్లో చెంబులూ, తప్పాలాలు పగలగొడుతుండగా, ప్రసాదరావు గడ్డం చేసుకోటానికి కాసిని నీళ్ళకోసం లోపలికొచ్చాడు చెంబుపట్టుకుని. అతనింకా అయిదడుగుల దూరంలో ఉండగానే సుశీ అతనిపని కనుక్కుని పంపించక "అయ్యో! అట్లామీదికొస్తారేం?" అంది. అతనికి ఒళ్ళుమండి చేతులో ఉన్న చెంబుతో పెళ్ళాం నెత్తిన లాగి ఒకటికొట్టాడు. దాంతో సుశీల కణతలకు పసుపుకొమ్ము అరగదీసి రాచుకుని ఎవరితోనూ చెప్పకుండా గదిలో ముసుగు పెట్టుకుని పడుకుంది. (ఎవరన్నా మాడుమీద ఒక్కటి పెట్టినప్పుడు కణతలకు పసుపు గంధం వెయమని ఏ వైద్యగ్రంథరాజంలోనైనా చెప్పబడుందేమో నాకు తెలీదు. సుశీల ఒక నేటి డాక్టరురుగారి మేనకోడలు కనక ఆమెకే తెలియాలి.) ఒక పొయ్యిమీద అన్నం మాడిపోయింది. రెండోపొయ్యిమీది గిన్నె ఒరిగి పడిపోయింది. అప్పుడు వెంకాయమ్మగారు మడికట్టుకుంటే పదింటికి కావలసిన వంట పన్నెండింటికి తేలింది.

అనాహ్లాదకరమైన ఈ విషయం మీద ఇంతకన్నా ఎక్కువ రాయటం తగనిపని. నాలుగు నెలలు కాపురం సుశీల ఇదిగిట్టుపాటుకాని వ్యవహారం అని గ్రహించిందో ఏమో ఎవరితోనూ చెప్పకుండా పుట్టింటికి లేచిపోయింది.

## *2*

సుశీల క్షేమం కోరి ఆమెను పుట్టింటినుంచి తిరిగి అత్తవారింటికి తీసుకొచ్చి రాయబారం చేసే పెద్దలు లేకపోయినారు. కానీ మనోవర్తికోసం నోటీసులిప్పించటానికి కావలసినంతమంది దొరికారు. ఆ విషయమై తగిన ఏర్పాటుచెయ్యటానికి ప్రసాదరావు ఏలూరు వెళ్ళాడు. అతనేవిధమైన పేచీలు పెట్టదలచలేదు. వెళ్ళినపని వెంటనే అయిపోయింది. తిరిగి రాత్రి బండి అందుకోగలిగాడు. అతను స్టేషనుకు వచ్చేసరికి బండికింకా చాలా వ్యవధి ఉంది. అతను స్టేషనులోనే భోజనం చేసి తాంబూలం వేసుకుని పచారు చెయ్యటానికి ప్లాటుఫారం మీదికొచ్చాడు. అక్కడెవరూ లేరు. దూరంగా ఒక స్త్రీ కూర్చుని ఉంది. ప్రసాదరావు ఒక్కసారి ముక్కులోనుంచి చాలా గాలివదిలాడు. కొంత కాలం నుంచీ తెల్లబట్ట కట్టుకుని ఆడదికనిపిస్తే అసహ్యం జాస్తయింది. అతను మెల్లిగా ప్లాటుఫారం రెండోచివరకు పోయి అక్కడే తారట్లాడటం మొదలుపెట్టాడు. ఆలోచన ఎటోపోయింది. భావప్రపంచంలో పడి బాహ్యప్రపంచాన్ని మరిచాడు.

"ఏమండోయ్!"

ప్రసాదరావు కొట్టినట్టు ఉలికిపడి తలెత్తి చూశాడు. పలకరించిన గొంతు కటువుగా ఉండకపోవటమే కాకుండా చాలా శ్రావ్యంగా కూడా ఉండటం వల్ల అతనికి ఉలికిపడవలసిన అగత్యం లేదుకానీ ప్రస్తుతం అతనికీ ఆడగొంతుల మాటవరస బాగోలేదు. ఆ మాటకొస్తే సుశీలదీ కొంతవరకు శ్రావ్యమైన గొంతే.

అతను తన్ను పలకరించిన మనిషివంక చూసి ప్లాట్‌ఫారం మరో చివరకు చూపు సారించాడు. అక్కడ మనిషిలేదు. ఆ మనిషే ఈ మనిషి, మనిషి కూడా ఎక్కడ పిల్ల. పదహారేళ్ళు దాటని పిల్ల. బోగంది. రూలు ప్రకారం అతను మళ్ళీ ముక్కులతో బుసకొట్టాడు. తరవాత ఆ పిల్లవంక తీవ్రంగా చూశాడు మెస్మరైజు చేస్తున్నవాడల్లే. కానీ అతని వెనక దీపం ఉండటం చేత ఆ పిల్లకదంతా సరిగా కనిపించి ఉండదు.

"నాకు బెజవాడ కొౕకటిక్కట్టు కొనిపెడతారూ?" అన్నదాపిల్ల. ఆ పిల్లమూతి ఎంత అందంగా ఉంది.

"అట్లాగే! డబ్బులు తే!"

ముక్కు? ఏం ముక్కు.

"నా దగ్గిరలేవు" అందాపిల్ల.

"నన్ను పెట్టుకోమంటావా?" కళ్ళు.

ఆ పిల్లకు కొద్దిగా కోపం వచ్చినట్టు కనపడ్డది

"ఉచితంగా ఇవ్వక్కర్లేదు. బదులివ్వండి."

"అవును. తరవాత మనం మనం లెక్కచూసుకునేటప్పుడు"

ఆ పిల్లకీసారి బాగా కోపం వచ్చింది.

"అందాకా ఈ ఉంగరం అట్టేపెట్టుకోండి" అని ఆ పిల్ల వేలి ఉంగరం తీసిచ్చింది.

గడ్డం? కనుబొమలు? జుట్టువేళ్ళు? అనుకుంటానే అతను నిర్మొహమాటంగా చెయ్యిచాచి ఉంగరం తీసుకున్నాడు.

"ఈ ఉంగరం ఖరీదెంత ఉంటుంది?" అన్నాడతను ఉంగరం అటూ ఇటూ తిప్పిచూసి.

"డెబ్బై అయిదు."

"బాష్! ఇదేదో ఇమిటేషన్ రాయి."

"మీరిచ్చేటిక్కెట్టు డబ్బులకు సరిపోతుంది లెండి" అన్నదాపిల్ల.

అతనామాట వినిపించుకోకుండా "ఇదయితే నీకెట్లాదొరికింది?" అన్నాడు.

ఆ పిల్ల చ(రుమన్నది. "మీకు మర్యాద తెలీదు. ఉంగరం ఇటుతెండి" అన్నది.

ప్రసాదరావు ఇచ్చేశాడు. ఆ పిల్ల తీసుకుని వెళ్ళబోతున్నది.

"ఉండు. నీకిచ్చే రైలు చార్జీకి తాకట్టవసరంలేదు. టిక్కెట్టు కొనిపెడతాను."

అతనీమాట అంటూండగానే పోర్టరు గంటకొట్టి వెళ్ళాడు.

"ఇక్కడే ఉండు. టిక్కట్లు తెస్తాను."

ఆ పిల్ల అక్కడే ఉంది.

ప్రసాదరావు ఆమెచేతికి టిక్కెట్టిచ్చి మళ్ళీ సంభాషణ మొదలుపెట్టాడు.

"నేనిందాక అన్నమాటలు నీకు రుచించినట్టు కనబడదు. మూడు సంగతులు జ్ఞాపకం పెట్టుకో, నేను ఆంటీనాచి, ఆంటీ ఫెమినైన్. నీచర్యంతా ఫిషీగా ఉంది"

"అంటే?"

"ఫౌల్."

ఆ పిల్ల చిరునవ్వు నవ్వి "నాకంతవరకూ అర్థమౌతుది."

"నీకింగ్లీషుకూడా వచ్చునా ఏమిటి?"

"నేను స్కూలు ఫైనల్ పాసయినాను."

"వెరీగుడ్! నీ సంగతంతా ఫిషీగా ఉందని నిరూపిస్తాను చూడు. మీదేవూరు? నేను బెజవాడ పోతున్నానని నీకెట్లా తెలిసింది?–"

"నాకు తెలీదు"

"నేను నమ్మను ఒంటరిగా ఎందుకుపోతున్నావు?"

"నన్నదంతా అడగకండి. గాయం కెలికినట్టవుతుంది."

ప్రసాదరావు అకస్మాత్తుగా మాట్లాడటం మానేశాడు.

త్వరలోనే రైలొచ్చింది. దాదాపు పెట్టెలన్నీ ఖాళీగానే ఉన్నై. ప్రసాదరావు చిన్నపెట్టెగా చూచి ఎక్కాడు. బోగంపిల్లకూడా అతని వెనకనే ఎక్కి, "మీకభ్యంతరంలేదు. ఇందులోకూడా చాలామంది ఎక్కవచ్చుననేది మరిచిపోకు."

ఆ పిల్ల నవ్వి "ఎక్కరు" అంది.

ఆ మాట అతనికి దబ్బున అర్థంకాలేదుకానీ కాగానే శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది. తన బతుక్కటువంటి పెళ్ళాం కూడానా.

అతనాపిల్లవంక తీక్షణంగా చూశాడు. కానీ ఆ చూపు వ్యర్థమయింది. ఆ అమ్మాయి రెండోబల్లమీద కంపార్టుమెంటు అవతలివైపు కిటికీదగ్గర కూర్చుని బయటికి చూస్తున్నది.

ఆ పిల్ల అన్నట్టే అయింది. ఒకరిద్దరు ఆ పెట్టెలో ఎక్కాలని ప్రయత్నం చేసి ఇద్దర్నీ చూచి పక్కకు పోయినారు. రైలు కదిలింది. ఆ పిల్ల బయటికి చూడటం మానేసి అతనివంక చాలాసేపు చూసింది. అతనటువైపు చూడలేదు. చివరకామె లేచి అతనికి దగ్గరకూర్చుని "మీ అనుమానాలకు సమాధానం చెబుతాను," అన్నది.

అతను పరధ్యానంగా "ఎందుకు? నాకనవసరంలేదు" అన్నాడు.

"నన్ను గురించి మీరు దురభిప్రాయం పడుతున్నారు. అది నాకిష్టంలేదు."

ప్రసాదరావు కనుబొమలు ముడేశాడు.

"దురభిప్రాయానికి అవకాశంలేదు. నీ అభిప్రాయమేదో స్పష్టంగానే తెలుస్తున్నది."

ఒక్కసారి ఆ పిల్ల మొహం బాధపడుతున్న లక్షణాలు కనబరిచింది.

"మీరు నిజంగా క్రూరమైన మనిషి కారనుకుంటాను. ఎందుకంత హింసించినట్టు మాట్లాడతారు? "

"క్రూరమైనమనిషిని ఎందుక్కాను? కావాలంటే నా పెళ్ళాన్ని అడుగు" అన్నాడతను వికటంగా నవ్వి.

ఆ పిల్ల దీనంగా చూడటం మొదలుఎట్టింది.

"నీ అభిప్రాయాన్ని గురించి నాకెటువంటి అనుమానం లేదు. చూశావు. కుర్రవాడుగా ఉన్నాడు, అమాయకుడేమో బుట్టలో వేద్దామనుకున్నావు. లేకపోతే స్టేషనులో అంతమంది ఉండగా నన్నే ఎందుకు టిక్కెట్టు అడిగినావు? బెజవాడకే ఎందుకు కావాలిసొచ్చింది? నేను ఎక్కినపెట్టిలోనే ఎందుకెక్కావు? నువ్వు చెప్పిన సమాధానమేమిటి ఈ పెట్టెలో ఇంకా ఎవరైనా ఎక్కుతారంటే? ఇంకేమైనా నామీద ఆశలుంటే ఇప్పటికైనా వదులుకో. నాకర్థంకానిదల్లా ఒకటే. ఇంత చిన్నదానివి నీకింతధైర్యం ఎట్లావచ్చిందా అని. "

ఆ పిల్ల అతననుకున్నట్టు ప్రవర్తించలేదు. మొహానికి చీర అడ్డంపెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. అంతటితో అతనిధైర్యం యావత్తూ అంతరించింది. పైన ఒక్కపొర ఘనీభవించి చూడటానికతని మనస్సు పాషాణమల్లే ఉంది కాని అతని మనస్సులోపల జావగా ఉంది. ఆ పిల్ల ఏడుపు పైపొరను కొట్టేసింది. అతనామెను సమీపించి మెల్లిగా "చూడు" అన్నాడు. ప్రయోజనం లేకపోయింది. ఇంకోసారి కొంచెం గట్టిగా "చూడు" అన్నాడు. ఉహూఁ అతను బలవంతంగా ఆమె మొహం మీదనుంచి రెండుచేతులూ తీసేశాడు. ఆ కళ్ళూ, మూతీ, గడ్డం, ముక్కూ అంత సమీపంలో చూసేటప్పటికతనికి మతిపోయి ఆ దొండపండంటి మూతిని కాస్తా ముద్దుపెట్టుకున్నాడు.

పెద్దమనిషి చెయ్యవలసినపనికాదు. ఆ పిల్ల బోగందయినా, ఆమె అనుమతిలేకుండా, తన్ను నివారించలేని స్థితిలో ఉండగా అటువంటి పనిచెయ్యటం చాలా నింద్యమైన సంగతి. ఆ వివేచన ఇంకా చాలా విషయాలు తెలిసొచ్చినై. మొదటి సంగతి అతనంతవరకు

ఆ పిల్ల విషయంలో ఒక్కసారైనా పెద్దమనిషి తరహాగా ప్రవర్తించలేదు. మరోసంగతి ఆ పిల్లచర్య కింకో కారణం ఉండికూడా ఉండవచ్చును. అప్పుడే ఆపిల్లను బలాత్కారంగా ముద్దుపెట్టుకున్న మోహంతో ఆలోచిస్తే తన చర్యలో ఆపిల్ల చర్య నూరోవంతు అనుమానాస్పదంగా లేదు.

ఆ పిల్ల లేచి ఎడంగా పోయింది. అతని కామెవంక చూడటానికి ధైర్యంలేకపోయింది. అతనికామెవంక చూడటానికి ధైర్యంలేకపోయింది. కానీ మొండితనం చేసి ఆమెవంక చూశాడు.

"ఆ గొలుసు లాగితే బండి ఆగుతుంది. లాగు!" అన్నాడు. ఆమె అతనివంక బోనులో సింహం వంక చూస్తున్నట్టు చూస్తూ నిలబడ్డది.

అతను మొహం చేతుల్లో పెట్టుకుని "నాకు మతిచెడిపోయింది. నేను వెనకటి ప్రసాదరావును కాను" అని గొణుక్కున్నాడు. అయిదునిమిషాలసేపిద్దరూ కదల్లేదు. ఆ పిల్ల మెల్లిగా వచ్చి అతని భుజం మీద మెల్లిగా చెయ్యి వేసి "మీరేమీ పశ్చాత్తాప పడక్కర్లేదు. నాకన్నా మీకే మోసం ఎక్కువ మీరు చేసిన పనివల్ల. నేను మిమ్మల్ని బుట్టలో వెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాను కనక నాకు కష్టంగా ఉంటుందని మీరనుకోటానికవకాశంలేదు," అంది.

ప్రసాదరావు తలెత్తి "నేనెట్లాగూ పెద్దమనిషిని కానని నిరూపించుకున్నాను. నువ్వితవరకు చాలా పెద్దమనిషిగా ప్రవర్తిస్తూవచ్చావు. ఆ ఒక్క మాటతో నన్ను వదిలెయ్యి," అన్నాడు.

ఆ పిల్ల క్లుప్తంగా "క్షమించండి" అంది.

ఆ మాటతో అతనికాపిల్లను చూస్తే చాలా గౌరవం కలిగింది. ఇద్దరి పరిచయం ఇంతవరకు వచ్చిన తరువాత తన మనస్థితంతా ఆమెకు చెప్పేద్దామనుకున్నాడు. తన భార్య గోలంతా చెప్పాడు. తన మనస్సు విరిగిపోయిందన్నాడు. లేకపోతే తనట్లా ప్రవర్తించాలిసింది కాదన్నాడు. ఆపిల్ల అంతా ఓపిగ్గావిని తన కథంతా చెప్పింది.

ఆ పిల్ల పేరు కాంతం. ఆమె మేనమామ సంఘసంస్కారి. అనేకమంది బోగం వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయించాడు. ఆ పిల్లనాయనే పెంచి చదువు చెప్పించి పెళ్ళికి ప్రయత్నంచేస్తూ చనిపోయినాడు. తరవాత కాంతం తల్లి దగ్గరికొచ్చింది. తల్లి కూతుర్ని వృత్తిలో దిగమని ప్రోద్బలం చేసింది. కూతురు వినలేదు. తల్లి దొంగెత్తువేసి పెళ్ళనే వంకపెట్టి ఒక ఎద్దుకంటగట్టింది కాంతాన్ని. కాంతం ఆయన్ను పెళ్ళి చేసుకోనంది. బోగం పిల్లలను పెళ్ళిచేసుకునేందుకు రంభలు రారని గట్టిగా చెప్పేసింది తల్లి, ఈ పని జరిగిన కొద్దిరోజులకు ఆ వేశ్యమాత కూడా చచ్చిపోయింది. ఆ ఎద్దు కాంతం తల్లిదగ్గర ఉన్న సామానంతా అమ్మి "మా ఊరు ఏలూరు. మా ఇంటికిపోదాం పదమ"ని ప్రయాణం చేశాడు. ఏలూరులో ఒక సందులో బండి ఆపి ఇక్కడే ఇల్లు దిగమన్నాడు. కాంతం దిగటంతోటే బండి స్టేషను దారిపట్టింది. ఆ ఎద్దుకు దిగిన బండే అంది ఉంటుంది. కాంతం రైలుకు దారికనుక్కుని స్టేషను చేరేటప్పటికి రైలుపోయి చాలాసేపయింది. కాంతం భోజనం చేసి పన్నెండుగంటలు దాటింది.

ఇదంతా కాంతం చెబుతానన్నప్పుడతను చెప్పనియ్యకపోవటం మేలే అయింది. అప్పుడైతే అతనికిదికూడా పార్ట్ ఆఫ్ ది గేమ్ అనిపించేదే ఇప్పుడతని గుండె నీరయిపోయింది.

"బెజవాడలో మరి నీకెవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"మా స్నేహితులున్నారు. కొంతకాలం వాళ్ళ అండన పడి ఉంటే తరువాత ఏమవుతుందో? మా మామయ్య స్నేహితులున్నారు. వాళ్ళ మొహం ఎట్లాచూడను?"

"నువ్వెప్పటికైనా కులవృత్తి చెయ్యవలిసొస్తుందేమో! నీకిష్టం లేదుకదూ?"

"నిజం చెప్పటంకన్నా నిజమే ఎక్కువ. ఇష్టంలేక పోతే లేదని అనుకోటవల్ల ఒరిగేదుందా?"

"లేదు. నువ్వు చాలా అద్భుతమైనదానివి."

"నేననేదదే! మీరు నిజంగా అట్లా భావిస్తే పైకనరు."

మనిషికి బుద్ధిలేదు. అతనికి కాంతాన్ని మళ్ళీ ముద్దుపెట్టుకోవాలనిపించింది. ఈ అనిపించటం అయినా తప్పయి ఉండాలి, అంతకు పూర్వమే కలిగిన అతని పశ్చాత్తాపమయినా అర్థంలేనిదయి ఉండాలి. ఎట్లాగైనా అతనికి బుద్ధిలేనట్టే.

"నన్ను మాట్లాడనివ్వవు. రోజూ నీవంటిదానితో సంచరించటం బహుకష్టం"

"ఇంత అద్భుతమైన దాన్నయినా?"

ప్రసాదరావు కాంతం రెండుచేతులూ పట్టుకున్నాడు.

"ఎక్కడికీ వెళ్ళవద్దు. నాదగ్గిరే ఉండు, కాంతం."

"ఎవరికోసం ఉండను?"

"నీకిష్టమైతే నాకోసం."

"మీరు నాతో సుఖపడరు"

"పడతాను."

"లోకం మిమ్మల్ని చెండుకు తింటుంది."

"నేను లెక్క చెయ్యను."

"చేస్తారు. ఎవరో ఒప్పుకోకపోతే మీరు లెక్కచెయ్యకపోవచ్చు. మీ అమ్మగారే ఉందనుకోండి."

ప్రసాదరావు నిట్టూర్పు విడిచాడు.

"ఆవిడ ఒప్పుకుంటే మీ దగ్గిర ఉంటాను. మీ సుఖం కోసం కాదు, నా తిండికోసం కాదు, మీకోసం ఉంటాను. ఆవిడ ఒప్పుకోకపోతే ఉండను."

*3*

బెజవాడలో ఇద్దరూ దిగారు. ఒకబండి ఎక్కారు. ఇద్దరు పోవలిసింది ఒక వైపే. మధ్య కాంతం బండి ఆపించి దిగింది. ప్రసాదరావు ఇల్లు గుర్తుపెట్టుకున్నాడు. ఇంట్లో అడుగుపెడుతూనే తల్లితో చెప్పుదామని అతని ఉద్దేశం. కానీ తల్లి మొహం చూడగానే అతనికి ధైర్యం లేకపోయింది. అతని స్థితి కాలుగాలిన పిల్లల్లే ఉంది; ఉత్త శరీరసంబంధమయిన అందం మరుపుకొస్తుంది. కాంతాన్ని ఎట్లా మరిచిపోతాడు? తను కాంతం విషయంలో చూపించిన అన్యాయం, నిర్దయ, మోటుతనం. తన అహంకారం? తనలో ఏం చూసి కాంతం తన్ను బుట్టలో వేసుకోవాలని ప్రయత్నం చేస్తుందిట? కాంతం అన్న ఒకొక్క మాట గంటమోగినట్టు చెవిలో మోగుతుండేవ్. తనన్న మాటలు తలుచుకుంటే ప్రాణం చచ్చిపోతుండె అవి ఇంకా నాలుగైదుసార్లు జ్ఞాపకం వస్తే మర్నాడు కాంతం మొహం చూసే ధైర్యం కూడా ఉండదు తనకు.

సుశీలతో పోల్చినా, ఎక్కడి కాంతం, ఎక్కడి సుశీల!! కాంతాన్ని చూస్తే ఉన్న గౌరవం తనకింకెవర్నీ చూస్తే లేనప్పుడు ఇంకోళ్ళేమనుకుంటారో అనే ఆలోచనెందుకొస్తుంది? కాని తల్లి? –

అతనికి ఒంటిగంటకు కాని నిద్రపట్టలేదు, మర్నాడు లేచేటప్పటికప్పుడే బాంబు పేలింది. వెంకాయమ్మగారి కప్పుడే రిపోర్టు వచ్చింది ప్రసాదరావు బోగందానితో రైలుదిగాడని ఓరూ, బండిలో ఎక్కాడని ఓరూ! వెంకాయమ్మగారు లేవగానే కొడుకును ప్రశ్నించింద్మి. పాచిమొహంతో ఒక్క అబద్ధమైనా ఆడకుండా అతను తల్లికి చెప్పదగినంతవరకు చెప్పాడు.

వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయింది.

"కాంతాన్ని ఇంతప్పుడు చూశానురా, అబ్బాయి. వాళ్ళనాన్న రామదాసు మీ నాన్నకు స్నేహితుడు. జ్ఞాపకం ఉందా? ఎర్రబొట్టు నిలువుగా పెట్టుకుని, తలగుడ్డ చుట్టుకుని, మీసాలూ ఆయనా! మంచివాడు, పాపం ఆయన పెళ్ళాంతో ఈ పిల్ల ఒకరోజున పేరంటానికొచ్చింది మనింటికి. దాన్ని మళ్ళీ ఒకసారి తీసుకురా, అన్నదావిడ నవ్వుతూ.

"ఇవాళ్ళే తెస్తాను" అన్నాడు ప్రసాదరావు నిశ్చింతగా.



# అనగనగా ఓ మంచి కథ

# దృక్పథాలు

## క్రొవ్విడి లక్ష్మన్న

(భారతి మాసపత్రిక, 1945 మార్చి సంచికనుంచి పునర్ముద్రణ)

ఆనాడు జూనియర్స్ కి సీనియర్సు ఆహ్వానపు విందు. కాలేజీ కళకళలాడుతోంది విద్యార్థి విద్యార్థినీ సమూహంతో. ప్రొఫెసర్లు, స్టూడెంట్లు అందరి మొహాల్నీ చిరునవ్వు తాండవమాడుతోంది. చక్కగా అలంకరింపబడ్డ క్లబ్ రూమ్ లో సుఖాసీనోపవిష్టులయి అంతమందీ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒకరి నొకరు ఎరికపరుచుకుంటూ కరస్పర్శలు చేస్తున్నారు. ఆడా మగా కలిపి ఓ పాతికమంది వుంటారు; అంతా ఎం.ఏ. తరగతి వాళ్ళే. కృష్ణమూర్తి భువనైక మోహనమూర్తి; ఆహ్వాన సంఘ కార్యదర్శిన్నీ. విశాలమయిన ఫాలభాగం, కుడిప్రక్కని కొంచెం వంకీలు తిరిగి పైకి నొక్కి దువ్విన క్రాఫింగు, నిమ్మపండులాంటి శరీరచ్ఛాయా, సమమయిన ఒడ్డూ పొడుగూ అతన్ని చూడగానే కలుగజేసుకుని మాట్లాడాలనిపిస్తుంది. ఎప్పుడూ మడతలు తప్పని దుస్తులు అతను గొప్పయింటివాడని చెప్పక చెబుతూ వుంటాయి. ఆ వేళ మరీ యిదిగావుంది అతని ముస్తాబు. ఆల్ స్టర్ కాలరు, డిన్నరు టై, కాశ్మీరు సూటూ, నిగనిగలాడే బూటూ ఆతని అందాన్ని ద్విగుణీకరించేయి. సిగరెట్టు వయ్యారంగా పెదిమచివర నంటించి, సిల్కు రుమాలుతో కళ్ళద్దాలు తుడుస్తూ తోడిస్నేహితుడితో మాట్లాడుతున్నాడు. "అయిదు నిముషాలుంది అల్పాహారాలు పుచ్చుకునే వేళకి ; యింకా ఒకరిద్దరు విద్యార్థినులు రావాలి కూడాను." అంటూనే మేడ కిటికీలోనించి వాళ్ళకోసం తొంగి చూస్తున్నాడు. సరీగా రెండు నిముషాల వ్యవధి వుందనగా రత్నం, సరోజా వచ్చేరు. సరోజ కృష్ణమూర్తి స్నేహితుడి చెల్లెలు; క్లాసుమేటున్నూ. ఆమె ద్వారా జూనియర్ లో అప్పుడే చేరిన రత్నాన్ని కూడా పరిచయం చేసుకున్నాడు.

వచ్చీరావడంతోనే అందర్నీలాగే కృష్ణమూర్తిని కూడా ఆకర్షించింది రత్నం. కేవలం నూతన వ్యక్తి అవడంచేతనే కాదు; ఆమె మూర్తీభవించిన రతీదేవిలాగ వుండడం చేతనే. కాని రత్నం సంసారుల పిల్ల. మెడలో సన్నని గొలుసూ, చేతికి చిన్నవాచీ తప్ప యింకే అలంకారాలూ లేవు. అయినా అతి అందంగా కనిపిస్తుంది చిత్తరువులో బొమ్మలాగా, అంత మరీ గుండ్రంకాని ముఖం, సన్నని చాదుబొట్టూ, గులాబి రెక్కల్లాంటి పెదిమెలూ, కూర్చిన ముత్యాల కోవలాంటి పల్వరుస, ఎప్పుడూ ప్రసన్న భావాన్ని తెలుపుదు చేసే మందహాసం ___ యివి చాలవూ రత్నాన్ని సానపట్టిన రత్నంలాగ ప్రదీపింప చెయ్యడానికీ ?

అందరూ టీ ఫలహారాలు పుచ్చుకుంటున్నారు. మర్యాద తప్పకుండా ప్రతీవారితోనూ ఒకటి రెండు నిమిషాలు మాట్లాడి కృష్ణమూర్తి సరోజా, ఆమె అన్న వెంకట్రావూ ఉన్న మేజా దగ్గిరికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. మూర్తి మొహంలో ఏదో వెలితి కనిపించింది వెంకట్రావుకి, అడిగేడు "ఇవాళ కొంచెం హుషారు తక్కువగా కనిపిస్తున్నావేఁవి"టని.

కృ ___ ఏమిటో మొన్న గ్రేండు హోటలు మీటింగులాగ లేదు. అంతా మీడియోకర్.

వెం ___ ఏ విషయంలో ?

కృ ___ ఈ సమావేశమయిన వాళ్ళకి అసలు స్టేటస్సే లేదు, నువ్వూ నీ చెల్లెలికీ మినహా. అంత బొత్తిగా నేలను ప్రాకులాడేవాళ్ళతో కలిసికట్టుగా వుండడం కష్టం.

వెం ___ బాగానేవుంది. ఇది సంఘానికి సంబంధించిన సమావేశం. ఎం.ఏ. రెండు క్లాసుల్లోనూ వున్న వాళ్ళు ఒకరి నొకరు బాగా తెలుసుకోవాలనీ. నేర్చుకోతగ్గ విషయాలు పరస్పరంగా సేకరించాలనీ కాదూ దీని అభిమతం ?

సరోజ ___ సొసయిటీలో చిన్నా పెద్దా కూడా ఉంటుంది అంతస్తు. అంత మాత్రం చేత ఉల్లాసభంగం ఎందుకు చేసుకోవాలి కృష్ణా ?

కృ ___ మీ ఉపన్యాసాలు వరవళ్ళు వ్రాసుకోడానికి చాఖ్కగా పనికొస్తాయి. కాని ఒక్క విషయం మీరు వుభయులూ మరిచిపోయేరు. ఉల్లాసం అనేది దానంతట అది కలగాలి; ఎరువు తెచ్చుకో తగ్గది కాదు. నటించినంత మాత్రాన్ని ఆత్మకి ఎంతమాత్రం సంతృప్తి కలగదు.

సరోజ ___ నటించవలసినంత అగత్యం ఏమొచ్చిందీ అంట.

కృ ___ సమాన వియ్యం, సమాన కయ్యం కాక పోయినప్పుడు నటనకాక మరేముంటుందీ ?

వెం ___ అందరమూ పోస్టుగ్రాడ్యుయేట్సుఁవే గదట్రా.

కృ ___ ఎప్పుడూ పుస్తకాల గొడవేనా ?

వెం ___ ఏ సందర్భమయినాను. అందరమూ బి.ఏ. ప్యాసయినవాళ్ళమవడం చేత ఆత్మ–బుద్ధీ ఒక పరిణతికి వచ్చి సమస్యల్ని సమానంగా బోధపరుచుకుని చర్చించగలమని నేననుకుంటాను.

కృ ___ అబ్బాయ్, నువ్వు ఎన్ని చెప్పినా ఆదర్శాలే మాట్లాడుతున్నావు. అనుసరణకీ ఆదర్శానికీ చాలా తేడా వుంది.

సరోజ ___ సరేలే, కోడిగ్రుడ్డంత బంగారం లేని వాడున్నాడా అని వాడికోసమే వెతుక్కోవడం దోషం కాదూ?

కృ ___ అదే దోషమయితే నాఖర్మం. అడ్డమయిన వాళ్ళతోటీ, రెండక్షరాలున్నాయి గదా అని, నేను కలిసిమెలిసి తిరగలేను.

"ఈ ప్లమ్ కేకు చాలా రుచిగా వుంది, యింకోముక్క పుచ్చుకుంటావా కృష్ణా" అంటూ ధోరణి మార్చేసింది సరోజ అర్థవంతంగా అన్నవంక చూస్తూ. ఎప్పుడూయింతే. ఇలాంటివి ఎన్నో సంఘటనలు వచ్చేయి; కాని తెగేవరకూ లాగే స్వభావం కాదు సోదరీ సోదరులది. ఇంక కృష్ణమూర్తి మనస్సు చివుక్కుమంటుందనేసరికి ఎవరో ఒకరు పట్టా తప్పించేస్తారు.

కృష్ణమూర్తి తండ్రీ, వెంకట్రావు తండ్రీ బాల్య స్నేహితులు; ఇరుగుపొరుగు గ్రామాలకి ప్రొప్రయిటర్లున్నూ. కృష్ణమూర్తి తండ్రి చిన్నతనంలోనే కాలం చెయ్యడంచేత అతని వ్యవహారాలన్నీ వెంకట్రావు నాన్నగారే చూస్తూ ఉండేవారు. అదే కారణం కృష్ణుడూ, సరోజా–వెంకటావులూ ఏకగర్భజనితుల్లాగ వుండడానికీ, ఒకరినొకరు అర్థం చేసుకోడానికిన్నీ. వెంకట్రావు తండ్రి నాలుగు దేశాలు తిరిగినవాడు; అతని ప్రొప్రయిటరీ అంతా స్వార్జితం. కష్టం సుఖం అనుభవించిన వాడవడంచేత హృదయ వైశాల్యం ఏర్పడింది. ఆ అంకురాలు సంతతిలో కూడా నాటుకున్నాయి. కృష్ణమూర్తి తండ్రి ఆగర్భ శ్రీమంతుడు. తాతముత్తాతల నాటినుండీ వస్తూన్న జమీందారీ. చిన్నప్పట్నుంచీ గుర్రబ్బగ్గీల్లోను,

మోటారు కార్లలోను కాలం వెళ్ళబుచ్చినవాడు. అంచేతే కృష్ణమూర్తికి కూడా దర్జా ప్రధానం. ఎంత చదువుకున్నా మాటల్లోనూ, చేష్టల్లోనూ అహం కనిపిస్తూ ఉంటుంది. తను అవగాహన చేసుకోలేని విషయం లేదనే తొందరపాటు కూడాను.

ఈ పరిస్థితుల్లో రత్నం పక్కలో బల్లెంలాగా ఉండేది అతనికి. రత్నం ప్రపంచకాన్ని ఎప్పుడూ సరళంగా అర్థం చేసుకునేది. తన అంతస్తూ, ఎదటివారి మనస్సు గుర్తించి మెలగనేర్చిన మనిషి. అనవసర విషయాలలో ఎప్పుడూ జోక్యం కలుగజేసుకునేది కాదు; కాని తాను కలగజేసుకోవలసే వస్తే, విషయాన్నికూలంకషంగా గ్రహించి మథించి తన వ్యక్తిత్వాన్ని స్థాపించుకుంటూ వుండేది. ఈమె అంటే అందరికీ అంతగౌరవం ఏర్పడ్డానికి ఈమె కుశాగ్రబుద్ధే కారణం. కాని కృష్ణమూర్తి మాత్రం ఎంతైనా తనకంటే పై చెయ్యికాదని అపోహపడుతూ ఉండేవాడు. ఆసలా విషయం పట్టించుకునేవాడు కాదు. సమానవియ్యం(Statusquo) కావలసినవాడాయిరి! అలాగని ఊరుకోనూ లేకపోయేవాడు ఆమెని గురించిన ప్రశంసలని వింటూ.

ఇంతట్లోకి "కాలేజిడే" ఉత్సవం సమీపించింది. అటపాటల పోటీలు జరిగే సమయం; సత్తా తెలియ వలసిన ఆవశ్యకమున్నూ. ఒకనాడు సాయంత్రం వెంకట్రావు, సరోజ, రత్నం కలిసి టీ త్రాగుతూవుంటే కృష్ణమూర్తి వచ్చేడు. సరోజ ప్రక్కని రత్నాన్ని చూడ్డంతోటే ఆతని ఉత్సాహం కొంత తగ్గింది. ఆ విషయం సరోజా వెంకట్రావులు గమనించకపోనూ లేదు. మాటల ధోరణి కాలేజీ పోటీలవైపు మళ్ళింది. రత్నం విజ్ఞానాన్ని వెంకట్రావు, అతని చెల్లెలు హృదయపూర్వకంగా మెచ్చుకుంటూ మాట్లాడుతున్నారు. కృష్ణమూర్తికి యిది కష్టంగా తోచినా, బాగుండదని, ఏమయినా "టిప్స్" యిమ్మన్నాడు రత్నాన్ని సంబోధిస్తూ.

"మీరు నాకంటే సీనియర్సు. మీకు నేనేం హింట్స్ యివ్వగల్ను ? మీ దగ్గర నేర్చుకోవాలిగాని"

"అదీ నిజమేననుకోండి. అయినా..." అని అర్థోక్తిలో వదిలేసేడు కృష్ణమూర్తి. దాని ధ్వని రత్నం వెంటనే గ్రహించింది. డబ్బుగలవాడయినంత మాత్రాన్ని అన్ని సుగుణాలూ తనకైవసం అయినట్టు భావిస్తున్న వెంగలి గదా అని విచారించింది; కోపం తెచ్చుకుంది. ఈ మధ్యలో యింకోపొరపాటుకూడా చేసేడు కృష్ణమూర్తి. "ఎల్లుండి నా పుట్టినదినం. మీరు ఉభయులూ భోజనానికి రావాలి" అన్నాడు సరోజ వైపు చూస్తూ; ఆమె కళ్ళతో ఏమందో మరి, ఉత్తరక్షణంలోనే "మీరున్నూ" అన్నాడు రత్నంవంక తిరిగి. దీంతో ఆమెకి అతనితత్వం బాగా బోధపడిపోయింది. ఆమెహృదయం హేయభావంతో నిండి పోయింది. అయినా మర్యాదభంగం కలగకుండా "చాలా సంతోషం" అంది. యింటికి వచ్చి వెంటనే "మీ పుట్టినరోజు పండగకి నా అభినందనాలు. కారణాంతరాలచేత మీ యింట భోజనానికి రాలేను. క్షమించండి" అని ఓ ఉత్తరం ముక్క వ్రాసి టపాలో పడేసింది.

★★★

ఆరోజు స్వర్ణాక్షరాలతో లిఖించుకుంది రత్నం. అదే ఆమెకి ప్రథమవిజయం లభించిన దినం. రంగు కాగితాల దండలతోనూ, అరటిస్తంభాలతోనూ అలంకరించిన షేమియానాలో పౌరులూ, విద్యార్థులూ అంతా కూర్చున్నారు. అయిదుగురు తగుమనుష్యులు మేజా వద్ద వేదికపైని వున్నారు. ఉపన్యాసాలపోటీ సరిగా వేళకి ప్రారంభించేరు. ప్రేక్షకులలో ఉత్సాహం, చర్చలూ బయలుదేరేయి. ఇంతట్లోకి కృష్ణమూర్తి వంతు వచ్చింది. అతను వేదికమీద కనిపించగానే చప్పట్లు మిన్ను ముట్టిపోయినాయి. లోకం గొర్రెల మందలాంటిది. ఒకడు దారితీస్తే సరి. ఒకడు ఓడు అంటే కంచమంతా ఓడే. లేకపోతే అతను నోరు విప్పకుండానే అంతగల్లంతు ఎందుకూ ? కృష్ణమూర్తికి సత్తా ఒక యెత్తూ, అంగులు రెండెత్తులూనూ, అసలు పసలోవున్న వెలితిని షోకూ, ఫోజూ, గ్రేసూ కమ్మేస్తూ వుంటాయి. గత నాలుగైదేళ్ళ బట్టీ ఆకాలేజీలోనే చదివినవాడేమో స్థానిక బలం కూడా వుంది. ఉపన్యాసం ముగిసే సరికి ప్రేక్షకలోకంలో హర్షధ్వానం మరీ యినుమడించి పోయింది. ఆఖరుకి రత్నం మాట్లాడవలసి వచ్చింది. ఈమె పూర్వోత్తరాలు ఎవ్వరికీ తెలియవు. ఆమె ఆరంభించేసరికి నిష్పాక్షికదృష్టులే ప్రసరించేయి. కాని మొదటి అయిదునిముషాలు అయే లోపలే ముమ్మారు "హియర్ హియర్" అనే కేకలు వినవచ్చేయి. ఒకానొక సందర్భంలో కరతాళధ్వనులకి అంతం

లేనట్టు కనపడి, ఆమె చెప్పేమాట వినపడకుండా పోయేసరికి, ఒక్క క్షణం తాత్కాలికంగా ఉపన్యాసం ఆపి మరీ అందుకోవలసివచ్చింది. అయిదుగురు న్యాయమూర్తులూ ___ ఒక్క వీరేనేవిఁటి ? ___ యావన్మంది సభ్యులూ ఆమెకే చెవులు అప్పగించేరు. ఒకసారి కృష్ణమూర్తే అన్నాడు "భేష్" అని అప్రయత్నంగా, తరవాత నొచ్చుకొన్నానూ. చివరకి ఫలితాలు చెప్పేరు. మొదటి బహుమానం రత్నానిది ; రెండోది కృష్ణుడిదిన్నీ. న్యాయం సరిగ్గానే జరిగిందని కృష్ణుడి అంతరాత్మకీ తెలుసును. అయితేనేం ? అతనిలోని అహం ఆ భావాన్ని వెలికి రానిచ్చింది కాదు. ఒకళ్ళిద్దరు ఆత్మీయులు కృష్ణుడి ప్రవర్తనకి కించపడి మందలించేరు కూడాను.

సరే యీ ఆడదాన్ని ఆటల్లోనైనా ఓడించలేకపోతానా అనుకున్నాడు మూర్తి. యిద్దరూ మర్నాడు టెన్నిసుకోర్టులో నిల్చున్నారు. ప్రేక్షకజనంలో ఉత్సాహానికి అంతులేదు. సమాన ఉజ్జీ అన్నారు కొందరు. కృష్ణమూర్తి నెగ్గేస్తాడన్నారు మరికొందరు. ఏమో చెప్పలేం ; నిన్ననూ యిలానే అనుకున్నాం అన్నారు యింకా కొందరు ఆత్మప్రబోధం కలిగినవాళ్ళు. ఆ అమ్మాయి గంభీరమయిన ముఖవర్చస్సులోనే తెలియడం లేదూ విజయసూచన అన్నారు పెద్దలు. ఆట మొదలయింది. స్నేప్ షాట్సుకోసం సిద్ధమయినవాడిలాగ ఎడమచేత్తో బంతినెగరేసి విల్లు వంపుగా కుడిచెయ్యి చాచి సెర్వ్ చేసేడు కృష్ణుడు. బంతి రివ్వున ఎగిరి "నెట్టు" ని ఢీకొని ప్రక్కకి తొలిగింది. ఠట్. చేతిలో రెండోబంతిని ప్రయోగించేడు. రత్నం అణుమాత్రమయినా చలించకుండా బేటు బల్లపఅపుగా వుంచి బంతిని అధోతలాన్ని స్పృశించింది. "బ్యూటిఫుల్ స్క్యూ" అన్నది ప్రేక్షక లోకం. వయ్యారంగా భ్రమిస్తూ వస్తూన్న బంతిని ఆచిపెట్టి తట్టేడు కృష్ణుడు. తగిన సమయస్ఫూర్తితో బేటు అంచు అడ్డుపెట్టి తిరిగి వచ్చిన చోటికే దాన్ని పంపించింది రత్నం. "ఫైన్ కట్" అని కేకలు చెలరేగేయి. కృష్ణుడు అందుకోలేకపోయేడు. గేలరీలో గోల అతన్ని కలవరపరిచింది. ఆ తొందర్లో కొంచెం ముందుకువంగేసరికి కాలు జారింది కూడాను. ఏమయితేనేం? అయిదు పాయింట్లతో రత్నమే గెలిచింది. తెచ్చిపెట్టుకున్నమందహాసంతో కరస్పర్శ చేసి కంగారు కప్పిపుచ్చుకున్నాడు కృష్ణుడు.

★★★

సాయంత్రం సుమారు ఆరుగంటలవుతుంది. తమ్ముణ్ణి ఎత్తుకుని పార్కులోకి వచ్చింది రత్నం. కృష్ణమూర్తీ అక్కడికి రావడం తటస్థించింది. రత్నాన్ని మొదట్లో చూసీ చూడనట్టు ఊరుకుందామనుకున్నాడు. కాని మనస్సులో ఏదో గుంజులాటగా వుంది. తటపటాయిస్తూ అటు మొగం పెట్టి నిల్చున్నాడు. అతను పలకరించకుండా వుంటే తను మాత్రం ఎందుకు మాట్లాడాలని తటస్థంగా వూరుకుంది రత్నం. ఎట్టకేలకి కృష్ణుడే దగ్గిరికి వచ్చి, చిన్న దగ్గుతో గొంతుక సవరించుకుని ప్రారంభించేడు ___

"హల్లో! మీరు ఔనా కాదా అని మొదట్లో సంకోచించేను."

"అవునండీ, ఇంట్లో వంటావార్పూ మూలాన్ని సాధారణంగా తీరిక గాదు."

"ఏం ? మీ యింట వంటలక్క లేదూ ?"

"వంటమనిషి చేసిన వంటా, ప్రయివేటు మేస్టరు చెప్పిన చదువూ వంటపడాతాయిటండీ ?"

ఈ మాట కృష్ణమూర్తికి కొరడా దెబ్బలాగ తగిలింది. ఇంగ్లీషుకని దొరని ట్యూటరుగా పెట్టుకున్నాడు. అయినా పోటీలలో మొదటి బహుమతి రాలేదాయిరి ! కాస్సేపు మౌనముద్ర వహించి తిరిగి అందుకున్నాడు. విసురుగానే వెళుతున్నాయి మాటలు. చివరకి యింకపట్టలేక అనేసేడు; "మీకు చాలా మనోధైర్యం ఉందండీ"

"ఔను మీకు నమ్రతానూ"

"ఛలోక్తి మీదగ్గిరే నేర్చుకోవాలి"

"నిదానం మీదగ్గిరానూ"

"మీరు పరుషంగా మాట్లాడుతారు"

"దైన్యత భరించగలం గాని హైన్యత భరించలేంగదా"

"నేనంటే మీకు కోపమా ?"

"నా మాటల్లో అటువంటి భావం మీకు స్ఫురిస్తే అది నేను ఉద్దేశించలేదని నమ్మండి."

"ఈ సంభాషణ నా మట్టుకు నాకే వింతగా కనిపిస్తోంది. మనం వివాహం చేసుకుంటే సంతతికి నా అంతస్తూ, మీ తెలివితేటలూ వస్తాయేమో ?"

"బెర్నార్డుషాని యిటువంటి ప్రశ్నే వేస్తే యేం జవాబు యిచ్చేడో మీకూ తెలుసునుగా ?"

"నేను నోరు విడిచి మిమ్మల్ని అడుగుతున్నాను. ఇదే తొలిసారికాదు."

"మీరంత క్రిందికి దిగి పోవలసిన అవసరం లేదు. నేను నిరాకరిస్తున్నాను... క్షమించండి. చీకటిపడుతోంది. మళ్ళీ కలుద్దాం."

★★★

రత్నప్రదీపికారోచిస్సులు నానాటికీ నలుదిశలూ వ్యాపించిపోతూ వుంటే కృష్ణమూర్తికి పచ్చి వెలగకాయ గొంతుకడ్డపడ్డట్టుంది. ఒక వైపు అహం పట్టుకు వదలదాయే; మరొకవైపు రత్నం ప్రతిభా విశేషాలు అయిస్కాంతంలాగ తీవ్రంగా ఆకర్షిస్తున్నాయి. అక్కడికీ తన మనోరథం తెలియజేసేడు. బెట్టుసరి మూలాన్ని వ్యవహారం పొసిగింది కాదు. అయినా ఆమె అంటే అతనికి గౌరవం తగ్గలేదు; కాగా, రోజు రోజుకీ అది మరీ ఎక్కువయి మమకారంతో మిళితమయి పోతోంది. నెమ్మదిగా యీ సంగతి సరోజా వెంకట్రావులతో అన్నాడు.

"నేను చెబుతూనే ఉండలేదట్రా, నువ్వు కాస్త రెండు కళ్ళూ విప్పి ప్రపంచకాన్ని చూస్తేగాని లాభం లేదని?" అన్నాడు అంతావిన్న వెంకట్రావు.

కృ ___ నేనేం తప్పుచేసేనో నాకే తెలియడంలేదు.

"నీ మొహం. నలుగురితోనూ సమానంగా తిరగకపోవడమే ఒక గొప్పతప్పు. అలాంటివాడివి నీ నాలుగు గోడల మధ్యా పడివుండాలి."

"అంటే నేనా అమ్మాయి అంతస్తుకి దిగిపోవాలన్నమాట."

"నువ్వు ఎక్కడికీ దిగి పోనక్కరలేదు. ఉన్నవాళ్ళు తింటారు లేనివాళ్ళు పస్తుంటారు. ఆ గొడవ నీకెందుకూ? చేతనయిందా చేతనయిన సాయం చెయ్యి; లేదా వూరుకో. అంతే గాని పేదవాళ్ళంటే విసుగెందుకూ ? కూటికి పేదలయితే కులానికి పేదలా ? వాళ్ళకి మట్టుకు తెలివి తేటల్లేవా?"

"అదీ నిజమేలాగ కనిపిస్తుంది."

"ఇంకొక్క ముక్క జ్ఞాపకం వుంచుకో. నువ్వు కదిపేవు కనక చెబుతున్నాను. ఒకర్నిచిన్నతనంపుచ్చడం ఏంవంత మహావిశేషం కాదు; ఏ ఒక్కరి స్వంత హక్కూనూ కాదు. దానికి అనేక మార్గాలున్నాయి."

దీంతో కృష్ణమూర్తి వెర్రివాడిలాగ చూస్తూ కూర్చున్నాడు నిశ్శబ్దంగా సిగరెట్టు పొగ వదుల్తూ.

★★★

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి రత్నం"

"ఏవిషయంలో సరోజా?"

"కృష్ణుడు నిన్ను వరించేట్టగా"

"అందుకే నువ్వు నన్ను అభినందిస్తున్నట్టయితే నాకన్న అదృష్టహీనురాలు యింకోర్తె ఉండదనుకో"

"ఏం?"

"అన్నీ తెలిసి నువ్వూ అలాగ అడుగుతావేం సరోజా? అతను గాలిలో ఎగురుతాడు; నేను నేలని వదలను. అతనికి దర్జా కావాలి; నాకు గొప్పతనంతో పనిలేదు. అతను ప్రతిభాశాలినని భావిస్తాడు; నేను నేర్చుకోతగ్గ విషయాలు లక్షలున్నాయని నాకు తెలుసును. మా యిద్దరి బుద్ధులూ వ్యత్యస్తమార్గాలని సంచరిస్తూవుంటాయి. ఇంక మాకు ఎలాగ పొసుగుతుందీ? ఒక్క శాఖవాళ్ళం అయితేసరా?"

"అతని ప్రవర్తనలో మార్పువస్తేనో?"

"మిట్టమధ్యాహ్నం తకీమని సూర్యుడస్తమించి చంద్రుడుదయిస్తేనో?"

"చూస్తావుగా"

"శల్య సారథ్యం కాబోలు"

"నీకే తెలుస్తుందిలే శల్య సారథ్యమో కృష్ణసారథ్యమోను"

"ఎందుకీ వేళాకోళం?"

"అతనంటే నీకు అసహ్యమా?"

"అతని ప్రవర్తనా, సంకుచిత బుద్ధీ ఏహ్యంగా కనిపిస్తాయి నాకు"

"తదితర లక్షణాలమాట"

"............................"

"మౌనం అర్ధాంగీకారమా?"

"నేను యిదమిత్థం అని నిర్ణయించలేకుండా వున్నాను"

"అతను నీ క్షమాపణ కోసం కలవరిస్తున్నాడు"

"నేను ఒఖ్కర్తెనీ క్షమించవలసిన విషయం ఏఁవీ లేదు"

"అతని ప్రవర్తనలో మార్పువచ్చిందంటే నమ్ముతావా?"

"ఈ నెల్లాళ్ళ సెలవల్లోనే? యింతకీ లోకమే తన్నిర్ధారణ చెయ్యాలిగదూ?"

★★★

ఆర్నెల్లయింది. రత్నానికి అంతా అయోమయంగా కనిపిస్తోంది. కృష్ణమూర్తి ప్రతివాళ్ళతోటీ సరదాగా తిరుగుతున్నాడు. తనతో మాట్లాడేటప్పుడు తండ్రి దండనకి జడిసిన బిడ్డలాగ ప్రవర్తిస్తున్నాడు. అయినా ఎవరినోట చూసినా "కృష్ణమూర్తికి కళ్ళు విడ్డా"యన్నమాటే. సాధారణంగా క్లబ్ రూమ్ లో ఏ విదేశపత్రికో పుచ్చుకుని కూర్చునేవాడు నిన్నా నేడూ స్నేహితుల యోగక్షేమాలు కనుక్కుంటున్నాడు. ఒకళ్ళిద్దరు బీద విద్యార్థులకి జీతాలు కట్టేడని కూడా వినికిడి. బర్మా ఇవే క్యూయిలకి భోజనాలు పెట్టే సమయంలో తను స్వయంగా నడ్డికట్టుకుని యిత్తడిచేట పట్టుకున్నాట్ట; కొందరికి బట్టలు కూడా యిచ్చేడంటున్నారు. ఇదంతా నిజమేనా? తన కళ్ళనీ, చెవులనీ తనే నమ్మలేకుండా వుందా?....

శ్రావణ భాద్రపదాలు. అరగంటకి కాలేజీ విడుస్తారనగా కారుమబ్బులు కమ్మి కుంభవృష్టి కురిసింది. ఇంకా చిన్న చినుకు పడుతూనే వున్నా జనం నెమ్మదిగా గొడుగుల ఆసరాని యిళ్ళు చేరుకుంటున్నారు. రత్నం రిక్షా మాట్లాడుకుంటోంది. ఇంతట్లో కృష్ణమూర్తి తన కార్లోకి ఆహ్వానించేడు. గమ్యస్థానాలు భిన్న దిశలనున్నాయని మొదట్లో నిరాకరించించి రత్నం; కొసకి అతడి బలవంతం మూలాన్ని ఒప్పుకోక తప్పింది కాదు. రోడ్డు నిరాటంకంగా వుండేమో పదినిమిషాల్లో రత్నం యిల్లు చేరుకుంది కారు. తను దిగకుండానే "ఇంక నాకు సెలవా? మీకు

యీమాత్రం పరిచర్య చెయ్యగలిగినందుకు ధన్యుణ్ణి" అన్నాడు కృష్ణుడు. టీ పుచ్చుకుని వెళ్ళమంది రత్నం. అదే ప్రథమం కృష్ణమూర్తి వాళ్ళ యింట్లో కాలుపెట్టడానికి. సావిట్లో ఆమె నాన్నగారు కనిపించేరు. రత్నం వారిరువురికీ పరిచయం చేసి టీ తేవడానికి లోపలికెళ్ళింది. ఆ పావుగంటలోనూ వారిద్దరికీ ఎంత అంతర్యం ఏర్పడిందో మరీ "అంత గొప్ప యింటి బిడ్డయినా ఎంత నమ్రతా కృష్ణమూర్తికీ" అన్నారు రత్నం నాన్నగారు రాత్రి భోజనాల దగ్గిర. బహునిదానమయిన మనిషి తన తండ్రే అన్న యీమాట విని రత్నం చాలా ఆశ్చర్యపోయింది.

మరి రెండు నెలలకల్లా ఆమె మృదుల హస్తాన్ని వజ్రపుటుంగరం అలంకరించింది !




# శుభవార్త

## –మురళీధర్

(యువ మాసపత్రిక, 1962 ఫిబ్రవరి సంచికనుంచి పునర్ముద్రణ)




ఆ సాయంత్రంలో ఏమీ ప్రత్యేకత లేదు ఒకరకంగా చూస్తే డిశంబరు నెల కావడంవల్ల చలికాస్త ఎక్కువగా వేస్తోంది. ఆరు కాకుండానే చీకటి కమ్ముకొస్తోంది. నెలలో మొదటి వారం కావడం వల్ల కాస్త హడావిడిగా అటూ యిటూ రిక్షాల్లో సామాన్లు చేరవేసుకుంటున్నారు.

పుతిలీబావిడీ నుంచి జంటలు జంటలుగా సీతాకోక చిలకల్లాగ వస్తూన్నారు సుల్తాన్ బజార్లోకి అందరూ.

సుల్తాన్ బజార్లో సుల్తానూ ఫకీరూ ఒకటే ఏమీ పనిలేకపోయినా ఏదోపని ఉన్నట్లు అటూయిటూ తిరుగుతారు కాస్త కాళ్ళు నొప్పిపుట్టగానే జంక్షన్ లో ఆగుతారు. ఆ ఇరానీ కేఫ్ లో ఒక కప్పు టీ తాగుతారు. మళ్ళా తిరగడం మొదలెడతారు. ఇదో వరస.

కృష్ణారావు సైకిల్ దిగి స్టాండువేసి ఇరానీ హోటల్లోకి వెళ్ళాడు. టీ త్రాగుతూ కూర్చున్నాడు. అక్కడకు తను ఏళ్ళతరబడి వస్తున్నాడు. ఎన్ని గాలన్ల టీ త్రాగాడో తను యిక్కడ? తనతోబాటే క్లాస్మేట్ శంకర్ వచ్చేవాడు అక్కడికి. ఇప్పుడు శంకర్ తహసీల్దార్ అయి ఊరుకున్నాడు ఆ ఉద్యోగానికి తనకూ ఇంటర్వ్యూ వచ్చింది కాని తను సెలక్టు కాలేదు తనకీ కావలసిన సిఫార్సు లేదు ఉద్యోగం రాకపోవచ్చని తెలిసినా దరఖాస్తు పెట్టాడు పరీక్ష రాశాడు 'ఇంటర్వ్యూ' కు వెళ్ళాడు ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాడు. అప్పుడు వాళ్ళందరూ నవ్వుతూనే ఉన్నారు. వాళ్ళ ముఖాల్నిబట్టి చూస్తే తనకు ఉద్యోగం వచ్చేసినట్లే అనిపించింది. ఆ తర్వాత తను సెలక్టు కానట్లు తెలిసింది. ఆ ఉద్యోగం వస్తుందని దరఖాస్తు పెట్టేటప్పుడే తెలుసునట శంకర్ కు. అయినా గడుసువాడు గనక ఎవ్వరికీ చెప్పలేదు.

ఇంతెందుకు ? కృష్ణారావుకు ఆ ఉద్యోగం రాలేదు. ఇంతకుముందు యిట్లాగి యింతకన్న పెద్ద ఉద్యోగాలు దరవాజాదాకా వచ్చి వెనక్కి పోయాయి. దాంతో ముఖం మొత్తిపోయి ఒక్క విషయం తేల్చుకున్నాడు. తను యింక ఏ పెద్ద ఉద్యోగానికీ దరఖాస్తు పెట్టడు దరఖాస్తు పెట్టకపోయిన తర్వాత ఉద్యోగం రావటమన్న సమస్యే ఉండదు ! అంటే పెన్షన్ కోసం మృత్యువుకోసం ఎదురుచూస్తూ గుమాస్తాగా స్థిరపడి పోవడమేనన్నమాట...

కృష్ణారావుకు పెళ్ళి అయి రెండేళ్ళయింది భార్య లత మెట్రిక్ ప్యాసైంది. ఇద్దరిదీ చక్కని జంట అని అనుకున్నారందరూ. ఈ రెండేళ్ళ వైవాహిక జీవితంలో చూడవలసిన అన్ని స్థితులూ చూసేశాడు.

కృష్ణారావుకు జ్ఞాపకం వచ్చింది. లత సినిమాకు వెళదామంది సాయంత్రం. ఆవాళ అయిదో తారీకైనా పర్సు ఖాళీగా ఉంది. పాలవాడికి యింకా నాలుగు రూపాయల ముప్ఫయి నయాపైసలు యివ్వాలి. ఈ నెలనుంచీ పేపరువాడికి అక్కర్లేదని చెప్పాలి. వెధవది  పేపరు కొనుక్కోవడానికి గూడా... సిగరెట్ల బ్రాండు మార్చాలి. సరకుల దుకాణంలో పూర్తిగా బాకీ చెల్లించలేదని గొడవ చేశాడు. వాడికి తన ఆర్థిక స్థితిని గూర్చి ఉపన్యాసంలాంటిది ఇచ్చాడు. వాడు ధరలు విపరీతంగా వేసేస్తున్నాడు. అక్కడ కాతా ఎత్తెయ్యాలి. కాతా ఎత్తెయ్యాలంటే డబ్బు ఇచ్చేయాలి. మళ్ళా అదే చిక్కు. ఏమైనా సరే తప్పదు. ప్రతివాడూ తన నెత్తిన బురద పూస్తూనే ఉన్నాడు.

లతకు వెడ్డింగ్ ఏనివర్సరీకి ఒక సిల్కు చీర కొందామనుకున్నాడు, ఆవాళ కలిసి సినిమాకు వెడదామనుకున్నాడు, కాని ఆనాడు బయట తిరగటానికి రిక్షా డబ్బులు కూడా లేకపోతే !

ఎదురుగా కప్పులో తాగగా మిగిలిన టీ చల్లారిపోయి చాలాసేపయింది. ఎంతకీ లేవడేం వీడు అన్నట్లుగా చూస్తూ క్లీనర్ టేబుల్ తుడిచేశాడు. ఒకటి రెండు టీ చుక్కలు లాగూ మీద పడ్డాయి. ఏమీ అనలేకపోయాడు. డబ్బు యిచ్చి టీ తాగుతున్నామని ఏకోశానా తెలియదు. ఈ క్లీనర్లకీ సర్వర్లకీను తింటుంటే యింకా ఎంత తింటావన్నట్లూ యింకెంత సేపు ఉంటావన్నట్లు కసిగా చూస్తారు.

తను జీవితంలో ఎన్ని కలలు కన్నాడు ? అప్పట్లో ఆ కలలన్నీ నిజాలవుతాయనే అనుకున్నాడు.

అద్దెయిల్లు చిన్నదీ అనువైనదీను. హాలులో చక్కగా రెండు కుర్చీలు. ఒక టీపాయ్. దానిమీద ఎంబ్రాయిడరీతో కుట్టిన టేబుల్ క్లాత్. ఒక ప్రక్కన యింకో చిన్న బల్లమీద రేడియో, పైన ఫ్లవర్ వేస్. ఇంటికి రాగానే చిరునవ్వుతో భార్య తలుపు తియ్యాలనీ తర్వాత యిద్దరూ కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుని హైద్రాబాదు వాళ్ళ ప్రాణానికి బీచిలాంటి టాంక్ బండ్ కు షికారు వెడతారు, అక్కడ బాగా చీకటిపడేదాకా ఉండి రిక్షామీద యింటికి వచ్చేస్తారు, ఇంటికొచ్చి భోజనం చేసి చల్లని తియ్యని కబుర్లతో గడిపేస్తాడు.

అబ్బ ! ఇవన్నీ ఎంత మామూలుగా కనిపించాయి ? ఒకప్పుడు శుద్ధ మామూలుగా కనిపించినవి ఆకాశసుమాలై ఊరుకున్నాయి యీనాడు.

ఎట్లాగైనా సరే అందని వాట్లను అందుకోక తప్పదు. తను గుమాస్తాగా ఉండి పోగూడదు. తనకు మార్పు కావాలి. అవును చాలీ చాలని జీతంతో జీవితం నలిగిపోనివ్వకూడదు. లతకు ఎన్ని ఆశలు చూపించాడు తను? డబ్బుదేముందనీ అంతా హృదయంలోనే ఉందనీ చెప్పాడు. అన్యోన్యంగా ఉంటే స్వర్గం దిగివస్తుందని చెప్పి నమ్మించాడు. తను నమ్మాడు కూడా ! ఇప్పుడు కోర్కెల సంగతి అట్లాఉంచి కనీసావసరాలు కాటేస్తూ ఉంటే ఊరుకోవలసి వస్తోంది.

బుర్ర వేడెక్కి గబుక్కున సైకిలెక్కాడు హోటలు బయటకు వచ్చిన కృష్ణారావు సైకిలు ఎక్కగానే పోలీసు కానిస్టేబులు చెయ్యి చూపించాడు ఆగమని. మరో నిమిషానికి వెళ్ళిపోయిన కార్లను చూస్తూ బద్ధకంగా సైకిల్ తొక్కుతున్నాడు.

కళ్ళుతిరిగాయి.. లోకం తనని తాను పోగొట్టుకున్నట్లు ఆపస్మారకంగా తిరిగింది.. ఒకే ఒక క్షణం !

వెనకాలనుంచి రిక్షాముందుకు వెళ్ళి మిగతా రిక్షాల్లో కలిసిపోయింది. ఫుట్ పాత్ మీది జనం అమూల్యమైన ఒక్క క్షణం క్రిందకుదిగి అటు చూశారు. ప్రవహించే నది ఆగిపోయినట్లు ట్రాఫిక్ ఆ క్షణం ఆగింది.

అవతలపడ్డ సైకిల్ తీసుకుని యివతల ప్రక్కనున్న కృష్ణారావు వళ్ళుదులుపుకుని మళ్ళీ మాట్లాడకుండా సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

సానుభూతి గుమ్మరించడం కోసం అక్కడ మూగబోతున్న వాళ్ళందరూ నిరాశగా ఫుట్ పాత్ మీదకు వెళ్ళిపోయారు.

ప్రపంచంలో మొట్టమొదటి మెట్టుపై ఉన్నట్లనిపించింది కృష్ణారావుకు జీవితంలో. సాధించేదీ సాధించవలసిందీ వాట్లకోసం పడేపాట్లూ అగచాట్లూ కట్టుకునే ఆశల భవంతులూ కూలిపోయే పేకమేడలూ సరిహద్దులుదాటి నీరై పోయే ఆవేశం యివన్నీ గోడమీద నీడల్లాగ కదిలాయి. పొగమంచులోంచి విడివడ్డ సూర్యబింబంలాగ కృష్ణారావు ముఖం వెలిగిపోతుంది.

నారాయణగూడ జంక్షన్ పక్కన తను ఉంటున్న యింటిదగ్గరకు రాగానే సైకిల్ దిగాడు కృష్ణారావు.

రోజుకన్నా చాలా ఉత్సాహంగా యింటికి వచ్చిన కృష్ణారావును చూసి లత 'ఏమిటి సంగతి' అన్నట్లు కళ్ళల్లోకి చూస్తూ, కళ్ళతోనే అడిగింది.

ఊరుకోలేక 'ఏమిటి మహా ఉషారుగా ఉన్నారు యివాళ' అన్నది చిలిపిగా కోటు విప్పదీస్తూ.

'నాకోకప్పు కాఫీ యిచ్చి, దబ్బున 'డ్రెసప్' అయిరా. ఈలోగా పక్కింటి మిత్రుడు రంగనాధం దగ్గరనుంచి అయిదు రూపాయలు బదులు తెస్తాను. మనం సినిమాకి వెడదాం, ఆలస్యం అయినాసరే...'

'ఏమిటి సంగతి ? ఏమిటో ఆ శుభవార్త ? నా చెవిలో వేస్తే నేనేం పన్ను వెయ్యను లెండి ?' అన్నది గారాబంగా లత.

అనుకున్నట్లు అన్నీ 'రెడీ' అయ్యాయి పది నిముషాల్లో, సినిమాకు వెళ్ళారు. పిక్చర్ మొదలెట్టినా. పెళ్లయిన క్రొత్తలో ఉన్నట్లుగా ఉన్నారు వాళ్ళు ఆ సాయంత్రం. సినిమాలో ఎన్ని సార్లు అడిగినా చెప్పనేలేదు కృష్ణారావు ఆ సంగతేమిటో.

'పోనీ మీరే దాచుకోండి' అన్నది కోపంగా, పిక్చర్ అయిపోతుందనగా యింక ఆపుకోలేక.

' నీకు చెబితేనే గాని నా అనుభూతి ఎట్లాగూ పూర్తికాదు. అయినా యింటికి వెడతాముగా ? ఇక్కడే ఉండిపోముగా ? ' అన్నాడు.

అది ఇంగ్లీషు పిక్చరు. తొందరగానే అయిపోయింది. ఇంటికి తాపీగా నడిచి వచ్చేసారు. భోజనం చేసిన తర్వాత, 'మనం బయటకు వెడదామా ?' అన్నాడు కృష్ణారావు.

'ఊ.... అంతకంటేనా ? కాని ఒక్క షరతుమీద. మీరు సాయంత్రం నుంచీ దాస్తున్న మాటను చెప్పాలి మరి.'

' ఇంక తప్పదా? అయితే విను. సాయంత్రం ఆఫీసునుంచి వస్తూంటే 'కోటీ' దగ్గర యాక్సిడెంట్ అయింది వెనకనుంచి రిక్షా 'డాష్' ఇచ్చింది. సైకిల్ మీదనుంచి పదిగజాల దూరంలో ఎగిరిపడ్డాను. అరక్షణంలో ప్రాణాపాయం తప్పింది. నేను యింకా బ్రతికున్నానని చెప్పడంకంటే శుభవార్త ఏముంటుంది లతా ?'

'షాక్' తగిలినట్లు కొన్ని క్షణాలు అట్లాగే ఉండిపోయింది లత. కళ్ళు తెరచి చూసేసరికల్లా అన్నీ క్రొత్తగా, వింతగా, నిండుగా, బరువుగా, శోభగా, వెల్లివిరుస్తూ వెలిగిపోతున్నట్లనిపించింది.

★★★★★★